ఈనాడు
హైదరాబాద్
HMDA

బీహెచ్‌ఈఎల్ నుంచి ఓఆర్ఆర్ మీదుగా విజయవాడకు గరుడ బస్సులు

బేగంబజార్, రామచంద్రాపురం, న్యూస్‌టుడే: పటాన్‌చెరు, బీహెచ్‌ఈఎల్, రామచంద్రాపురం ఓఆర్ఆర్ మీదుగా విజయవాడకు రెండు కొత్త గరుడ బస్సులను ఏర్పాటు చేసినట్లు టీఎస్ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఎండీ వీసీ సజ్జనార్ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రెండు బస్సు సర్వీసులు రాంచంద్రాపురం, బీహెచ్‌ఈఎల్, బీరంగూడ, చందానగర్, మియాపూర్, నిజాంపేట క్రాస్ రోడ్డు, హౌసింగ్‌బోర్డు మీదుగా జేఎన్‌టీయూ, రైతుబజార్, మలేషియన్ టౌన్‌షిప్, మై హోమ్ భుజా, సైబరాబాద్ కమిషనరేట్, టెలికాంనగర్ తదితర ప్రాంతాల మీదుగా ఓఆర్ఆర్ నుంచి విజయవాడ బయల్దేరతాయన్నారు. ట్రాఫిక్‌కు అవరోధం కలగకుండా రోజూ రాత్రి 9.30, 10.30 గంటల నుంచి రామచంద్రాపురం నుంచి బయల్దేరతాయన్నారు. విజయవాడ వెళ్లే ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం సూచించారు.

నృత్య కళా మహోత్సవం

బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్ కనులపండువగా సాగుతోంది. ఆదివారం ఈశాన్య రాష్ట్రాల సంస్కృతిని చాటేలా ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

బల్దియాకు పన్ను దన్ను

పాత ధరలను సవరిస్తున్న జీహెచ్ఎంసీ

రూ.50 కోట్ల అదనపు ఆదాయానికి అవకాశం

ఈనాడు, హైదరాబాద్: ఆస్తి పన్ను సవరణపై జీహెచ్ఎంసీ దృష్టి పెట్టింది. పాత ధరలతో పన్ను చెల్లిస్తున్న నిర్మాణాలు, మరో నాలుగు కేటగిరీల్లోని కట్టడాలను తొలుత లక్ష్యంగా చేసుకుంది. చదరపు అడుగుకు 60 పైసలు, 80 పైసల చొప్పున పన్ను చెల్లించే కట్టడాలకు బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు సుమోటోగా నోటీసుల జారీని ప్రారంభించారు. నాలుగు కేటగిరీల్లోని రెండు లక్షల నిర్మాణాలను సర్వే చేస్తే.. మొత్తంగా రూ.50 కోట్ల మేర ఆదాయం పెరగొచ్చని బల్దియా అంచనా.

తగ్గిన వసూళ్లు..

గత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరుతో పోలిస్తే.. ఈ నెలలో పన్ను వసూళ్లు తగ్గుముఖం పట్టాయి. దాంతో నెల జీతాలకు అవసరమైన నిధులపై జీహెచ్ఎంసీ ఆందోళనలో పడింది. ఇటీవల మొదలైన ఓటరు సర్వేలో, ఇతరత్రా కార్యక్రమాల్లో బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు నిమగ్నమయ్యారు. సమీక్షలు జరగడం లేదని, పన్ను రాబడిని నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి.


Property Tax
సున్నా విస్తీర్ణం
సున్నా ఆస్తిపన్ను
ఏడాదికి రూ.101 పన్ను చెల్లిస్తున్న వ్యాపార కేంద్రాలు
వాణిజ్య కేటగిరీ విద్యుత్తు కనెక్షన్లున్న భవనాలు, ఇళ్లు
వీరిపైనే దృష్టి..

వివరాల సేకరణతో ముందుకు..

పాత ధరలతో పోలిస్తే వార్షిక పన్ను 20-40శాతం మేర పెరగనుంది. ఈ ఆర్థిక సంవత్సరం పన్ను ఇప్పటికే చెల్లించిన చాలామందికి, ఇటీవల సవరణతో ఇంటి పన్ను పెరిగిన విషయం తెలియదు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని జనప్రియ, ఇతరత్రా పాత అపార్టుమెంట్లలోని ఇళ్లకు ఒక్కసారిగా నోటీసులివ్వడంతో స్థానికులు ఆందోళన వ్యక్తంచేశారు. విషయం కేంద్ర కార్యాలయానికి చేరడంతో, తక్కువ పన్ను చెల్లించే కేటగిరీలోని ఇళ్లకు నోటీసులు వద్దని కమిషనర్ ఆమ్రపాలి స్పష్టంచేశారు. తప్పుడు వివరాలతో, తక్కువ పన్ను చెల్లిస్తున్న నాలుగు రకాల నిర్మాణాలపై మాత్రం వెనక్కి తగ్గొద్దని, జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్ 213 ప్రకారం నోటీసులిచ్చి, పన్ను విలువ సవరించాలని బల్దియా నిర్ణయించింది. అందులో భాగంగా విద్యుత్తుశాఖ వద్ద ఉన్న సమాచారాన్ని తీసుకుంది. నివాస కేటగిరీలో పన్ను చెల్లిస్తున్న 50 వేల నిర్మాణాలకు వాణిజ్య కోటా విద్యుత్తు సరఫరా అవుతున్నట్లు తేలింది.

మూసాపేటలోని కాముని చెరువులో రసాయన వ్యర్థాలు పారబోస్తున్న వ్యక్తులు

పట్టిస్తే.. రూ.10 వేలు పారితోషికం

పరిశ్రమల వ్యర్థాలు డంపింగ్ చేస్తుంటే వెంటనే సమాచారమివ్వండి

ఈనాడు, హైదరాబాద్: కాలుష్య ఉద్గారాలను, పరిశ్రమల వ్యర్థాలను జలాశయాల్లో, జనావాసాల సమీపంలో ఎవరైనా పారేస్తుంటే..వెంటనే కాలుష్య నియంత్రణ మండలి నైట్ పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం ఇవ్వండి. ఉల్లంఘనులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టిస్తే పీసీబీ రూ.10వేల పారితోషికం ఇస్తుంది. పదేళ్లుగా ఈ కార్యక్రమం అమలవుతున్నా...పౌరుల్లో కనీస అవగాహన లేదు. అధికారులూ ప్రచారం కల్పించలేదు. కాలుష్య నియంత్రణకు, ప్రధానంగా పరిశ్రమల వ్యర్థాలను జలాశయాల్లో డంపింగ్ చేయడాన్ని అడ్డుకునేందుకు పీసీబీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కాలక్రమంలో ఇది మరుగునపడింది.

నైట్ పెట్రోలింగ్ పని తీరు ఇదీ.. పీసీబీ కేంద్ర కార్యాలయం, హైదరాబాద్, ఆర్సీపురం జోన్ కార్యాలయాల పరిధిలో మూడు నైట్ పెట్రోలింగ్ వాహనాలు తిరుగుతుంటాయి. ఒక్కో వాహనంలో ఒక అనలిస్ట్, ఏఈ, ఈఈ స్థాయి అధికారులు, సెక్యూరిటీ గార్డులు ఉంటారు. ఘాటు వాసనలు వచ్చినా, డంపింగ్ చేస్తున్నట్లు సమాచారం అందిన వెంటనే వీరంతా అక్కడికి చేరుకుంటారు. జీడిమెట్ల, బాలానగర్, కాటేదాన్, మల్లాపూర్, బొల్లారం పారిశ్రామిక ప్రాంతాలను నైట్ పెట్రోలింగ్ బృందం గమనిస్తూ ఉంటుంది. అధికారులు ఇచ్చే నివేదికపై 'పీసీబీ మెంబర్ సెక్రటరీ (ఎంఎస్)' స్థాయిలో నిత్యం సమీక్ష జరుగుతుంది.

ఈ నంబర్లను సంప్రదించాలి..

కాలుష్య నియంత్రణ మండలి నైట్ పెట్రోలింగ్‌ను 98667 76755, 98667 76718 నెంబర్ల ద్వారా సంప్రదించొచ్చు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారు. ఘాటు వాసనలు వెలువడినా, వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నట్లు గమనించినా, ఫొటోలు తీసి ఆధారాలను ఇస్తే సమస్య పరిష్కారంతో పాటు పారితోషికం లభిస్తుంది.

రెండు కి.మీ.లకు ఒక మెట్రో స్టేషన్

రెండోదశ డీపీఆర్‌లో ప్రతిపాదించిన హెచ్ఏఎంఎల్



ఈనాడు, హైదరాబాద్: మెట్రోరైలు రెండోదశలో ఆరు కారిడార్లలో ఖరారు చేసిన మార్గాలను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు సంస్థ (హెచ్ఏఎంఎల్) వెల్లడించడంతో.. స్టేషన్లు ఎక్కడ వస్తాయనే ఆసక్తి నెలకొంది. ఫోర్త్ సిటీ మినహా తొలుత ప్రతిపాదించిన ఐదు కారిడార్ల డీపీఆర్ సిద్ధం కావడంతో స్టేషన్లపై స్పష్టత వచ్చింది. సగటున రెండు కి.మీ.లకు ఒక స్టేషన్‌ను అధికారులు ప్రతిపాదించారు.

నాగోల్- శంషాబాద్ విమానాశ్రయం

(36.6 కి.మీ.– 24 స్టేషన్లు)

స్టేషన్లు: నాగోల్ (ఎయిర్‌పోర్ట్), నాగోల్ ఎక్స్‌రోడ్, అల్కాపురి కూడలి, కామినేని ఆసుపత్రి, ఎల్బీనగర్ (ఎయిర్‌పోర్ట్), బైరామల్‌గూడ, మైత్రీనగర్, కర్మన్‌ఘాట్, చంపాపేట రోడ్, ఒవైసీ ఆసుపత్రి, డీఆర్‌డీవో, బాలాపూర్ రోడ్, చాంద్రాయణగుట్ట(జంక్షన్), బండ్లగూడ రోడ్, మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్, ఆరాంఘర్, న్యూహైకోర్ట్, గగన్‌పహడ్, సాతంరాయి, సిద్ధాంతి, శంషాబాద్, కార్గో, విమానాశ్రయం

రాయదుర్గం - కోకాపేట నియోపొలిస్

(11.6 కి.మీ– 10 స్టేషన్లు)

స్టేషన్లు: బయోడైవర్సిటీ కూడలి, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, గోల్ఫ్‌కోర్స్, విప్రో కూడలి, పుప్పాలగూడ (భవిష్యత్తులో), ఓఆర్ఆర్ జంక్షన్, ఖానాపూర్, మూవీటవర్స్, కోకాపేట నియోపొలిస్

ఎంజీబీఎస్ - చాంద్రాయణగుట్ట

(7.5 కి.మీ.- 6 స్టేషన్లు)

స్టేషన్లు: సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, అలియాబాద్, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట(జంక్షన్)

మియాపూర్ - పటాన్‌చెరు

(13.4 కి.మీ.- 10 స్టేషన్లు)

స్టేషన్లు: మియాపూర్ ఎక్స్‌రోడ్, ఆల్విన్ చౌరస్తా, మదీనాగూడ, చందానగర్, బీహెచ్‌ఈఎల్, జ్యోతినగర్, బీరంగూడ, ఆర్సీపురం, ఇక్రిశాట్, పటాన్‌చెరు

ఎల్బీనగర్ - హయత్‌నగర్

(7.1 కి.మీ.- 6 స్టేషన్లు)

స్టేషన్లు: చింతల్‌కుంట, వనస్థలిపురం, ఆటోనగర్, లెక్చరర్స్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, హయత్‌నగర్

PRESERVE THE RIVER PROTECT OUR SHELTER
WE WANT JUSTICE SAY NO TO HOME DEMOLITION
వ్యవస్థలో లోపానికి శిక్ష సామాన్యుడికెందుకు?

మూసీ కూల్చివేతలపై నిరసన

మూసీ పరీవాహకంలో కూల్చివేతలకు వ్యతిరేకంగా భారాస ప్రజాప్రతినిధుల బృందం చేపట్టిన పర్యటన సందర్భంగా ఆదివారం బండ్లగూడ జాగీర్ పరిధి హైదర్షాకోట్‌లో మహిళలు నిరసన తెలిపారు. ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని, సబితారెడ్డి, గంగుల కమలాకర్ తదితరులు మద్దతు తెలిపారు. – న్యూస్‌టుడే, రాజేంద్రనగర్

ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోండి

- అపార్ట్‌మెంట్లపై ఒత్తిడి పెంచిన డిస్కం
- ఏడాది గడువు ఇవ్వాలంటున్న యజమానులు

ఈనాడు, హైదరాబాద్: బహుళ అంతస్తుల భవనాల్లో 20 కిలోవాట్ల లోడ్ దాటితే ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్) ఏర్పాటు చేసుకోవాల్సిందేనని వినియోగదారులపై విద్యుత్తు అధికారులు ఒత్తిడి పెంచారు. ఈ తరహాలో సిటీలో ప్రతి సర్కిల్‌లో 700వరకు కనెక్షన్లు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. వీటన్నింటికి పబ్లిక్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచే కనెక్షన్లు తీసుకున్నారు. ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాల్సిందిగా ఇప్పటికే అపార్ట్‌మెంట్లకు నోటీసులు జారీ చేశారు. దీనిపై సీఎండీ సమీక్ష చేస్తుండటంతో ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలని సిబ్బంది వెంటపడుతున్నారు.

రూ.3లక్షల వరకు వ్యయం.. చిన్న నియంత్రిక ఏర్పాటు చేసుకోవాలన్నా రూ.2.5-3 లక్షల వ్యయమవుతుందని ఇంజినీర్లు అంటున్నారు. ఇందులో అప్పటికే వినియోగదారులు చెల్లించిన డిపాజిట్ మొత్తాన్ని మినహాయిస్తామని చెబుతున్నారు. ఇప్పటివరకు 150 అపార్ట్‌మెంట్ల యజమానులు ముందుకొచ్చారని చెప్పారు. కాగా ఉన్నపళంగా రూ.లక్షల్లో వెచ్చించి డీటీఆర్ మార్చుకోవడం తమకు భారమని, కనీసం ఏడాది గడువు ఇవ్వాలని చాలామంది యజమానులు కోరుతున్నారు.

డా.ఉషాలక్ష్మిని సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే గాంధీ, డా.రఘురాం, సుధారెడ్డి, క్రిస్టినాచోంగ్తు

పింక్ షహర్

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు సుధారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం ఏర్పాటు చేసిన 'పింక్ పవర్ రన్' ఉత్సాహంగా సాగింది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఉషాలక్ష్మిని ఘనంగా సన్మానించారు. – న్యూస్‌టుడే, రాయదుర్గం

PINK POWER RUN

మళ్లీ పలకరించిన వరుణుడు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మోస్తారు వర్షం కురిసింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌కు స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఆర్సీపురంలో 56.3 మి.మీ, షేక్‌పేట 35 మి.మీ, గచ్చిబౌలి 33.8, చందానగర్ పీజేఆర్ స్టేడియం 33 మియాపూర్, గోల్కొండ 27.3, రాయదుర్గం వార్డ్ ఆఫీసు పరిధిలో 18.8 మి.మీ, లింగంపల్లిలో 17.3 మి.మీ వర్షపాతం నమోదైంది.

రెప్పదాటని కన్నీళ్లు

- ☛ పని చేసేచోట లైంగిక వేధింపులతో మానసిక కుంగుబాటు
- ☛ మహానగరంలో నామమాత్రంగా అంతర్గత కమిటీలు

ఈనాడు, హైదరాబాద్

● మాదాపూర్‌లోని కార్పొరేట్ సంస్థలో ఆమె 15 ఏళ్లుగా పని చేస్తూ గుర్తింపు తెచ్చుకుంది. అదేచోట ఉన్నత హోదాలో ఉన్న వ్యక్తి నుంచి లైంగిక వేధింపులు మొదలయ్యాయి. ఎవరికీ చెప్పుకోలేక కుంగుబాటుకు గురయ్యారు. తనవల్ల కాదని రాజీనామా చేశారు.

ఇలా ఎంతోమంది ఇంటా బయటా లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొనే వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు ఏర్పాటు చేసిన అంతర్గత కమిటీలు నామమాత్రంగా మారాయి. కొన్ని సంస్థలు కమిటీలనే ఏర్పాటు చేయక పోవడం గమనార్హం.

● దిల్లీకి చెందిన ఒక సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో 59 శాతం కంపెనీలు లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయలేదని గుర్తించారు.

నగర షీటీమ్స్‌లో నమోదైన కేసులు

ఫిర్యాదులు	సంవత్సరం	నిందితులు
1032	2020	713
1389	2021	1144
1153	2022	1268
982	2023	751
1400	2024 (సెప్టెంబరు)	1100

> **ఫిర్యాదు చేయండిలా**
>
> వాట్సాప్ నంబర్లు
> 94906 16555, 87126 56858
> డయల్ 100, ఛైల్డ్‌లైన్ 1098
> వెబ్‌సైట్:womensafetywing.telangana.gov.in

భయంతోనే బాధితుల వెనకడుగు

– డాక్టర్ మమతా రఘువీర్, తరుణి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్

దేశవ్యాప్తంగా 0.4 శాతం మంది మహిళలు మాత్రమే పని చేసే చోట ఎదురవుతున్న లైంగిక వేధింపులపై ఫిర్యాదుకు ముందుకొస్తున్నారు. అంతర్గత కమిటీలు నామమాత్రంగా మారాయి. యాజమాన్యం నిర్లక్ష్యంతో మహిళా ఉద్యోగులు కొలువులు వదిలేస్తున్నారు.

అటు ఆక్రమణలపై ఫిర్యాదులు

ఇటు నిర్వాసితుల నిరసనలు

ఈనాడు, హైదరాబాద్: మూసీలో అక్రమ నిర్మాణాల సర్వేపై నిర్వాసితులు ఒకవైపు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేస్తూ అడ్డుకుంటుంటే.. మరోవైపు అదే స్థాయిలో అక్రమ నిర్మాణాలపై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సామాజిక మాధ్యమాల వేదికగా హైడ్రాకు ఆక్రమణల వివరాలతో ట్యాగ్ చేస్తున్నారు. మూసీ నదీ గర్భంలో ఇళ్లు, ఆటస్థలాలు, షెడ్లు ఉన్నట్లు ఫొటోలతో సహా హైడ్రాకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నాగోల్ ప్రాంతంలో ప్రజాప్రతినిధుల అండతో ఓ వ్యక్తి మూసీ నదీగర్భంలోనే రెండు బాక్స్ క్రికెట్ గ్రౌండ్ల నిర్మాణం చేపట్టారని ఫిర్యాదులో ఆరోపించారు. హైడ్రా ప్రస్తుతం చెరువుల్లోని ఆక్రమణలపైనే దృష్టి పెట్టిందని.. ఇంకా మూసీ వరకు రాలేదని సంబంధిత అధికారులు అంటున్నారు.

కూల్చివేతలన్నీ హైడ్రాకు ముడిపెట్టవద్దు..

హైడ్రాకు సంబంధం లేని ఘటనలను ఆపాదిస్తూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తూ అప్రతిష్ఠపాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ హెచ్చరించారు. కూల్చివేతలన్నీ హైడ్రాకు ముడిపెట్టవద్దని అన్నారు. సంగారెడ్డి మల్కాపూర్ చెరువులో కూల్చివేతలు హైడ్రా చేపట్టలేదని తెలిపారు. సంగారెడ్డి కూల్చివేత ఘటనల్లో హోంగార్డ్ గాయమై చనిపోతే హైడ్రా బలితీసుకుందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం దురదృష్టకరం అన్నారు. ఇలాంటి తప్పుడు వార్తల్ని హైడ్రా ఖండిస్తోందని అన్నారు. బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకోవడాన్ని హైడ్రాకు ఆపాదిస్తున్నారని.. అక్కడ హైడ్రా ఎవరికి నోటీసులు కూడా ఇవ్వలేదని తెలిపారు.

కేంద్ర మాజీ మంత్రి బూచి చూపించి టోకరా

ఉపాధ్యాయుడి నుంచి రూ.70 వేలు కాజేత

ఈనాడు– హైదరాబాద్: ఓ కేంద్ర మాజీ మంత్రి ఆరోపణలు ఎదుర్కొంటున్న నగదు అక్రమ చలామణీ కేసులో నగరానికి చెందిన ఉపాధ్యాయుడి ప్రమేయం ఉందంటూ సైబర్ నేరగాళ్లు భయపెట్టి రూ.70వేలు వసూలు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్‌కు చెందిన ఉపాధ్యాయుడికి ఇటీవల ఓ నేరగాడు ఫోన్ చేసి తాము ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నుంచి మాట్లాడుతున్నానని.. గతంలో ఓ కేంద్ర మాజీ మంత్రిపై నమోదైన మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఫోన్ చేసినట్లు వివరించాడు. కేసు దర్యాప్తులో ఓ ఆధార్ కార్డు లింకు గుర్తించామని, అందులోని మీ పేరు, వివరాల ఆధారంగా కాల్ చేశామని, విచారణకు సహకరించాలన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు చెబితే లావాదేవీలను తనిఖీ చేసి ప్రమేయం ఉందో లేదో గుర్తిస్తామని చెప్పారు. ఉపాధ్యాయుడు నిజమేనని భావించి వివరాలు పంపాడు. మనీలాండరింగ్‌లో మీకు ప్రమేయమున్నట్లు తేలిందని, కేసు నుంచి తప్పించుకోవాలంటే డబ్బు చెల్లించాలంటూ రూ.70 వేలు బదిలీ చేయించుకున్నారు. అనంతరం ఇదంతా మోసమని గ్రహించిన ఉపాధ్యాయుడు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్నిరకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు 99635 22257
అమీర్‌పేట్ డివిజన్ 80085 97633
ఎల్.బి.నగర్ డివిజన్ 90000 15736
కూకట్‌పల్లి డివిజన్ 80085 15142
క్లాసిఫైడ్స్ యాడ్స్ కొరకు : 9908016959
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008012478, 8008611167

అశ్రునివాళి

పనిపట్ల మీకున్న నిబద్ధత, ఉన్నతమైన మీ ఆలోచనలు, విలువలు ఎందరికో స్ఫూర్తిదాయకం. మీరు ఎప్పటికీ మా హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉంటారు.

శ్రీ RSRKV రంగరాజు గారు

1958 - 2024

నాగార్జున ప్లాస్టిక్స్ | ఆదిత్య ఎలక్ట్రానిక్స్ | గ్రీన్ స్పేస్
స్నేహా ఏజెన్సీస్ | నాగార్జున ఫామ్స్ | గోదావరి అగ్రి ఫామ్స్

బాధాతప్త హృదయాలతో...

స్నేహితులు మరియు పార్ట్‌నర్స్

(c) eenadu

సికింద్రాబాద్

• సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్

నిబంధనలకు లోబడి ఉత్సవాలు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నవరాత్రోత్సవాలను జరుపుకోవాలని మహంకాళి ఏసీపీ సర్దార్‌సింగ్, రాంగోపాల్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావు సూచించారు. ఆదివారం రాంగోపాల్‌పేట్ ఠాణాలో దుర్గమాత మండపాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీజేలకు అనుమతులు లేవని, నిబంధనలకు లోబడి ఉత్సవాలు నిర్వహించుకోవాలని కోరారు.

కూరగాయల ధరలు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: టమాట 49, నల్ల వంకాయ 30, పొడుగు వంకాయ 28, బెండ 40, పచ్చిమిర్చి 28, బజ్జి మిర్చి 70, క్యాప్సికం 55, పచ్చకాకర 35, పందిరిబీర 28, క్యాబేజి 19, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 50, గోకరకాయ 40, కీర 18, దోస 28, బీట్‌రూట్ 28, ఉల్లి 50, ఆలు 36, చామ 40, మొరంగడ్డ 35, కంద 55, గోబీ 23, సొర 13.

జోరుగా భాజపా సభ్యత్వ నమోదు

సనత్‌నగర్‌లో సభ్యత్వాలు చేయిస్తున్న నేతలు

సనత్‌నగర్, న్యూస్‌టుడే: సనత్‌నగర్‌లో ఆదివారం భాజపా నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. పార్టీ సీనియర్ నాయకులు వెల్లాల రాంమోహన్ ఆధ్వర్యంలో నేతలు సనత్‌నగర్, సుభాష్‌నగర్, శ్రీరామ్‌నగర్, జయప్రకాష్‌నగర్, ధరంకరం రోడ్డు పరిసర ప్రాంతాల్లో పర్యటించారు.

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: భాజపా పట్ల యువకులు ఆకర్షితులై పెద్దఎత్తున సభ్యత్వం తీసుకుంటున్నారని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. ఆదివారం సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాస్‌నగర్ లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాలనీవాసులతో సమావేశం

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ తెలిపారు. ఐదో వార్డు పరిధిలోని శాంతిదీప్ కాలనీలో ఆదివారం 'మీట్ యువర్ మెంబర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సమస్యలు పరిష్కరించాలి

స్థానికులతో నీలిమ

పద్మారావునగర్: న్యూబోయిగూడ, గొల్ల కొమురయ్య కాలనీలోని జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కోట నీలిమ పరిశీలించారు. స్థానికులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

3 నుంచి నవరాత్రోత్సవాలు

సనత్‌నగర్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో అక్టోబరు 3 నుంచి ప్రారంభంకానున్న దేవీ నవరాత్రోత్సవాలకు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆలయ అధికారులు ఆదివారం ఆహ్వానించారు. ఆలయ ఈఓ మనోహర్‌రెడ్డి, అర్చకులు మారేడుపల్లిలో ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిశారు.

అడుగు పెట్టలేదు.. పాలు పొంగలేదు..

నిర్మాణం పూర్తయినా సాకారం కాని సొంతింటి కల

ప్రభుత్వమే సొంతింటి కల నెరవేస్తుందంటే సంబరపడ్డారు.. ఏకంగా రెండు పడక గదుల ఇల్లు అనేసరికి ఆశ్చర్యపోయారు.. చకచక పనులు పూర్తవుతుంటే మురిసిపోయారు. కానీ వారి ఆశ నెరవేరడానికి ఏళ్లుగా ఎదురుచూడాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇదీ మెట్టుగూడ డివిజన్ పరిధి చిలకలగూడ చింతబావిలోని రెండు పడకల ఇళ్ల సముదాయం పరిస్థితి.

సికింద్రాబాద్, న్యూస్‌టుడే:

అర్హులైన పేదవర్గాలకు రెండు పడక గదుల ఇళ్లను నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. నియోజకవర్గంలోని నాలుగు ప్రాంతాలను గుర్తించగా అందులో మెట్టుగూడ డివిజన్‌లోని చింతబావి, సీతాఫల్‌మండి డివిజన్‌లోని సుభాష్ చంద్రబోస్‌నగర్‌లలో నిర్మాణాలు ప్రారంభించారు.

నిర్మించిన ఇళ్లు

ఈ పథకం వచ్చిన కొత్తలోనే పెద్దఎత్తున ఇళు కట్టి పేదలకు ఇవ్వాలని భావించినా.. అనువైన స్థలాలు లేకపోవడంతో అడుగులు ముందుకు పడలేదు. అందుబాటులోని స్థలాల్లో స్థానికుల వరకే నిర్మించాలని నిర్ణయించారు. మొట్టమొదట మెట్టుగూడ డివిజన్ చిలకలగూడ చింతబావిలో స్థానిక రజక సంఘానికి చెందిన దోబీఘాట్ స్థలాన్ని గుర్తించారు. సెల్లార్ ప్రాంతంలో అధునాతన పద్ధతిలో దోబీఘాట్‌ను నిర్మించడంతోపాటు తొమ్మిది అంతస్తుల్లో ఇళ్లను నిర్మించి 200 మందికి అవకాశం కల్పించాలని 2014లో నిర్మాణానికి పూనుకున్నారు.


పగిలిన కిటికీ అద్దాలు

మూడేళ్లైనా పంచలేదు..

రెండు పడక గదుల ఇళ్లను పెద్ద సంఖ్యలోనే నిర్మించాలని అప్పటి ఉపసభాపతి, స్థానిక ఎమ్మెల్యే టి.పద్మారావు భావించారు. కనీసం 10 వేల మందికి ఇళ్లను కట్టించాలని, ఇందుకోసం నియోజకవర్గ పరిధిలోనే ఉన్న రైల్వే స్థలాల కోసం దిల్లీ స్థాయిలో ప్రయత్నాలు నెరిపారు. లాలాపేట, ఇసుకబావి ప్రాంతంలో 10 ఎకరాలకుపైగా స్థలాన్ని గుర్తించి దాన్ని తీసుకుని బదులుగా చర్లపల్లి వద్దనున్న ప్రభుత్వ స్థలాన్ని ఇచ్చేలా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ విషయంలో జాప్యం జరుగుతుండటంతో చిలకలగూడలోని చింతబావి దోబీఘాట్ వద్ద సుమారు ఎకరం స్థలం ఉండటంతో జీప్లస్ 9 అంతస్తుల నిర్మాణాలు మొదలుపెట్టారు. సీతాఫల్‌మండి సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లో జీప్లస్ 5 అంతస్తుల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు 2021 నాటికి పూర్తయ్యాయి.

2021జులైలో సీతాఫల్‌మండిలోని సుభాష్‌నగర్‌లో నిర్మించిన ఇళ్లను 2021 జులైలో దశలవారీగా లబ్ధిదారులకు అందించారు. చింతబావిలో నిర్మించిన ఇళ్లను ఇచ్చే క్రమంలో అధికారులు సర్వే చేయగా.. అందులో కొందరికి పక్కా ఇళ్లున్నాయని, ఇంకొందరి వివరాలు సరిగా లేకపోవడంతో పంపిణీ ఆపేశారు. అర్హుల జాబితాతో పాటు మరికొందరివి కలిపి 207 మంది పేర్లు నమోదైనా ఇప్పటివరకు తాళాలు అప్పగించలేదు. నిర్మాణం పూర్తయ్యి మూడేళ్లయినా అవి ఖాళీగా ఉండటంతో పాడైపోతున్నాయి. కిటికీల అద్దాలు పగిలిపోయాయి. సెల్లార్ ప్రాంతంలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

సికింద్రాబాద్: 8008573368
కంటోన్మెంట్: 8008573361
సనత్‌నగర్: 8008573356

కార్ఖానా, రెజిమెంటల్‌బజార్, కంటోన్మెంట్, న్యూస్‌టుడే:

? తిరుమలగిరి చిన్నమ్మ తోట బస్తీలో దోమల సమస్య తీవ్రంగా ఉంది. – **రాజు, స్థానికులు**

✓ ఫాగింగ్ చేయించి సమస్యను పరిష్కరిస్తాం.
– **మహేందర్, శానిటరి సూపరింటెండెంట్.**

? న్యూబోయిన్‌పల్లిలోని సీతారాంపురంలోని రహదారి గతుకులమయంగా మారింది. – **అజయ్‌కుమార్, సీతారాంపురం.**

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇబ్బందులు తీరుస్తాం.
– **జిష్ణు, అసిస్టెంట్ ఇంజినీర్.**

? సికింద్రాబాద్ రేతిఫైల్ బస్టాండ్ సమీపంలో రామకృష్ణ చౌరస్తా ప్రాంతంలో రోడ్డుపైనే బస్సులు నిలిపి ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తున్నారు. – **ప్రవీణ్‌కుమార్, రెజిమెంటల్‌బజార్**

✓ బస్సులను నిలపకుండా ఉండేలా చర్యలు తీసుకుంటాం.
– **వెంకట్ రాములు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గోపాలపురం.**

స్పందనకు వందనం

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: న్యూబోయిన్‌పల్లిలోని నందమూరినగర్ బస్తీలో పలుచోట్ల వీధి దీపాలు వెలగడంతో స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. 'ఈనాడు'లో వార్త ప్రచురించగా.. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేశారు.

◆

మహేంద్రాహిల్స్ రోడ్డు నెంబరు ఏడులో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీనిపై ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించి వీధి కుక్కలను తరలించారు.

సమావేశంలో కమిటీ ప్రతినిధులు, సభ్యులు

రాజీవ్ రహదారిని వంద అడుగులే విస్తరించాలి

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: జింఖానా మైదానం నుంచి తూముకుంట వరకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఎలివేటెడ్ కారిడార్‌లో భాగంగా రాజీవ్ రహదారిని 200 అడుగుల మేర విస్తరించాలని నిర్ణయించిందని, దీంతో వ్యాపారులు, ఆసుపత్రులు, ఇతర భవనాలు పెద్దఎత్తున కోల్పోవాల్సి వస్తుందని, దీన్ని వంద అడుగులకు కుదించాలని రాజీవ్ రహదారి రోడ్డు విస్తరణ బాధితుల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ తెలుకుంట సతీష్‌గుప్తా కోరారు. అమరావతికాలనీ సామాజిక భవనంలో ఆదివారం జేఏసీ సమావేశం నిర్వహించారు. సతీష్‌గుప్తాతోపాటు కమిటీ ప్రతినిధులు ఉప్పలంచ అమర్‌నాథ్, బొమ్మ శ్రీరామ్, కొమురవెల్లి వెంకన్న తదితరులు మాట్లాడారు. వాణిజ్య సముదాయాల్లో పనిచేసే వేలాదిమంది కార్మికులు ఉపాధిని, చిరువ్యాపారులు రోజువారీ భృతిని కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితుల పక్షాన నిలబడి న్యాయం చేయాలని కోరారు.

గుంతలుపడి.. కంకర తేలి


ఒకటో వార్డులో అయ్యప్ప సొసైటీ రోడ్డు


చిన్నతోకట్ట హనుమాన్ దేవాలయం మార్గం..

కంటోన్మెంట్‌లోని పలు ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా మారాయి ఇటీవల కురిసిన వర్షాలకు పరిస్థితి మరింత దిగజారింది. ఒకటో వార్డు చిన్నతోకట్ట నుంచి అయ్యప్ప సొసైటీ వెళ్లే మార్గం మట్టి దిబ్బలతో గతులకుమయంగా మారింది. బోయిన్‌పల్లి ప్రధాన రహదారి మార్గంలో హనుమాన్ దేవాలయం సమీపంలో మలుపు వద్ద కంకర రాళ్లు తేలడంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.
– న్యూస్‌టుడే, కార్ఖానా

స్వచ్ఛతలో మేము సైతం

కంటోన్మెంట్: కేంద్ర ప్రభుత్వ పిలుపుమేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఎన్‌సీసీ డైరెక్టరేట్ పరిధిలోని వివిధ విభాగాల ఎన్‌సీసీ క్యాడెట్లు జంట నగరాలలోని వివిధ ప్రాంతాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. చౌరస్తాల్లో నిలబడి పారిశుద్ధ్యంపై ప్లకార్డులు పట్టుకొని అవగాహన కల్పించారు.

వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం

కంటి పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

కార్ఖానా, న్యూస్‌టుడే: పేదలు నివసించే బస్తీల్లో ఉచిత వైద్య సేవలు అందించేందుకు ప్రైవేటు ఆసుపత్రులు ముందుకు రావడం అభినందనీయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ పేర్కొన్నారు. మూడో వార్డులోని కార్ఖానా దర్గా వద్ద బేగంపేట మెడికోవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం నేత్ర పరీక్షలు చేయించుకున్నారు.

తల్లి, ఇద్దరు పిల్లలు అదృశ్యం

అడ్డగుట్ట, న్యూస్‌టుడే: తల్లీ, ఇద్దరు పిల్లలు అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పీఎస్ పరిధిలో చోటుచేసుకొంది. సీఐ శంకర్‌నాయక్ వివరాల ప్రకారం.. యూకేలో ఉంటున్న వరుణ్, కృపపమ్మి(35)కి పదిహేనేళ్ల కిందట వివాహమైంది. వీరికి జోర్డన్ (12), జడన్ (8) కుమారులు. కృపపమ్మి ఆపిల్ కంపెనీలో పని చేస్తున్నారు. భర్తతో గొడవల కారణంగా ఆమె తన పిల్లలను తీసుకొని ఈనెల 19న ఇండియాకు వచ్చి సికింద్రాబాద్ కవాడిగూడలోని పుట్టింటిలో ఉంటున్నారు. 22న మహేంద్రహిల్స్ త్రిమూరితకాలనీలో ఉండే తన సోదరి ఇంటికి వెళ్లారు. అనుకోకుండా భర్త కూడా తన పుట్టింటికి రావడంతో షాక్‌కు గురైన ఆమె తిరిగి లండన్‌కు తీసుకెళ్తాడని భావించి ఈ నెల 26న పిల్లలతో కలిసి ఆటోలో వెళ్లిపోయారు. పిల్లలను తాను క్షేమంగానే ఉన్నానని, తన కోసం వెతకొద్దని సోదరుడు ప్రభు ఫోన్‌కు సందేశం పంపించారు. సోదరి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఈశాన్య కళ.. మిలమిల


గిరిజనుల గుడిసె నమూనా

బొల్లారం, న్యూస్‌టుడే: గిరిజన తెగలకు చెందిన 430 కళాకారులు తమ ప్రాంత ఆచార వ్యవహారాలకు అద్దం పట్టే అందమైన సంప్రదాయ కళారూపాలను ఆవిష్కరించారు. దీనికి బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం తొలిసారిగా వేదికైంది. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అతిపెద్ద భారతీయ కళా మహోత్సవంలో భాగంగా అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, త్రిపుర, సిక్కిం రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాల జీవన విధానానికి అద్దం పట్టే ప్రదర్శనలు అలరించాయి. ఆయా రాష్ట్రాలకు సంబంధించిన వస్త్రాలు, ఆహారం, హస్తకళలు గిరిజనులు వాడే పనిముట్ల ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు.

మేఘాలయ గిరిజనుల సంగీత పరికరాలు

స్టాళ్ల వద్ద సందర్శకుల రద్దీ



కుప్పకూలింది.. నాణ్యత తేలిపోయింది

రెజిమెంటల్‌బజార్‌లో ఏడాది కిందట నిర్మించిన వరద నీటి నాలా ఇది. పనుల్లో నాణ్యత ఎలా ఉందో చెప్పడానికి ఈ చిత్రమే నిదర్శనం. సుమారు రూ.27 లక్షలతో గతేడాది నిర్మించారు. పనులపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారు నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. మూడు నెలల కిందటే నాలా గోడలు కూలిపోయి.. పైన వేసి ఫలకలు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. చెత్త తొలగించే వాహనాల కారణంగా దెబ్బతిందని, త్వరలోనే బాగు చేయిస్తామని జీహెచ్ఎంసీ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. – న్యూస్‌టుడే, రెజిమెంటల్‌బజార్

ఘనంగా వీడ్కోలు

సనత్‌నగర్, న్యూస్‌టుడే: సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ఆలయ ఈవో శ్రీనివాస రాజు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు.

అలరించిన బృందగాన పోటీలు

రెజిమెంటల్‌బజార్: భారత్ వికాస్ పరిషత్ ఛత్రపతి శివాజీ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బృందగాన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ పాఠశాలల నుంచి హిందీ, సంస్కృతం, జానపద విభాగాల్లో 22 బృందాలు పాల్గొన్నాయి. ముఖ్యఅతిథిగా ట్రెస్మ పెసిడెంట్ ఉమామహేశ్వరరావు, అతిథులుగా తెలంగాణ భారత్ వికాస్ పరిషత్ ప్రాంత్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్, నివే మెటల్ ప్రొడక్ట్స్ ఎండీ విశాల్ హాజరయ్యారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

PUBLIC NOTICE

The general public is hereby informed that our client, **Sri. Ritesh Jain S/o Sri. Naresh Chand Jain** resident of H.No 3-4-5/2, 3rd Floor, Bommmana Galli, Kachiguda, Hyderabad **is intending to purchase all the Southern part & Northen part of PLOT No. 146, admeasuring 252 Square Yards or 210.7 Sq. Mtrs, in Sy. No. 69/1 and 69/2 of the Ravi Co-operative Housing Society Limited, situated at Ravi Colony, Trimulgherry, Secunderabad Cantonment, Hyderabad, Telangana** from their legal and absolute owners, **M/s. NIHANI ENTERPRISES, (PAN-CXVPA7915C) Office Address: 1st Floor, Plot no. 10A, I.O.B Colony, Trimulgherry, Secunderabad, Hyderabad, Telangana State-500015, Represented by Sri. AKUMALLA NIKHIL KRISHNA, S/o. Mr. Rajendra Akumalla, aged about 25 years, Occupation: Business, R/o. Plot No. 148, Ravi Colony, Opp. RTC Colony, Trimulgherry, Secunderabad, Hyderabad, Telangana State-500015, T.S, Aadhar No. 2470-0904-9326** for an agreed sale consideration and paid advance. Hence, the public is hereby informed that any person(s), financial institutions, organizations, creditors, etc., having any Claim, Title, Right, Interest, Charge, Mortgage, Objections or any other encumbrances pertaining to the property mentioned above may contact the undersigned with relevant supporting documents and title deeds in support of their Claim, Title, Right, Interest, Charge, Mortgage, Objections or any other encumbrances within seven (7) days from the date of issue of this notice, failing which, my clients shall thereafter proceed with the registration formalities for completing the above sale transaction. No Claim shall be entertained thereafter.

Sd/- **P.GOWRI DEVI,** ADVOCATE
Nallakunta, Hyderabad
Cell: **9848146963**

కార్మిక, కర్షకుల గళం సీతారాం ఏచూరి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ప్రొ.నాగేశ్వర్

లాలాపేట, న్యూస్‌టుడే: కార్మికులు, కర్షకుల సమస్యలపై నిరంతరం గళమెత్తిన గొప్పనాయకుడు సీతారాం ఏచూరి అని పలువురు వక్తలు కొనియాడారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథి మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ ఆయన నమ్మిన సిద్ధాంతం కోసం పోరాటం చేసిన మహనీయుడని తెలిపారు. ఆయనతో కలిసి ఓయూలో విద్యార్థి సంఘాన్ని ఏర్పాటు చేసుకున్న సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వీరయ్య, ప్రొఫెసర్లు కొండ నాగేశ్వర్, రామ్ షెపర్డ్, ఆమంచి నాగేశ్వర్ ప్రసంగించారు. ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి రవి నాయక్‌తో పాటు పలువురు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

'గాంధీ' కళాశాలకు డా.విజయభారతి భౌతికకాయం

సనత్‌నగర్, గాంధీ ఆసుపత్రి, ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ప్రముఖ రచయిత్రి డా.విజయభారతి భౌతికకాయాన్ని కుటుంబసభ్యులు ఆదివారం సికింద్రాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాలకు అప్పగించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సనత్‌నగర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. బంధువులు, అభిమానుల సందర్శనార్థం ఆదివారం ఉదయం కుందన్‌బాగ్‌లోని ఐఏఎస్ క్వార్టర్స్‌లోని ఆమె నివాసంలో భౌతికకాయాన్ని ఉంచారు. మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న, ఐఏఎస్ అధికారులు దానకిషోర్, బుద్ధప్రకాష్, రవిబాబు, బోయి విజయేంద్ర, ఐఆర్‌పీఎస్ భరత్‌భూషణ్, జస్టిస్ చంద్రయ్య, తదితరులు నివాళులర్పించారు.

సమస్యలను పట్టించుకోని ప్రజాప్రతినిధులు

అంబర్‌నగర్‌లో సమస్యలు రాసుకుంటున్న భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్

బౌద్ధనగర్, న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధులు సమస్యలను పట్టించుకోకుండా గాలికొదిలేశారని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి ప్రసాద్ గౌడ్ విమర్శించారు. బౌద్ధనగర్ డివిజన్‌లోని అంబర్‌నగర్ బస్తీలో ఆయన పాదయాత్ర చేసి సమస్యలు తెలుసుకున్నారు. అధ్వాన రహదారులు, కలుషిత జలాలు, దోమలు తదితర సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారని, వీటిని పరిష్కరించకుంటే త్వరలో ఆందోళనలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో అశోక్‌నగర్ బస్తీ అధ్యక్షుడు ఓములు, ఆర్.నర్సింగ్, రాజు, శ్రావణ్, కుమార్, విజయమ్మ పాల్గొన్నారు.

ఆసుపత్రులు, మెట్రోస్టేషన్లే లక్ష్యంగా చోరీలు

వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, మెట్రోస్టేషన్ల వద్ద పార్కింగ్ చేసిన బైకులే లక్ష్యంగా చోరీ చేస్తున్న దొంగను చిలకలగూడ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.10 లక్షల విలువ చేసే 18 బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఠాణాలో ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి వివరాలు వెల్లడించారు. కామారెడ్డికి చెందిన శ్రీనివాస్ కూలీ చేస్తుంటాడు. కుటుంబ పోషణకు డబ్బులు చాలక నగరంలోని చర్లపల్లికి వచ్చి బైకుల దొంగతనం మొదలుపెట్టాడు. దొంగిలించిన వాహనాన్ని తక్కువ ధరకు విక్రయిస్తుంటాడు. రెండ్రోజులుగా గాంధీ ఆసుపత్రి ఆవరణలో బైకులు మాయమవుతుండంతో.. బాధితుల ఫిర్యాదుతో చిలకలగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్ నేతృత్వంలోని సిబ్బంది మాటు వేసింది. సీసీ పుటేజీల ఆధారంగా శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. నీలోఫర్, ఈఎస్ఐ, ఉస్మానియా ఆసుపత్రులు, మియాపూర్, మెట్టుగూడ, నాంపల్లి మెట్రోస్టేషన్లు, మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పార్కింగ్ చేసిన బైకులు దొంగిలించినట్లు అంగీకరించాడు. శ్రీనివాస్‌తో పాటు బైకులను కొనుగోలు చేసిన ఏసురత్నం, శాంతారావును అదుపులోకి తీసుకున్నారు.

రెడ్డి ప్రజాప్రతినిధులకు సత్కారం 6న

ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి ఆహ్వాన పత్రం అందిస్తున్న రెడ్డి జేఏసీ నేతలు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో వచ్చే నెల 6న హైటెక్‌సిటీ శిల్పారామంలో తెలంగాణలోని రెడ్డి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, ప్రభుత్వ ముఖ్య సలహాదారులను సత్కరించనున్నట్లు జేఏసీ ఛైర్మన్ అప్పమ్మగారి రాంరెడ్డి, కోఛైర్మన్ పైళ్ల హరినాథ్ రెడ్డి తెలిపారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. మహబూబ్‌నగర్ ఎమెల్యే మధుసూదన్‌రెడ్డిని ఆహ్వానించినట్లు చెప్పారు. రెడ్డి కుటుంబ సభ్యులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూత్ ప్రెసిడెంట్ బుట్టంగారి మాధవరెడ్డి, స్టేట్ కోఆర్డినేటర్ నరెడ్డి రవీందర్‌రెడ్డి, బి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


పదవీ విరమణ శుభాకాంక్షలు

సౌమ్యులు, కార్యదీక్షాపరులు, వృత్తినే దైవంగా భావించి అంకిత భావంతో వివిధ హోదాలలో సుదీర్ఘ సేవలు అందించి అందరి మన్ననలకు పాత్రులై నేడు 30-09-2024 పదవీ విరమణ చేస్తున్న

శ్రీ నాగయ్య గారికి

ఇవే మా హృదయ పూర్వక శుభాకాంక్షలు మీరు, మీ కుటుంబసభ్యులు ఎల్లవేళలా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని కోరుకుంటూ...

శ్రీ M. నాగయ్య
Dy CSO/ Sig & Tele , SCR, Secunderabad

JNTU Anantapur
Bahujan Alumni Association

(c) eenadu

మల్కాజిగిరి

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్, న్యూస్‌టుడే: (ఆదివారం నాటివి..కిలో రూ.లో) టమాటా 49, వంగ 28, బెండ 40, పచ్చిమిర్చి 28, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 19, క్యారెట్ 35, దొండ 35, ఆలు 36, ఉల్లి 54, సొర 13, పొట్ల 18, బీన్స్ 55, గోరుచిక్కుడు 40, చిక్కుడు 50, దోస 28, బీర 28, కాకర 35, చామగడ్డ 40, కీర 35, క్యాప్సికం 55, బీట్‌రూట్ 28, కందగడ్డ 55, చిలకడదుంప 35, మామిడి 65, మునగ 75, ముల్లంగి 7(ఒకటి).

రామకృష్ణాపురంలో..

డిఫెన్స్‌కాలనీ: టమాటా 49, వంగ 35, బెండ 40, పచ్చిమిర్చి 28, కాకర 35, బీర 28, క్యాబేజీ 19, బీన్స్ 55, క్యారెట్ 35, దొండ 35, చిక్కుడు 50, క్యాప్సికం 55, ఆలు 36, కీర 18, దోస 28, చామగడ్డ 40, అరటి 11, బీట్‌రూట్ 28, సొర 13, గోకర 40.

కుంగిన మ్యాన్‌హోళ్లతో ఇబ్బందులు

గౌతంనగర్, న్యూస్‌టుడే: గౌతంనగర్ డివిజన్ మల్లికార్జున్‌నగర్ ప్రధాన మార్గంలో పలు మ్యాన్‌హోళ్లు కుంగి ప్రమాదకరంగా మారాయి. రాత్రి వేళల్లో ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు మ్యాన్‌హోళ్ల వద్ద ఆదివారం నిరసనకు దిగారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని మరమ్మతులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బండారి రవి, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న స్థానికులు

పార్కును ప్రారంభించిన కార్పొరేటర్

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించేలా పార్కులు ఆహ్లాదాన్ని పంచుతాయని కార్పొరేటర్ రాజ్యలక్ష్మి అన్నారు. తూర్పు ఆనంద్‌బాగ్‌లో రూ.11 లక్షలతో కొత్తగా నిర్మించిన పార్కును ఆమె కాలనీవాసుల సమక్షంలో ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. చాలా కాలంగా నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని పిల్లలకు, వయోవృద్ధులకు ఉపయుక్తంగా ఉండేలా అభివృద్ధి చేశామన్నారు. డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాలు పార్కులుగా అభివృద్ధి చేయడానికి ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఖాళీ స్థలాలు కబ్జా కాకుండా అభివృద్ధి చేస్తే అందరికీ ఉపయోగపడతాయని పేర్కొన్నారు. శ్రీకాంత్, తులసి, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌కు మహర్దశ

గౌతంనగర్, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి పథకంలో భాగంగా మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు కొత్తగా అదనపు సేవలు అందించేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు సుమారు రూ.27 కోట్ల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. తెలంగాణలో 21 రైల్వేస్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా అందులో మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌కు కూడా స్థానం దక్కింది.

భవనాలను పూర్తి స్థాయిలో విస్తరిస్తూ..

అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి పథకంలో భాగంగా మల్కాజిగిరిలో జరగనున్న అభివృద్ధి పనులకు గత ఏడాది ఆగస్టు 6న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రస్తుతం మల్కాజిగిరి స్టేషన్ భవనాలను పూర్తి స్థాయిలో విస్తరిస్తున్నారు. అంతే కాకుండా మూడు ఎస్కలేటర్లు, మూడు లిఫ్టులు, ప్రస్తుతం ఉన్న మూడు ప్లాట్ ఫాంలకు సంబంధించి పైకప్పు, వాహనాల రాకపోకలకు మనీషా గార్డెన్స్ నుంచి సూర్యటవర్స్ వరకు 60 అడుగుల రోడ్డు వేయనున్నారు. అదనంగా రిజర్వేషన్ల కౌంటర్లు, వీఐపీ లాంజ్, ఆర్పీఎఫ్ కార్యాలయం, కెఫిటేరియా, మినీరెస్టారెంట్లు నిర్మిస్తున్నారు.

కొనసాగుతున్న నిర్మాణం

కొత్తగా చేపట్టిన పనులు

ప్రజల కల నెరవేరబోతోంది.. –నూర్, డీఆర్‌యూసీసీ సభ్యుడు

నలభై ఏళ్లుగా ఎదురు చూస్తున్న మల్కాజిగిరి వాసుల కల నెరవేరబోతోంది. స్టేషన్‌ను అభివృద్ధి చేయడంతో స్థానికులకు ఎంతో మేలు కలుగుతోంది. మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌తో పాటు దానిని ఆనుకుని ఉన్న దయానంద్‌నగర్, సఫిల్‌గూడ రైల్వే స్టేషన్లలో కూడా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ స్టేషన్ల నుంచి వివిధ ప్రాంతాలకు నిత్యం సుమారు మూడు వేల మంది ప్రయాణిస్తుంటారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

మల్కాజిగిరి:80085 73378, అల్వాల్: 93911 06395
వినాయక్‌నగర్: 98498 60095, మౌలాలి: 80089 02818
గౌతంనగర్: 93475 56399 డిఫెన్స్‌కాలనీ: 84990 06641

డిఫెన్స్‌కాలనీ, గౌతమ్‌నగర్, అల్వాల్, న్యూస్‌టుడే:

? నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి యాప్రాల్ ప్రధాన మార్గం ప్రాథమిక పాఠశాల సమీపంలో రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయింది.
– నారాయణ, యాప్రాల్

✓ చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డ్‌కు తరలిస్తాం.
– నాగరాజు, పరిశుద్ధ అధికారి

? గౌతంనగర్ 19వ వీధిలో వీధిదీపాలు వెలగడం లేదు.
– ప్రసన్న, గౌతంనగర్

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి వీధిదీపాలకు మరమ్మతులు చేస్తాం.
– వెంకటేశ్, ఏఈ, వీధి దీపాల నిర్వహణ

? వెస్ట్‌వెంకటాపురంలోని రోడ్డు నంబరు-8లో వీధిదీపాలు రోజంతా వెలుగుతున్నాయి. – శ్రీకాంత్, స్థానికుడు

✓ వీధిదీపాల టైమర్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో సమస్య రావచ్చు. వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటా.
– రఘుపతిరెడ్డి, డీఈ

టీపీటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యవర్గాన్ని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్నుకున్నారు. కొత్త కమిటీకి అధ్యక్షుడిగా రాఘవేంద్రగౌడ్, ప్రధాన కార్యదర్శిగా సదానందాచారి, ఉపాధ్యక్షులుగా వెంకటలక్ష్మి, తేజేశ్వరరావు, కార్యదర్శులుగా రమణ, స్వప్న, అలివేలులను ఎన్నుకున్నారు. కార్యక్రమ నిర్వహణను రాష్ట్ర కమిటీ అదనపు కార్యదర్శి రవీంద్రరావు నిర్వహించారని అధ్యక్షుడు రాఘవేంద్రగౌడ్ తెలిపారు.

ఇళ్లు కూల్చకుండా చూసుకునే బాధ్యత నాది: ఎమ్మెల్యే

బండ చెరువు వద్ద సమస్యలు తెలుసుకుంటున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

నేరేడ్‌మెట్, మౌలాలి, న్యూస్‌టుడే: బండ చెరువు చుట్టుపక్కల నివాసముంటున్న ప్రజల ఇళ్లను కూల్చకుండా చూసుకునే బాధ్యత తనదని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. బండ చెరువు సమీపంలోని పలు కాలనీ వాసులతో ఆయన ఆదివారం సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైడ్రా చేపడుతున్న నిర్మాణాల తొలగింపుతో తమకు కంటిమీద కునుకు లేకుండా పోతోందని కాలనీవాసులు తమ గోడును వెల్లబోసుకున్నారు. తమ జీవితాలను నిలబెట్టాలని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానికుల ఇళ్ల జోలికి రాకుండా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా సుప్రీం కోర్టుకు సైతం వెళ్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తుందని చెబుతూనే మరోపక్క సామాన్య ప్రజలు ఎంతో కష్టపడి కట్టుకున్న ఇళ్లను కూల్చివేయడం బాధాకరమన్నారు. ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయకపోగా, వారిపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు. బాధితులు ఎటువంటి భయాందోళనకు గురికావద్దని తెలిపారు. భారాస నాయకులు అమినుద్దీన్, ఉస్మాన్, ఇబ్రహీం, భాగ్యనందరావు, స్థానికులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోండి

గాంధీనగర్: పోటీపరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని లక్ష్యాన్ని సాధించాలని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమి అధినేత బాలలత సూచించారు. సివిల్స్‌లో గ్రామీణ యువతను ప్రోత్సహించేలా ఆదివారం సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమి, టైలోరో సంస్థల సంయుక్తాధ్వర్యంలో అశోక్‌నగర్‌లో కల్పతరు-3.0 పేరిట ప్రవేశపరీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రవేశపరీక్షలో ప్రతిభ కనబరచిన మొదటి 10 మందికి సివిల్స్ కోసం ఉచిత శిక్షణనివ్వడంతో పాటు వందమందికి మెటీరియల్ అందజేస్తామని తెలిపారు.

భాజపా సభ్యత్వ నమోదుకు స్పందన

కార్యక్రమంలో రామచందర్‌రావు

అల్వాల్: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు అన్నారు. ఆదివారం టెలికాం కాలనీలో పార్టీ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్లు తెలిపారు. తొమ్మిది డివిజన్ల పరిధిలోని ప్రజలు మోదీ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని చూసి భాజపాకి మద్దతు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, మాణిక్యరెడ్డి, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త డంపింగ్ యార్డ్‌కు చేరేదెప్పుడో..?

గౌతంనగర్ డివిజన్ రాజాశ్రీనివాసనగర్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తరలించాలని స్థానికులు కోరుతున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో రోజుల తరబడి చెత్త నిల్వ ఉండటంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని చెత్త నిల్వలను డంపింగ్ యార్డుకు తరలించాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, గౌతంనగర్

ప్రయాణం ప్రాణసంకటం

నేరెడ్‌మెట్ డివిజన్ పరిధి ఆశా ఆఫీసర్స్ కాలనీ నుంచి అమ్ముగూడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన మార్గం రైల్వే వంతెన దగ్గర మూలమలుపు ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. ఈ దారిగుండా రాత్రి వేళల్లో ప్రయాణం ప్రాణ సంకటంగా ఉందని స్థానికులు వాపోయారు. రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, డిఫెన్స్‌కాలనీ

భక్తిశ్రద్ధలతో శ్రీవిరాట్ విశ్వకర్మ యజ్ఞం

యజ్ఞంలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్

గౌతంనగర్, న్యూస్‌టుడే: విశ్వకర్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మల్కాజిగిరి సాయిబాబా ఆలయ మండపంలో నిర్వహించిన శ్రీవిరాట్ విశ్వకర్మ యజ్ఞం భక్తిశ్రద్ధలతో సాగింది. అంతకు ముందు నాదస్వరము, ధ్వజారోహణం, ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

వైభవంగా గాయత్రి సహిత సూర్యహోమం

మౌలాలి: మౌలాలి డివిజన్ గాయత్రినగర్‌లోని శ్రీగాయత్రి, సాయిబాబా ఆలయంలో ఆదివారం ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు గాయత్రి సహిత సూర్య హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. అంతకు ముందు సహస్ర కుంకుమార్చన చేశారు.

చట్టాలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

అల్వాల్, న్యూస్‌టుడే: బొల్లారంలోని ఆదర్శనగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం ప్రజాసంఘాల నేతలు జ్ఞానమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గద్దర్ అభిమానుల సంఘం, అణగారిన ప్రజల హక్కుల పోరాట కమిటీ నేత యాదగిరి రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు రాజ్యాంగంలోని చట్టాలు, హక్కులు తెలుసుకోవల్సిన అవసరముందన్నారు. పెంటయ్య, బాల్‌రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైపులైన్ లీకేజీతో ఇబ్బందులు

రహదారిపై పారుతున్న మురుగు

మల్కాజిగిరి: డివిజన్ పరిధిలోని సత్యసాయినగర్ వాసులు కొద్ది రోజులుగా దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ఏర్పాటుచేసిన భూగర్భ మురుగు కాలువకు సమీపంలోని మూడు సినిమా హాళ్ల డ్రైనేజీని ఆ పైపులైన్‌లో కలిపారు. దీంతో పైపులైన్ లీకేజీ అయినప్పుడల్లా మురుగు రహదారిపైకి వస్తుండడంతో దుర్వాసన వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కిల్, జలమండలి అధికారులకు చేసిన ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

నేత్ర, అవయవదానంపై విస్తృత అవగాహన అవసరం

ముషీరాబాద్: నేత్ర, అవయదానం చేసేందుకు దాతలు ముందుకు రావాలని వసుధ ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ మంతెన వరలక్ష్మి కోరారు. ఆదివారం సుందరయ్య కళానిలయంలో.. అమ్మ నేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘం వార్షికోత్సవం జరిగింది. గతేడాది మృతిచెందినవారి శరీరాలు, అవయవాలు, నేత్రాలను దానం చేసిన వారిని సన్మానించారు. వరలక్ష్మి మాట్లాడుతూ.. నేత్ర, అవయవదానం చేయడం గొప్ప విషయమన్నారు. దీనిపై అవగాహన పెంచాలన్నారు. సంఘం వ్యవస్థాప అధ్యక్షుడు గంజి ఈశ్వరలింగం మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో వందల మందికి కంటిచూపు తిరిగివచ్చేలా కృషి చేశామన్నారు. జీవన్మృతుల నుంచి 12 మూత్రపిండాలు, ఆరు కాలేయాలతోపాటు ఒక గుండెను సేకరించి 'తెలంగాణ జీవన్‌ధార' ఆధ్వర్యంలో అవసరమైన వారికి అందజేశామన్నారు.

అల్లుకున్న ప్రమాదం

కౌనాజిగూడలోలి గ్రీన్‌ఫీల్డ్ కాలనీ ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న విద్యుత్తు నియంత్రిక, స్తంభాలకు తీగ మొక్కలు అల్లుకున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. అప్పుడప్పుడు తీగలు ఒకదానికొకటి ఆనుకొని మంటలొస్తున్నాయని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. 24 గంటలు వీధిదీపం వెలుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు.
– న్యూస్‌టుడే, అల్వాల్

కార్మిక, కర్షకుల గళం సీతారాం ఏచూరి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ప్రొ.నాగేశ్వరావు

లాలాపేట: కార్మికులు, కర్షకుల సమస్యలపై నిరంతరం గళమెత్తిన గొప్పనాయకుడు సీతారాం ఏచూరి అని పలువురు వక్తలు కొనియాడారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథి మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ ఆయన నమ్మిన సిద్ధాంతం కోసం పోరాటం చేసిన మహనీయుడని తెలిపారు. ఆయనతో కలిసి ఓయూలో విద్యార్థి సంఘాన్ని ఏర్పాటు చేసుకున్న సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వీరయ్య, ప్రొఫెసర్లు కొండ నాగేశ్వర్, రామ్ షెపర్డ్, ఆమంచి నాగేశ్వర్ ప్రసంగించారు. ప్రజానాట్య మండలి కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయుధ పోరాట నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ఓయూ కార్యదర్శి రవి నాయక్‌తో పాటు పలువురు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

'హైడ్రా' బాధితులకు ప్రత్యామ్నాయం చూపాలి

నల్లకుంట: హైడ్రా అధికారుల కూల్చివేతలతో గూడు కోల్పోయిన పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రత్యామ్నాయం చూపాలని ప్రభుత్వాన్ని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోరారు. ఆదివారమిక్కడ ఆయన మాట్లాడుతూ.. జలవనరుల పరిధిలోని ఆక్రమణలను తొలగించడం మంచిదేనన్నారు. వాటి పరిధిలోని స్థలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు విక్రయించడంతో.. అవగాహన లేక పేదలు కొనుగోలుచేసి ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. నివాసాల కూల్చివేతతో వారంతా రోడ్డున పడుతున్నారని.. ప్రభుత్వం మానవతాదృక్పథంతో వ్యవహరించాలని సూచించారు.

దివ్యాంగుల హక్కుల నూతన కమిటీ

మల్కాజిగిరి: దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా సమావేశంలో నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కురునెల్లి వెంకట్, అధ్యక్షుడిగా చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి కడలి నాగలక్ష్మి, వర్కింగ్ ప్రసిడెంట్‌గా రమేశ్, కోశాధికారిగా మల్లేశ్, ఉపాధ్యక్షులుగా లక్ష్మీపతిరావు, బాలయ్య, సహాయ కార్యదర్శిగా విజయలక్ష్మి, వెంకటయ్య, గంగారెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు నెలకు రూ. 6వేల పింఛను ఇవ్వాలన్నారు. ప్రభుత్వంలోని బ్యాక్‌లాగ్ పోస్టులను దివ్యాంగులతో భర్తీ చేయాలని కోరారు.

సీఎస్ఐ ఆధ్వర్యంలో ఇందిరాపార్కులో 3కే వాక్

రాంనగర్: మానవ శరీరాన్ని నడిపించే ఇంజిన్ 'హృదయం' అని ది కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా(సీఎస్ఐ) తెలంగాణ రాష్ట్ర చాప్టర్ అధ్యక్షుడు డా.అమన్ సాల్వాన్ తెలిపారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం ఇందిరాపార్కులో నిర్వహించిన '3కే వాక్' కార్యక్రమాన్ని సీఎస్ఐ తెలంగాణ చాప్టర్ గౌరవ కార్యదర్శి డా.కృష్ణమోహన్‌తో కలిసి జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.అమన్ సాల్వాన్ మాట్లాడుతూ.. గుండె నిరంతరం రక్తాన్ని పంప్ చేస్తూ కణజాలం, అవయవాలకు ఆక్సిజన్‌తోపాటు పోషకాలనూ అందిస్తుందన్నారు. ఆరోగ్యకరమైన గుండె లేకుండా శరీరం సరైన రీతిలో పనిచేయదన్నారు. క్రమంతప్పకుండా వ్యాయామం చేయడం, పోషకాహారం తీసుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం ద్వారా గుండెను పదిలంగా ఉంచుకోవచ్చన్నారు. అనంతరం సీపీఆర్ ప్రక్రియను నిర్వహించే విధానంపై అక్కడికి వచ్చిన వారికి అవగాహన కల్పించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన డాక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్లపై మురుగు పరుగు

దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న మారుతీనగర్ వాసులు

మౌలాలి, న్యూస్‌టుడే: మురుగుతో వచ్చే దుర్వాసనకు అక్కడ గంట సేపు కూడా ఉండలేము. అలాంటిది నెలల తరబడి అదే దుర్వాసనతో నానా అవస్థలు పడుతున్నారు మౌలాలి డివిజన్‌లోని మారుతీనగర్ వాసులు. మురుగుతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారని వాపోయారు.

పూడిక తీయకపోవడంతోనే..

మారుతి నగర్ కాలనీకి ఎగువన కాప్రా సర్కిల్‌కు చెందిన పలు ప్రాంతాలు ఉన్నాయి. వాటి నుంచి వచ్చే మురుగు నేరుగా మారుతి నగర్ వద్ద మౌలాలి డివిజన్‌లో కలిపారు. డివిజన్‌లోని పైప్‌లైన్ల పరిమాణం తక్కువగా ఉండటంతో చెత్త, చెదారం, మురుగు పైప్‌లైన్లలో చేరి సాఫీగా వెళ్లిపోకుండా తరచూ లీకవుతోంది. వాటిలో పూడిక తీయక కొన్నేళ్లు అవుతోందని, ఇటీవల వచ్చిన వర్షాలతో సమస్య మరింత పెరిగిందని స్థానికులు తెలిపారు. మురుగు లీకై రహదారిపై పొంగిపొర్లుతుండడంతో వీధుల్లో వస్తున్న దుర్వాసనతో స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

పూర్తి చేయాల్సిన పైప్‌లైన్ పనులు

RESIDENTS WELF

మారుతీనగర్‌లో దుస్థితి

అధికారులు ఏమంటున్నారంటే...

మారుతినగర్ వేంకటేశ్వర స్వామి దేవాలయం దగ్గర నుంచి కొత్తగా పైప్‌లైన్ పనులు చేపట్టారు. అవి పూర్తి చేసి దానిలో లీకవుతున్న మురుగు కాలువను కలుపుతామంటున్నారు. కానీ సుమారు రెండు నెలలుగా పనులు పూర్తి కాలేదు. అవి పూర్తి అయ్యే వరకు చేసేదేమీ లేదని చేతులు ఎత్తేశారు. దీంతో స్థానికులు మరి కొంత కాలం పాటు మురుగుతోనే సహవాసం చేయాల్సిన దుస్థితి. దోమలతో ప్రాణాంతక వ్యాధులు వస్తే తమ పరిస్థితి ఏంటని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి వరకు లీకవుతున్న మురుగుకు ప్రత్యామ్నాయం చూపాలని కోరుతున్నాను.

పదిహేను రోజుల్లో పూర్తి చేస్తాం

– మధురిమ, ఏఈ జీహెచ్ఎంసీ

మారుతినగర్‌లో మురుగు సమస్య ఉంది. దానికి పరిష్కారం పక్కన చేస్తున్న పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలి. అవి మరో పది, పదిహేను రోజుల్లో పూర్తి చేస్తాం. అనంతరం లీకవుతున్న కాలువను దీనిలో కలిపుతాం.

జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తరలించండి

రాంనగర్, న్యూస్‌టుడే: దమ్మాయిగూడలోని జవహర్‌నగర్ డంపింగ్ యార్డును మరోచోటికి తరలించాలని ప్రభుత్వాన్ని భాజపా శాసనసభ పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు సమీపంలోని ధర్నాచౌక్‌లో జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు సన్నాహక కమిటీ ఆధ్వర్యంలో.. డంపింగ్ యార్డును తరలించాలని కోరుతూ సభ్యులు నిరసన దీక్ష చేపట్టారు. వారికి మద్దతు తెలిపాక మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు నుంచి వెలువడే దుర్గంధంతో 15 ఏళ్లుగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు దాన్ని మరోప్రాంతానికి తరలించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. కమిటీ కన్వీనర్ శంకర్ నారాయణ, కో-కన్వీనర్ సంజీవరెడ్డి, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE
PRINCIPAL DISTRICT JUDGE, KADAPA, AP
I.A.No. 657/2024/ O.S.No. 21/2024

Sane Siva Prasad, S/o Guruvaiah, aged about 45 years, Hindu, Doctor, Residing at D.No. 40/80, Mutharasupalli, Chinnachowk Ilakha, Kadapa City, YSR Kadapa District. ...Petitioner Plaintiff

Vs

1. Pidathala Sreenivasa Goud, S/o Rama Subbaiah, aged about 49 years, Business, residing in Akkalreddypalli Village, Porumamilla Mandal, YSR Kadapa District (Aadhaar No. 293148063960), 2. Komara Padmavathi, W/o Pidathala Sreenivasa Goud, aged about 48 years, Hindu House Wife No.1 and 2 are presently R/o Flat No. 1102, Bhavyas Thulasi Vanama, Usha Mullapudi Road, Near South Indian Shopping Mall, Kukatpally, Medchal, Malkajgiri, Telangana State. (Aadhaar No. 536872866070) ......Respondents No.1 & 2/ Defendants No.1 and 2

NOTICE TO RESPONDENTS No. 1 & 2

పై దావాలోని వాది పిటీషన్ షెడ్యూల్ దాఖలా ఆస్తిని మీరు మరియు 3వ ప్రతివాది ఇతరులకు అమ్మకుండా పై దావాలో పై పిటీషన్ దాఖలు చేసి ఉన్నారు. సదరు పిటీషన్‌లో మీ హాజరు నిమిత్తమై వాయిదా 18.10.2024న ఉన్నది. కావున మీరు 18.10.2024న ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

// By Order of Court //
P.Rajendra Prasad
Advocate for Petitioner

IN THE COURT OF THE HON'BLE
PRINCIPAL DISTRICT JUDGE, KADAPA, AP
O.S.No. 21/2024

Sane Siva Prasad, S/o Guruvaiah, aged about 44 years, Hindu, Doctor, Residing at D.No. 40/80, Mutharasupalli Veedhi, Chinnachowk Ilakha, Kadapa City, YSR Kadapa District. ...Plaintiff

Vs

1. Pidathala Sreenivasa Goud, S/o Rama Subbaiah, aged about 49 years, Business, residing in Akkalreddypalli Village, Porumamilla Mandal, YSR Kadapa District (Aadhaar No. 293148063960), 2. Komara Padmavathi, W/o Pidathala Sreenivasa Goud, aged about 48 years, Hindu House Wife Defendants No.1 and 2 are presently R/o Flat No. 1102, Bhavyas Thulasi Vanama, Usha Mullapudi Road, Near South Indian Shopping Mall, Kukatpally, Medchal, Malkajgiri, Telangana State. ...Defendants No.1 and 2

SUMMONS TO DEFENDANTS No. 1 & 2

పై దావాలోని వాది మీపైన ఆయకపు బాకీ వసూలు నిమిత్తం దావా దాఖలు చేయడమైనది. అలాగే పై దావాలో అందెల రమేష్‌కుమార్ D4 మరియు ఐత్తుల ప్రవీణ్ కుమార్ గారిని D3 & D4 గారిని ప్రతివాదులుగా చూపించడమైనది. పై దావా మీ హాజరు కోసం 18.10.2024న వాయిదా వేయడమైనది. కావున మీరు 18.10.2024న ఉదయం 10.30 గంటలకు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలెను లేనియెడల సదరు కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

// By Order of Court //
P.Rajendra Prasad
Advocate for Plaintiff

(c) eenadu

అవార్డు గ్రహీతలతో ఓలేటి పార్వతీశం, వంశీ రామరాజు

పురస్కారాల ప్రదానం

గాంధీనగర్: సరసిజ థియేటర్ ఫర్ వుమెన్, లేఖిని రచయిత్రుల వేదికల సంయుక్తాధ్వర్యంలో ఆదివారం త్యాగరాయ గానసభలో 'ముగ్గురమ్మలు-అమ్మమ్మలు' పేరిట ఆత్మీయ పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఎంపిక చేసిన ప్రముఖులు వేదవతి ప్రభాకర్, ముళ్లపూడి శ్రీదేవి, లక్ష్మీరాఘవలకు సాహితీవేత్త ఓలేటి పార్వతీశం ముఖ్య అతిథిగా అవార్డులను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రచయిత్రి విజయలక్ష్మి, వంశీ సంస్థల అధ్యక్షుడు వంశీ రామరాజు, ప్రముఖులు ముక్తేవి భారతి, కృష్ణకుమారి, గౌరీలక్ష్మి, వీణ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్

•ముషీరాబాద్ •అంబర్‌పేట

ఆకట్టుకున్న బాలు గీతాల గానం

గీతాలను ఆలపిస్తున్న గాయకులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: సాంస్కృతిక సేవా సంస్థ శ్రీరామ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సుందరయ్య కళానిలయంలో గానగంధర్వుడు బాలసుబ్రహ్మణ్యం నాలుగేళ్ల జ్ఞాపకాలతో 'పాటగా బతకనా మీ అందరినోట' శీర్షికతో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీగాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న.. బాలు ఆలపించిన గీతాలను శ్రవణానందంగా పాడి వినిపించారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త వెంకట్ గరికపాటి, సంగీత దర్శకులు కె.రామాచారి, లక్ష్మీగాయత్రి, రవళి, మహతి, లేఖ్య సాహితీ, సింధుజ, ఉమాపతి, శ్రీకాంత్, చంద్రశేఖర్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు చేయండి

విద్యానగర్: బాగ్‌అంబర్‌పేట డివిజన్ పరిధిలోని అంతర్గత బస్తీల్లో సక్రమంగా వెలగని వీధి దీపాలకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ అధికారులను కార్పొరేటర్ బి.పద్మ కోరారు. శారదానగర్, మహంకాళి దేవాలయం పక్క బస్తీలో, ప్రభుత్వాసుపత్రి ఎదుట.. కొన్నిరోజులుగా రాత్రిళ్లు వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. శారదనగర్, సీఈ కాలనీ, డీడీ కాలనీలోని అనేక చోట్ల వీధిదీపాల వెలుగులు చెట్ల కొమ్మలపై పడుతుండడంతో.. రోడ్లపై అంధకారం అలుముకుంటోందన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణం చొరవచూపాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోండి

గాంధీనగర్: పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని లక్ష్యాన్ని సాధించాలని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమి అధినేత బాలలత సూచించారు. సివిల్స్‌లో గ్రామీణ యువతను ప్రోత్సహించేలా ఆదివారం సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమి, టైలోరో సంస్థల సంయుక్తాధ్వర్యంలో అశోక్‌నగర్‌లో కల్పతరు-3.0 పేరిట ప్రవేశపరీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రవేశపరీక్షలో ప్రతిభ కనబరిచిన మొదటి 10 మందికి సివిల్స్ కోసం ఉచిత శిక్షణనివ్వడంతో పాటు వంద మందికి మెటీరియల్ అందజేస్తామని తెలిపారు.

పర్యావరణ హితం.. ఇంకుడు గుంతల నిర్మాణం

కాచిగూడ, న్యూస్‌టుడే: నగరంలోని ప్రముఖమైన కాచిగూడ రైల్వే స్టేషన్‌లో నీటి సమస్య పరిష్కారం కోసం ఇంకుడు గుంతల నిర్మాణానికి నడుం బిగించారు. ఏటా పెరుగుతున్న రైళ్లు, ప్రయాణికుల రద్దీతో నీటి అవసరాలు కూడా అధికమవుతున్నాయి. అందుకనుగుణంగా నీటి అవసరాలను తీర్చాల్సిన బాధ్యత దక్షిణ మధ్య రైల్వేపై ఉంది. నీటి కోసం స్టేషన్ పరిసరాల్లో గతంలో బోర్లను వేశారు. ఏటా భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో తరచూ కొన్ని బోర్లు ఎండిపోతున్నాయి. దీంతో జలమండలి నుంచి సరఫరా అవుతున్న తాగునీటిపైనే ప్రధానంగా ఆధారపడాల్సి వస్తోంది. మున్ముందు భూగర్భ జలాలు అడుగంటకుండా, భవిష్యత్తులో నీటి సమస్య తలెత్తకుండా 'ఈనాడు' దినపత్రిక చొరవతో కొత్తగా ఇంకుడు గుంతల నిర్మాణానికి రైల్వే యంత్రాంగం సమాయత్తమవుతోంది.

కాచిగూడ స్టేషన్‌లో నీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

నిత్యం వేలల్లో ప్రయాణికులు..

నగరంలోని ఇతర స్టేషన్లతోపాటు ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల నుంచి బయలుదేరే అనేక రైళ్లు కాచిగూడ మీదుగా రాకపోకలు సాగిస్తాయి. వాటిల్లో ప్రయాణిస్తూ ప్రతిరోజూ వేల మంది తమ గమ్యస్థానాలకు చేరుకుంటారు. దీనికితోడు స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకూ నీటిని అందించాల్సి ఉంటుంది. దూరప్రాంతాలకు వెళ్లే కొన్ని రైళ్లలో కాచిగూడ స్టేషన్‌లోనే నీటిని నింపుతారు.

కాచిగూడ
కాచీగుడా
KACHEGUDA
కాచిగూడ రైల్వే స్టేషన్

స్థలాలను గుర్తించిన అధికారులు..

రైల్వే స్టేషన్‌లో తాగునీటి సమస్య పరిష్కారం, బోర్లు ఎండిపోకుండా ఉండటానికి ఇంకుడు గుంతల నిర్మాణానికి అవసరమైన స్థలాలను రైల్వే అధికారులు ఎంపిక చేశారు. త్వరలోనే అక్కడ ఇంకుడుగుంతలను నిర్మించేలా చర్యలు చేపట్టనున్నారు. వర్షాలు పడ్డప్పుడు వరదనీరంతా వాటిల్లోకి వెళ్లేలా దృష్టి సారిస్తున్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం తర్వాత స్థానికంగా భూగర్భజలాలు మరింతగా వృద్ధి చెందితే.. కాచిగూడ స్టేషన్‌లో నీటి సమస్య చాలా వరకు పరిష్కారమవుతుందని వారు భావిస్తున్నారు.

రోజువారీ రైళ్లు: 100
ప్రయాణికులు: 40 వేలు
పండగలు, సెలవు రోజులలో.. 45–50 వేలు
స్టేషన్ ప్రాంగణంలో
ప్రస్తుతం ఉన్న బోరింగ్‌లు: 10
ఇంకుడు గుంతల సంఖ్య: 6
కొత్తగా నిర్మిస్తున్నవి: 4

తాగునీటి కుళాయి వద్ద ప్రయాణికులు

మేమున్నాం.. మీకు తోడుగా..

ముషీరాబాద్	8008573400
రాంనగర్	8008573395
అంబర్‌పేట	8008573390
నల్లకుంట	8008573389

ముషీరాబాద్, గాంధీనగర్, న్యూస్‌టుడే:

? ముషీరాబాద్ డివిజన్ పరిధిలోని ఆశీర్వాద్ అపార్టుమెంట్ వీధిలో దోమల బెడద అధికమైంది. సిబ్బందితో ఫాగింగ్ చేయించండి.
–కె.వి.రత్నం, ముషీరాబాద్

✓ దోమలమందును వెంటనే పిచికారీ చేయిస్తాం.
–యాదగిరి, జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం సూపర్‌వైజర్

? గాంధీనగర్ డివిజన్ జనప్రియ అపార్టుమెంట్ పరిసరాల్లో జీహెచ్‌ఎంసీ వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాత్రిళ్లు చీకటి కారణంగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

✓ పరిశీలించాక వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం
–అనూష, జీహెచ్‌ఎంసీ వీధి దీపాల నిర్వాహణ ఏఈ

బండి సంజయ్‌కు అంబర్‌పేట నేతల సత్కారం

బర్కత్‌పుర: బర్కత్‌పురలోని నగర పార్టీ కార్యాలయానికి వచ్చిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను ఆదివారం అంబర్‌పేట నియోజకవర్గంలోని నాయకులు సత్కరించారు. వారిలో భాజపా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.గౌతంరావు, కార్పొరేటర్లు కె.ఉమారాణి, వై.అమృత, నేతలు జి.ఆనంద్‌గౌడ్, కన్నె రమేశ్‌యాదవ్, ఎ.సూర్యప్రకాశ్‌సింగ్, అచ్చిని రమేశ్, వనం రమేశ్, కె.ప్రవీణ్‌కుమార్, యశ్వంత్, ఎ.అరవింద్, మధుయాదవ్‌లు ఉన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన తెరపై ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని శ్రేణులతో కలిసి బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ తదితరులు వీక్షించారు.

ప్రశాంత జీవనంతో గుండె వ్యాధులు దూరం

Nava Bharathi Nirman Foundation
WORLD HEART DAY 2024
Theme: Use Heart for Action
Pragati Vidya Niketan High School
ర్యాలీలో ప్రొ.డా.బోయిని జగన్‌మోహన్, డా.రాజ్‌నారాయణ్, రవీందర్‌రావు, శ్రీనివాస్

బాలికలకు మందులు పంపిణీ చేస్తున్న స్వరూపరాణి, హిప్నోపద్మాకమలాకర్

అంబర్‌పేట, న్యూస్‌టుడే: నిత్య వ్యాయామం, పౌష్టికాహారం, ప్రశాంత జీవనంతో గుండె సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండొచ్చని షాదన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్, ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొ.డా.బోయిని జగన్‌మోహన్ అన్నారు. ఆదివారం అంబర్‌పేటలోని ప్రగతి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో. . ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవభారతి నిర్మాణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహనా ర్యాలీ, శిబిరంలో ఆయన మాట్లాడారు. గుండె జబ్బులతో ఏటా 20.5 మిలియన్ల మంది మరణిస్తుండడపై ఆందోళన వ్యక్తం చేశారు. తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ముందుగానే సంబంధిత వ్యాధులను గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చున్నారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డా.రాజ్ నారాయణ్ ముదిరాజ్, లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ ఆకుల రవీందర్‌రావు, రాష్ట్ర బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి గుండేపల్లి శ్రీనివాస్‌లు మాట్లాడారు. భాజపా మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ డా.హైజాక్‌రాజ్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, స్కూల్ ఛైర్మన్ మధుసూదన్, ప్రిన్సిపల్ సుధాకర్, భాస్కర్ పాల్గొన్నారు.

ముషీరాబాద్: అధిక ఒత్తిడి కారణంగానే గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అడ్వకేట్ పి.స్వరూపరాణి అన్నారు. డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాల్టీకేర్, నవభారత్ లయన్స్ క్లబ్ సంయుక్తాధ్వర్యంలో ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోంలో 'గుండె సంబంధిత వ్యాధులు-నియంత్రణ'పై చేపట్టిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మారుతున్న జీవనశైలి, ఆహారపుటలవాట్లతో గుండె జబ్బులు అధికమవుతున్నాయని డా.హిప్నో పద్మాకమలాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం హోంలోని బాలికలకు విటమిన్ మాత్రలు, పౌష్టికాహారం, కథల పుస్తకాలు పంపిణీ చేశారు. లయన్ సీహెచ్ గోపాలకృష్ణ, జ్యోతి రాజ, కృష్ణవేణి, హోంమేనేజర్ సదాలక్ష్మి పాల్గొన్నారు.

గంగపుత్రులు అన్నిరంగాల్లో రాణించాలి: ఎమ్మెల్యే

తెలంగాణ రాష్ట్ర
గంగపుత్ర న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం
ముఠా గోపాల్‌ను సన్మానించిన గంగపుత్ర న్యాయవాదులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: గంగపుత్రుల హక్కుల పరిరక్షణ కోసం న్యాయవాదులు కృషిచేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. తెలంగాణ గంగపుత్ర న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గంగపుత్రులు ఐక్యంగా ఉంటూ రాజకీయ, ఆర్థిక రంగాల్లోనూ రాణించాలని కోరారు. పేదలకు న్యాయపరమైన సేవలను ఉచితంగా అందించాలని న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాక జ్ఞానేశ్వరి, పాక సాయిసంతోష్, పూస మల్లేష్, దేశబోయిన రఘు, భూపతి, పల్లికొండ అరవింద్, దేశబోయిన భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాపార్కులో ఉత్సాహంగా 3కే వాక్

ప్లకార్డులతో వైద్యులు

రాంనగర్, న్యూస్‌టుడే: మానవ శరీరాన్ని నడిపించే ఇంజిన్ 'హృదయం' అని ది కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా(సీఎస్ఐ) తెలంగాణ రాష్ట్ర చాప్టర్ అధ్యక్షుడు డా.అమన్ సాల్వాన్ తెలిపారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం ఇందిరాపార్కులో నిర్వహించిన '3కే వాక్' కార్యక్రమాన్ని సీఎస్ఐ తెలంగాణ చాప్టర్ గౌరవ కార్యదర్శి డా.కృష్ణమోహన్‌తో కలిసి జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.అమన్ సాల్వాన్ మాట్లాడుతూ.. గుండె నిరంతరం రక్తాన్ని పంప్ చేస్తూ కణజాలం, అవయవాలకు ఆక్సిజన్‌తోపాటు పోషకాలనూ అందిస్తుందన్నారు. ఆరోగ్యకరమైన గుండె లేకుండా శరీరం సరైన రీతిలో పనిచేయదన్నారు. క్రమంతప్పకుండా వ్యాయామం చేయడం, పోషకాహారం తీసుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం ద్వారా గుండెను పదిలంగా ఉంచుకోవచ్చున్నారు. అనంతరం సీపీఆర్ ప్రక్రియను నిర్వహించే విధానంపై అక్కడికి వచ్చిన వారికి అవగాహన కల్పించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన డాక్టర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

'ప్రాణప్రతిష్ఠ'ను అపహాస్యం చేయడం తగదు

మాట్లాడుతున్న గీతామూర్తి

కాచిగూడ: ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు శతాబ్దాలుగా ఎదురుచూసిన అయోధ్య ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అపహాస్యం చేశారని భాజపా గోల్కొండ జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జి గీతామూర్తి ఆరోపించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ... 'ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి అమితాబ్, అంబానీ, అదానీ లాంటి ప్రముఖులను తప్ప.. రైతులు, కూలీలను పిలిచారా? ఇదంతా 'నాచ్ గానా(ఆట-పాట)' అంటూ రాహుల్ వ్యాఖ్యానించడాన్ని ఖండిస్తున్నాం' అని ఆమె అన్నారు. ఆలయ నిర్మాణంలో పాలుపంచుకున్న వారితో పాటు పారిశుద్ధ్య కార్మికులను ప్రధాని నరేంద్రమోదీ ఆహ్వానించిన విషయాన్ని గుర్తు చేశారు.

'హైడ్రా' బాధితులకు ప్రత్యామ్నాయం చూపాలి

కిరణ్‌కుమార్

నల్లకుంట: హైడ్రా అధికారుల కూల్చివేతలతో గూడు కోల్పోయిన పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రత్యామ్నాయం చూపాలని ప్రభుత్వాన్ని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోరారు. ఆదివారమిక్కడ ఆయన మాట్లాడుతూ.. జలవనరుల పరిధిలోని ఆక్రమణలను తొలగించడం సబబేనన్నారు. అయితే, వాటి పరిధిలోని స్థలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు విక్రయించడంతో.. అవగాహన లేక పేదలు కొనుగోలుచేసి ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. ప్రస్తుతం నివాసాల కూల్చివేతతో వారంతా రోడ్డున పడుతున్నారని.. ప్రభుత్వం మానవతాదృక్పథంతో వ్యవహరించాలని సూచించారు.

సామాజిక సేవతో ఆత్మసంతృప్తి

మహిళకు దుప్పట్లు, సరకులు అందజేస్తున్న అంజనీకుమారి

గాంధీనగర్: సామాజిక సేవలతో ఆత్మసంతృప్తి కలుగుతుందని హైదరాబాద్‌లోని సిటీ స్మాల్ కాజెస్ కోర్టు సూపరింటెండెంట్ పీవీపీ అంజనీకుమారి అన్నారు. ఏపీ వరద బాధితుల సహాయార్థం సత్తెనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్, ఎస్‌ఆర్ డీజీ స్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు సేకరించిన నిత్యావసర సరకులు, దుప్పట్లు, సామగ్రిని ఆదివారం ఉదయం విజయవాడలోని సింగ్‌నగర్, రాజీవ్‌నగర్ తదితర ముంపు ప్రాంతాల బాధితులకు ఆమె అందజేశారు. సాయంత్రం గాంధీనగర్‌లో.. ఫౌండేషన్ అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వేమూరి రాధారాణిలతో కలిసి ఆమె మాట్లాడారు. వరదల్లో సర్వం కోల్పోయిన వారికి సాయమందించడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ సభ్యులు సురేష్, మంజు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా భాజపా సభ్యత్వ నమోదు

న్యూపటేల్‌నగర్‌లో యశ్వంత్

ఎంసీహెచ్ కాలనీలో నాగభూషణంచారి

అంబర్‌పేట, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం అంబర్‌పేటలో చురుగ్గా జరుగుతోంది. ఆదివారం న్యూపటేల్‌నగర్‌లో జరిగిన సంబంధిత కార్యక్రమానికి బీజేవైఎం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ హాజరై సభ్యత్వాలు నమోదు చేయించారు. నేతలు సతీష్, వంశీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ★ ఎంసీహెచ్ కాలనీలో జరిగిన కార్యక్రమానికి భాజపా అంబర్‌పేట అధ్యక్షుడు నాగభూషణంచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదును చేయించారు. నేతలు రామకృష్ణ, శ్రీరాం, హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్: దేశాభివృద్ధి, సమైక్యతే భాజపా లక్ష్యమని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోఆర్డినేటర్ బిజ్జి కనకేష్‌కుమార్ అన్నారు. భోలక్‌పూర్ డివిజన్ దేవిచౌక్ సమీపంలో.. సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించి ఆయన మాట్లాడారు. భాజపా ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు, నేతలు ఎం.రమేష్‌రామ్, ఆర్.విశ్వం, చంద్రమోహన్, రవి, నిత్యానంద్ పాల్గొన్నారు.

గోల్నాకలో కూరగాయల ధరలు

తిలక్‌నగర్: (ఆదివారం నాటివి.. కిలోకు రూపాయల్లో) టమాట-60, ఆలుగడ్డ-45, వంకాయ-40, బెండ-50, దొండ-50, దోసకాయ-40, కాకర-60, బీర-60, సొర-30, క్యాబేజీ-40, క్యాప్సికం-60, బీన్స్-70, చిక్కుడు-60, క్యారెట్-50, బీట్‌రూట్-45, ఉల్లిగడ్డ-50, పచ్చిమిర్చి-45, వెల్లుల్లి-300, అల్లం-90.

రోడ్డు దాటుతూ.. కిందపడి వ్యక్తి మృతి

అంబర్‌పేట, న్యూస్‌టుడే: రోడ్డును దాటే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడి దివ్యాంగుడు మృతి చెందిన సంఘటన అంబర్‌పేట ఠాణా పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎస్సై మోనికలు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ బీరప్పగడ్డకు చెందిన దివ్యాంగుడైన శ్రీనివాసులు(67) హిమాయత్‌నగర్‌లో లిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి శ్రీరమణ థియేటర్ వద్ద ద్విచక్ర వాహనాన్ని నిలిపి.. రోడ్డును దాటుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తలకు గాయం కావడంతో స్పృహ కోల్పోయాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించగా.. శ్రీనివాసులు మరణించినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మధురంగా సినీ సంగీత విభావరి

శివపార్వతిని సన్మానిస్తున్న త్రినాథరావు

గాంధీనగర్: శ్యామగాయత్రి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 'తెలుగు పదానికి జన్మదినం ఇది జానపదానికి జ్ఞానపథం' .. శీర్షికతో త్యాగరాయగానసభలో నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. గాయనీగాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న ఏకగళ, యుగళ గీతాలను మధురంగా ఆలపించారు. ఈ సందర్భంగా చిల్లా శివపార్వతిని సన్మానించారు. గాయకుడు సీహెచ్ త్రినాథరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కోటం రాజు, మురళీధర్, బాబురావు, శ్రీనివాసమూర్తి, పాండురంగ ప్రసాద్, విజయ్‌కుమార్, ఎల్‌పీ రావు, వెంకట్రావు, వినోద్, రాధారాణి పాల్గొన్నారు.

ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య 24వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ప్రతిభావంతుల నుంచి పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమాఖ్య జాతీయ కార్యదర్శి డా.గణగళ్ల విజయ్ కుమార్ తెలిపారు. ఆదివారమిక్కడ ఆయన మాట్లాడుతూ.. అక్టోబరు 2లోగా దరఖాస్తులు పంపాలన్నారు. పూర్తి వివరాలకు 93913 79903 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

కుంగిన రోడ్డుపై రాకపోకలెలా?

నల్లకుంట డివిజన్ పరిధిలోని న్యూనల్లకుంట రామాలయం పక్కన రోడ్డు కుంగిపోయింది. సుమారు 2 అడుగుల మేర భూమిలోకి కుంగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రస్తుతమిక్కడ గుంతలు ఏర్పడడంతో ఆలయానికి వచ్చే భక్తులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాల బారినపడుతున్నందున తక్షణం మరమ్మతులు చేపట్టాలని ద్విచక్రవాహనదారులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నల్లకుంట

నేత్ర, అవయవదానంపై విస్తృత అవగాహన అవసరం

సమావేశంలో మాట్లాడుతున్న గంజి ఈశ్వరలింగం

ముషీరాబాద్, న్యూస్‌టుడే: నేత్ర, అవయదానం చేసేందుకు దాతలు ముందుకు రావాలని వసుధ ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ మంతెన వరలక్ష్మి కోరారు. నేత్ర, అవయవదానంతో పలువురి జీవితాల్లో వెలుగులు నింపొచ్చన్నారు. ఆదివారం సుందరయ్య కళానిలయంలో.. అమ్మ నేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘం 8వ వార్షికోత్సవం జరిగింది. గతేడాది మృతిచెందినవారి శరీరాలు, అవయవాలు, నేత్రాలను దానం చేసిన పలువురిని ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన వరలక్ష్మి మాట్లాడుతూ.. నేత్ర, అవయవ దానం చేయడం గొప్ప విషయమన్నారు. దీనిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అమ్మ నేత్ర, అవయవ, శరీర దాన ప్రోత్సాహకుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంజి ఈశ్వరలింగం మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో వందల మందికి కంటిచూపు తిరిగివచ్చేలా కృషి చేశామన్నారు. జీవన్మృతుల నుంచి 12 మూత్రపిండాలు, ఆరు కాలేయాలతోపాటు ఒక గుండెను సేకరించి 'తెలంగాణ జీవన్‌ధార' ఆధ్వర్యంలో అవసరమైన వారికి అందజేశామన్నారు. అవయవదానంపై గ్రామీణుల్లో అవగాహన కోసం 'తెలంగాణ రాష్ట్ర జాయింట్ కమిటీ ఫర్ ఐ ఆర్గాన్'ను ఏర్పాటు చేశామన్నారు. సంఘం ప్రతినిధులు పి.సుబ్బరాజు, జి.జ్యోత్స్న, లక్ష్మారెడ్డి, మధుసూదన్, కిషోర్, కృష్ణచందర్, రమాదేవి పాల్గొన్నారు.

సత్యనారాయణ యాదవ్ సేవలు ఎనలేనివి: తలసాని


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తూ..

బర్కత్‌పుర: యాదవుల సమస్యల పరిష్కారానికి బద్దుల సత్యనారాయణ యాదవ్ విశేష కృషి చేశారని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఆదివారం బర్కత్‌పురలోని తెలంగాణ యువతి మండలిలో ఆయన సంస్మరణ సభను నిర్వహించారు. తొలుత సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహా పలువురు నివాళులర్పించారు. అనంతరం తలసాని మాట్లాడుతూ. . యాదవ సంఘం ప్రముఖుడిగా సత్యనారాయణ యాదవ్ అందించిన సేవలను గుర్తుచేశారు.

రోడ్లు ఆక్రమించి.. నిర్మాణ సామగ్రితో నింపేసి

సీఈ కాలనీలోని సాయిబాబా ఆలయానికి వెళ్లే మార్గంలో ఇసుక కుప్ప

టెన్నిస్ కోర్టు వద్ద నిల్వచేసిన కంకర

విద్యానగర్, న్యూస్‌టుడే: అంబర్‌పేట నియోజకవర్గం బాగ్‌అంబర్‌పేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, అంతర్గత బస్తీల్లో రోడ్లపైనే భవన నిర్మాణ సామగ్రిని ఇష్టారాజ్యంగా నిల్వచేస్తుండడంతో రాకపోకలకు వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. స్థానికంగా ఉన్న దారులన్నీ అసలే ఇరుకుగా ఉంటాయి. వాటిని కూడా ఆక్రమించి నిర్మాణ సామగ్రిని సంబంధిత యజమానులు ఉంచుతుండడంతో.. రాత్రిళ్లు ప్రమాదాల బారినపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణాలను ప్రారంభించినప్పటి నుంచి.. పనులు పూర్తయ్యే వరకు నెలలపాటు ఇసుక, కంకర, ఇటుకలతోపాటు వెదురు కట్టెలను రోడ్ల చెంత ఉంచుతున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని వారంతా ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేస్తున్నా స్పందన కరవవుతోందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణ సామగ్రిని తొలగించాలని కోరుతున్నారు.

'జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తరలించాలి'

మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

రాంనగర్, న్యూస్‌టుడే: నగర శివార్లలోని దమ్మాయిగూడలో ఉన్న జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తక్షణం మరోచోటికి తరలించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని భాజపా శాసనసభ పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు సమీపంలోని ధర్నాచౌక్‌లో జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు సన్నాహక కమిటీ ఆధ్వర్యంలో... డంపింగ్‌యార్డును తరలించాలని కోరుతూ సభ్యులు నిరసన దీక్ష చేపట్టారు. వారికి మద్దతు తెలిపాక మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డు నుంచి వెలువడే దుర్గంధంతో 15 ఏళ్లుగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు దాన్ని మరోప్రాంతానికి తరలించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. కమిటీ కన్వీనర్ శంకర్‌నారాయణ, కో-కన్వీనర్ సంజీవరెడ్డిలు మాట్లాడుతూ.. గాలిలోకి కాలుష్యకారకాల విడుదలతో డంపింగ్‌యార్డు పరిసరాల్లోని ప్రజలు ఆస్తమా, చర్మవ్యాధుల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, కమిటీ నాయకులు రామకృష్ణ, పద్మాచారి, సమ్మిరెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి మహోత్సవాలు 3 నుంచి

సీతారామాంజనేయ సరస్వతీ దేవస్థానం

నల్లకుంట: న్యూనల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి దేవస్థానంలో అక్టోబరు 3 నుంచి 12 వరకు జ్ఞానసరస్వతీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో జయంతి తెలిపారు. ఆదివారమిక్కడ ఆమె మాట్లాడుతూ... పది రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. ఈ సందర్భంగా అభిషేకాలు, పల్లకీ సేవ తదితర పూజా కార్యక్రమాలతోపాటు చండీహోమం కూడా నిర్వహిస్తామన్నారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు పూర్తిచేశామని చెప్పారు.

అమ్మవారి ఆగమనం.. ఊరేగింపులో ఉత్సాహం

దేవీ శరన్నవరాత్రులు సమీపిస్తుండడంతో దుర్గామాత అమ్మవారి విగ్రహాలను మండపాల్లో ప్రతిష్ఠించి.. ఘనంగా పూజలు చేసేందుకు కాలనీలు, బస్తీల్లోని యువత సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో అమ్మవారి ప్రతిమలను కొనుగోలు చేశాక.. మేళతాళాలు, డీజే శబ్దాల మధ్య ఊరేగింపుగా తమ ప్రాంతాలకు తీసుకొస్తున్నారు. 'జైమాతా ది అసోసియేషన్' ఆధ్వర్యంలో ఏర్పాటుచేయనున్న దుర్గామాత ప్రతిమ తరలింపు సందర్భంగా అంబర్‌పేటలోని న్యూపటేల్‌నగర్‌లో ఆదివారం రాత్రి ఇలా సందడి కనిపించింది.

ఉప్పల్

•ఉప్పల్ •మేడ్చల్

వరద బాధితుల సహాయ నిధికి భిక్షాటన

జవహర్‌నగర్, న్యూస్‌టుడే: ఖమ్మం వరద బాధితుల సహాయార్థం కళాకారుల బృందం ఆధ్వర్యంలో జవహర్ నగర్‌లో భిక్షాటన చేశారు. తెలంగాణ సాంస్కృతిక సేన మేడ్చల్ జిల్లా విభాగం నిరుద్యోగ కళాకారుల బృందం భిక్షాటన చేసి, ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేయనున్నట్లు నిర్వాహకులు గజ్జెల రాంచందర్ అన్నారు.

కళాకారుల ప్రచారం

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన

ఉప్పల్, న్యూస్‌టుడే: ఉప్పల్‌లోని శిల్పారామంలో భరతనాట్య ప్రదర్శన అలరించింది. శిల్పారామంలో ఆదివారం నర్తనం ఆర్ట్స్ గురువర్యులు కుమారి వర్షిణి శిష్య బృందం భరతనాట్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాకారులు పుష్పాంజలి, గజవదన బేడువే, అలరింపు, ఆనంద నర్తన గణపతిమ్, షడాక్షరం, మహిషాసుర మర్దిని, తదితర అంశాలపై కళాకారులు ప్రణవి, నవ్య, చారులత, సంజీవని, వైభవి, ఆర్య, గౌతమి, మనస్విని, భువనకృత, అక్షర, ఆజ్ఞ, శ్రీవాణి చక్కటి నృత్యాలు చేశారు.

విత్తన బంతుల తయారీకి శ్రీకారం

కాప్రా: కాప్రా సర్కిల్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కోటి విత్తన బంతుల తయారీకి శ్రీకారం చుట్టారు. మల్లాపూర్ సూర్యానగర్‌లోని మోడ్రన్ పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు విత్తన బంతుల తయారీపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు 20,000లకు పైగా విత్తన బంతులను తయారు చేశారని క్లబ్ ప్రతినిధులు సుముద్రాల కృష్ణమూర్తి, బెజ్జం రాజేశ్వరావులు తెలిపారు.

రూ.80 లక్షల ఖర్చు.. ఎవరిదీ తప్పు


వీధి వ్యాపారుల దుకాణాలు ఇలా..

బోడుప్పల్, న్యూస్‌టుడే : పీర్జాదిగూడ నగర పాలక సంస్థ మూడేళ్ల క్రితం బుద్ధానగర్, పీర్జాదిగూడ హైస్కూల్, మేడిపల్లి వద్ద రూ. 80 లక్షలు ఖర్చుచేసి దుకాణాల సముదాయాలను నిర్మించింది. వాటిని వ్యాపారులకు ఇవ్వలేదు. వేరే అవసరాలకు వినియోగించడం లేదు.

రహదారి ఇలా.. ప్రయాణించేదెలా..!



కాప్రా, న్యూస్‌టుడే: కుషాయిగూడలోని వీఎన్ రెడ్డినగర్ కాలనీలోని ప్రధాన రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా ఛిద్రమైయింది. కుషాయిగూడ, వీఎన్ రెడ్డినగర్ మీదుగా జమ్మిగడ్డలోని 20 కాలనీలకు వెళ్లే మార్గం ఇదొక్కటే. మూడేళ్ల క్రితం తవ్వకాలు జరిగిపి రోడ్డు మధ్యలో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ వేశారు. అక్కడే గుంతలు పడటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

హైడ్రాతో పేదల జీవితాల్లో కల్లోలం : ఎంపీ

ఈటలను జ్ఞాపికతో సత్కరిస్తున్న కాలనీవాసులు

పీర్జాదిగూడ (బోడుప్పల్), న్యూస్‌టుడే: హైడ్రా పేరుతో ప్రభుత్వం పేదల జీవితాల్లో కల్లోలం సృష్టించిందని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటలరాజేందర్ మండిపడ్డారు. పీర్జాదిగూడ శంకర్‌నగర్ కాలనీ వాసులు ఆదివారం ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. మిషన్ భగీరథ, కాళేశ్వరంతో నిధులు కరిగిపోవడంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళనను తెరపైకి తీసుకువచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డికి చెరువులపై అవగాహన లేదు. ఏదో బాగు చేస్తారని ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే .. పేదల కన్నీళ్లు చూసి నవ్వుతున్నారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర భాజాపా కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

అనుసంధాన రోడ్లు అంతేనా..!

- ఏళ్లుగా ప్రతిపాదన పెండింగ్‌లోనే..
- రెండు రేడియల్ రోడ్ల మధ్య తగ్గనున్న దూరం


చక్రీపురం-సాకేత్ ప్రధాన రహదారి ఇలా

న్యూస్‌టుడే, కాప్రా

‘ఈసీఐఎల్-కీసర... రాధికా చౌరస్తా-దమ్మాయిగూడలకు వెళ్లే రేడియల్ రోడ్లను కలిపే ఈ రోడ్డు సగానికిపైగా మట్టితోనే ఉంటోంది. ఈ రోడ్డు అభివృద్ధికి చేసిన ప్రతిపాదనలకు దాదాపుగా 25 ఏళ్లు వయసు నిండిపోయింది. ఎన్నికలు జరిగిన ప్రతిసారి ప్రతిపాదనలను హామీగా చెబుతారు.. మళ్లీ మరచిపోతారు.’

గతంలో చక్రీపురంలోని మారుతీనగర్ నుంచి వాసవీశివానగర్ వరకు సీసీరోడ్డు వేసి అధికారులు చేతులు దులుకున్నారు. మరో కిలోమీటరు మట్టిరోడ్డే ఉంది. ప్రజలు ఎన్నిసార్లు చెప్పినా ఈ మార్గాన్ని అభివృద్ధి చేయడానికి దాటవేత ధోరణితోనే వ్యవహరిస్తున్నారు.


వైష్ణవ ఎంక్లేవ్ కూడలి వద్ద..

ఇదీ సంగతి

- భారీ వర్షాలకు మట్టి రోడ్డుపై గుంతలు పడ్డాయి. కంకర తేలడంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. వర్షం పడిందంటే పాదచారులు నడవలేని స్థితి.
- హైటెన్షన్ లైన్ కింద ఉన్న ఈ అనుసంధాన రోడ్డును అభివృద్ధి పరచడం తో రెండు రేడియల్ రోడ్ల మధ్య దూరం తగ్గిపోనుంది.
- ఈసీఐఎల్-కీసర రేడియల్ రోడ్డు నుంచి చక్రీపురం మీదుగా సాకేత్, ఎల్లారెడ్డిగూడ, వంపుగూడ, దమ్మాయిగూడ, బాలాజీ నగర్, అంబేడ్కర్‌నగర్‌కు వెళ్లేందుకు దగ్గరి దారి అవుతుంది.
- ఈసీఐఎల్ ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ సగం వరకు తగ్గే అవకాశం ఉంది.
- ఈ ప్రాంతాల నుంచి చర్లపల్లి పారిశ్రామివాడలు, రైల్వే టెర్మినల్‌కు చేరుకునేందుకు దగ్గరి దారి అవుతుంది.

నిరుపేదలకు అండగా నిలవాలి

రెడ్డి ఐక్య వేదిక సమావేశంలో సంఘం ప్రతినిధులు

జవహర్‌నగర్, న్యూస్‌టుడే: రెడ్డి సామాజిక వర్గంలోని పేద కుటుంబాలకు అండగా నిలవాలని రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి అన్నారు. ఆదివారం జవహర్‌నగర్ రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జవహర్‌నగర్‌కు చెందిన మాజీ సైనికోద్యోగి మామిళ్ల శ్రీనివాస్‌రెడ్డిని జిల్లా కో-కన్వీనర్‌గా నియమించారు. ఈ సమావేశంలో నాయకులు నాగిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, సుమన్‌రెడ్డి, జిట్టా శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాప్రా: ఉప్పల్ నియోజవర్గం రెడ్డి జేఏసీ నేతలు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఆదివారం కలిశారు. తెలంగాణా రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో 6న శిల్పారామంలో జరగనున్న రెడ్డి ప్రజాప్రతినిధుల సన్మాన కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ ఆహ్వానపత్రాన్ని అందజేశారు.

ప్రైవేటు ఉపాధ్యాయుల సేవలను గుర్తించాలి

మాట్లాడుతున్న విశ్రాంత జస్టిస్ చంద్రకుమార్

ఏఎస్ రావునగర్, న్యూస్‌టుడే: ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ సేవలను ప్రభుత్వాలు గుర్తించాలని విశ్రాంత జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఈసీఐఎల్‌లో మేడ్చల్ జిల్లా తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా వచ్చారు. ఉపాధ్యాయుడు దేశానికి పునాది. చదువుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగం రాక ప్రైవేట్ టీచర్‌గా మారిపోయారన్నారు. ఈ సమావేశంలో టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ విజయకుమార్, ఎంఈఓలు రామారావు, శశిధర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవి శరన్నవరాత్రి పూజలకు ముస్తాబు

నాచారం, న్యూస్‌టుడే: నాచారంలోని శ్రీమహంకాళి సహిత మహాకాళేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందడి మొదలయ్యింది. అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు మహంకాళి ఆలయంలో వచ్చేనెల 3న ప్రారంభం కానున్నాయి. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయపరిసరాల్లో చలువపందిళ్లు, మంచినీరు, పూజాసామగ్రి అందుబాటులో సిద్ధం చేసినట్టు ఆలయ ఛైర్మన్ జి. కృష్ణారెడ్డి, ఈఓ వెంకన్న తెలిపారు.

అడవి కాదు... ఆసుపత్రి ప్రాంగణమే


పిచ్చిమొక్కలతో మల్లాపూర్ పట్టణ ఆరోగ్య కేంద్రం

నాచారం, న్యూస్‌టుడే: మల్లాపూర్ సూర్యనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిసరాలు దట్టమైన అరణ్యాన్ని తలపిస్తోంది. ఆసుపత్రి మూడు వైపులా ముళ్లచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగాయి. ఎవరికైనా ఆ ప్రదేశాన్ని చూస్తే ఆసుపత్రి అనుకునేలా లేదు. ఆసుపత్రికి వచ్చే రోగులు విషపురుగులతో భయపడుతున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శామీర్‌పేట: దేవరయాంజాల ఉప కేంద్రం పరిధిలో మరమ్మతులతో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1వరకు దేవరయాంజాలలోని గిడ్డంగులు, ఎలిగెలగూడ గ్రామంతో పాటు వ్యవసాయ బోరు బావులకు కరెంట్ ఉండదు. కండ్లకోయ ఉప కేంద్రం పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5వరకు మల్లన్నకాలనీ, సాయిగీతాశ్రమం, గిడ్డంగులకు కరెంట్ సరఫరా ఉండని ఏఈ సురేందర్ ప్రకటించారు.

కనుల పండువగా శ్రీనివాస కల్యాణం

కల్యాణం చేస్తున్న పండితులు

హబ్సిగూడ, న్యూస్‌టుడే: హబ్సిగూడ వీధి నంబర్ 8లోని శ్రీ కోదండ రామాలయం సామాజిక భవనంలో శ్రీ వెంకటేశ్వర మహా మంత్ర పీఠం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీనివాస కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. వీక్షించడానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

యువజన సంఘాల యువకుల మధ్య ఘర్షణ

ఘట్‌కేసర్,న్యూస్‌టుడే: గణేష్ ఉత్సవాల సమయంలో జరిగిన చిన్న గొడవ రెండు యువజన సంఘాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఘట్‌కేసర్ సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీలోని ఎల్ఐజీ కాలనీలో కొన్నేళ్లుగా ఛత్రపతి శివాజీ యూత్, హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు కలిసి జరుగుతున్నాయి. ఈ ఏడాది వేర్వేరుగా ఉత్సవాలు నిర్వహించారు. రెండు యూత్ సభ్యులు ఆదివారం గట్టు మైసమ్మ ఆలయం వద్ద వేర్వేరుగా దావత్ చేసుకున్నారు. సాయంత్రం హనుమాన్ యూత్‌కు చెందిన రమేష్ కొంత మంది కలసి, శివాజీ యూత్ సభ్యులపై దాడి చేశారు. కొద్దిసేపటికి శివాజీ యూత్‌కు చెందిన గణేష్ మరికొందరు కలిసి శివారెడ్డిగూడ వద్ద రమేష్‌పై దాడి చేయడంతో తీవ్రగాయాలు అయ్యాయి. పలువురిని అదుపులోకి తీసుకుని, గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

రోడ్డు దాటుతూ.. కిందపడి మృత్యువాత

అంబర్‌పేట, న్యూస్‌టుడే: రోడ్డును దాటే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడి దివ్యాంగుడు మృతి చెందిన సంఘటన అంబర్‌పేట ఠాణా పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అశోక్ వివరాల ప్రకారం... ఉప్పల్ బీరప్పగడ్డకు చెందిన దివ్యాంగుడైన శ్రీనివాసులు(67) హిమాయత్‌నగర్‌లో లిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి శ్రీరమణ థియేటర్ వద్ద ద్విచక్ర వాహనాన్ని నిలిపి.. రోడ్డును దాటుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తలకు గాయం కావడంతో స్పృహ కోల్పోయాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించాక.. శ్రీనివాసులు మరణించినట్లు నిర్ధారించారు.

ట్రేడ్ యూనియన్ శాఖ కార్యదర్శిగా పెద్దస్వామి

ఉప్పల్, న్యూస్‌టుడే: ట్రేడ్ యూనియన్ ఉప్పల్ శాఖ కార్యదర్శిగా బి. పెద్దస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఉప్పల్ సర్కిల్ సీపీఎం కార్యదర్శి జె. వెంకన్న అధ్యక్షతన జరిగిన మహాసభలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పద్మ, కృష్ణ, ఎల్లయ్య, పర్వతాలు, వెంకటేష్, లావీష్ పాల్గొన్నారు.

జిల్లా గొర్రెల కాపరుల సెల్ కన్వీనర్‌గా సురేశ్

కీసర: భాజపా ఓబీసీ మోర్చా జిల్లా గొర్రెల కాపరుల సంఘం సెల్ కన్వీనర్‌గా చీర్లసురేశ్‌ను ఆపార్టీ జిల్లా గ్రామీణ అధ్యక్షుడు పి. విక్రంరెడ్డి నియమించారు. ఆదివారం జరిగిన సమావేశంలో నాగారం మున్సిపాలిటీ ఛైర్మన్ చంద్రారెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలరెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిరాళం కుంటలో శ్రమదానం

పాల్గొన్న ఛైర్మన్ కొండల్‌రెడ్డి, స్థానికులు

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: పోచారం మున్సిపల్ పరిధి అన్నోజిగూడ మిరాళం కుంట వద్ద ఆదివారం మున్సిపల్ ఛైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి స్థానికులతో కలిసి శ్రమదానం చేశారు. చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ : జవహర్‌నగర్: కుటుంబంతో కలిసి ఊరికి వెళ్లొచ్చే సరికి ఇంట్లో చోరీ జరిగింది. బాలాజీనగర్ శ్రీరామ్ నగర్ కాలనీలో అద్దెకుండే స్వప్న ఈ నెల 27న కుటుంబంతో కలిసి ఊరికి వెళ్లి ఆదివారం ఉదయం తిరిగొచ్చారు. అప్పటికే ఇంటి తాళం పగలగొట్టి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. బీరువాలో దాచిన రూ. 15 వేలతో పాటు కొంత సామగ్రి ఎత్తుకెళ్లారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉత్తమ సేవా పురస్కారం ప్రదానం

నాచారం, న్యూస్‌టుడే: నాచారం హెచ్ఎంటీనగర్‌కు చెందిన సంఘ సేవకుడు నందికొండ శ్రీనివాసరెడ్డికి 320సీ లయన్స్‌క్లబ్ ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపిక చేసింది. ఆదివారం లయన్స్ క్లబ్ భవన్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో అంతర్జాతీయ క్లబ్ డైరెక్టర్ బాబురావు, డిస్ట్రిక్టు గవర్నర్ కృష్ణ ప్రసాద్ పురస్కారాన్ని శ్రీనివాసరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సదానందం పాల్గొన్నారు.

హోమియో వైద్య శిబిరం

పరీక్ష చేస్తున్న వైద్యులు

చెంగిచర్ల (బోడుప్పల్), న్యూస్‌టుడే : రామంతపూర్ ప్రభుత్వ హోమియో ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం చెంగిచర్లలో హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 3వ డివిజన్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్పొరేటర్ చందర్‌గౌడ్ శిబిరాన్ని ప్రారంభించారు.

లారీ ఢీ: ద్విచక్రవాహనదారుడి మృతి

కీసర, న్యూస్‌టుడే: ఎలాంటి హెచ్చరికలు లేకుండా నిర్లక్ష్యంగా రోడ్డుపై నిలిపిన లారీని ఓ ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టడంతో మృత్యువాత పడిన సంఘటన శనివారం రాత్రి కీసర ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడిపల్లి మండలం పర్వతాపూర్‌కు చెందిన బట్టు అనిల్ కుమార్(40) ద్విచక్రవాహనంపై కీసరకు వచ్చి ఇంటికి వెళ్తుండగా రామలింగేశ్వర కాలనీ రోడ్డులో ఈ ప్రమాదం జరిగింది. చీకట్లో లారీని ఢీకొట్టడంతో అక్కడికక్కడే చనిపోయాడు. కీసర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కీసర, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడిని ఆటో ఢీకొట్టడంతో దుర్మరణం చెందాడు. ఈ ఘటన కీసర పరిధిలో జరిగింది. కాప్రా జమ్మిగడ్డకు చెందిన బాలరాజ్ (26), స్నేహితులతో కలిసి కీసర పరిధిలోని అంకిరెడ్డిపల్లికి వెళ్లారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో కీసర పెద్దమ్మ చెరువు సమీపంలో ఎదురుగా ప్రయాణికులతో వస్తున్న ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. బాలరాజుకు తీవ్రగాయాలతో చనిపోయడు. ఆటో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి.

లోక్‌అదాలత్‌లో 1,64,123 కేసుల పరిష్కారం

కాప్రా, న్యూస్‌టుడే: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌ను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బాలభాస్కర్‌రావు ప్రారంభించారు. ఇందులో రాజీ చేసుకోదగిన 1.64,123 క్రిమినల్, సివిల్ కేసులను న్యాయమూర్తులు అప్పటికప్పుడే విచారించి పరిష్కరించారు. కక్షిదారులకు రూ. 3.90 కోట్ల పరిహారం అందజేసినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి. కిరణ్‌కుమార్ తెలిపారు.

- విచారణ బెంచులు : 24, ● సివిల్ కేసులు : 29
- విద్యుత్తు బిల్లుల కేసులు : 427 ● ప్రీ లిటికేంట్ కేసులు : 20,643
- క్రిమినల్ కేసులు : 1.43 లక్షల
- బాధితులకు అందిన పరిహారం: 3.90 కోట్లు

శుభోదయ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నిక

కాప్రా: చర్లపల్లి డివిజన్‌లోని శుభోదయ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం జరిగాయి. కాలనీ అధ్యక్షుడిగా కంచికట్ల మల్లేష్, ఉపాధ్యక్షుడు బైరోజు వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి రాళ్లబండి కృష్ణాచారి తదితరులు ఎన్నికయ్యారు.

పనులు ప్రారంభం

నాచారం: నాచారం కార్తీకేయనగర్ వీధి నంబరు-10లో సీసీరోడ్డు పనులను ఆదివారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్ ప్రారంభించారు.

ఉపాధి కోల్పోతాం.. ఆలోచించండి

శామీర్‌పేట, న్యూస్‌టుడే: తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో రాజీవ్ రహదారి మధ్య నుంచి ఇరువైపులా 30 అడుగుల వరకు విస్తరణ చేపట్టేందుకు అధికారులు ఇళ్లకు మార్కింగ్ ఇవ్వటంతో తాము ఉపాధి కోల్పోతున్నామని బాధితులు కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌కు వినతి పత్రాన్ని ఆదివారం ఇచ్చారు. విస్తరణతో 200 కుటుంబాలు ఉపాధి కోల్పోయి వీధిన పడుతున్నారన్నారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డు పనికి భూమిపూజ

నాగారం: పట్టణ 16వ వార్డు రాజ్‌సుక్‌నగర్‌లో రూ. 7లక్షల సాధారణ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఆదివారం పురఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి భూమి పూజ చేశారు.

ఆశయాలను కొనసాగిద్దాం

జవహర్‌నగర్: మహనీయుల ఆశయాలు కొనసాగాలని అంబేడ్కర్ జ్ఞానమాల నిర్వాహకులు మహంకాళి బిక్షపతి అన్నారు. ఆదివారం జవహర్‌నగర్‌లో 8వ వారం జ్ఞానమాల నిర్వహించారు.

కార్యవర్గం: **బోడుప్పల్:** బోడుప్పల్ న్యూ సాయి మారుతీ నగర్ అధ్యక్షుడు డీవీ సుబ్బారెడ్డి, ప్రధానకార్యదర్శి సాగర్‌రెడ్డి, కోశాధికారి సంతోష్‌చారి, అసోసియేట్ అధ్యక్షులు_గా కె. నర్సింహా,జ్యోతిర్లింగం ఎన్నికయ్యారు.

మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కు మాతృవియోగం

కాప్రా: గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తల్లి బొంతు కమలమ్మ (68) కన్నుమూశారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. కాప్రాలోని చర్లపల్లి డివిజన్‌లోని రెడ్డికాలనీలో నివాసం ఉంటున్నారు. సోమవారం మల్లాపూర్‌లోని స్వర్గధామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

(8008573370 ఉప్పల్) (80085 73372 కాప్రా), (80085 73288 బోడుప్పల్), (98485 99881 ఘట్‌కేసర్), (80960 04937 నాగారం),

న్యూస్‌టుడే, నాగారం, కాప్రా, మేడ్చల్ రూరల్

? నాగారం మల్లికార్జున నగర్ కాలనీ సమీపంలో పశువుల పాకతో ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. **– మహేందర్, మల్లికార్జున కాలనీ , నాగారం**

✓ పశువుల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా ఆదేశిలిస్తాం. **–రామిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ , నాగారం**

? నాగారం విజయపురి కాలనీ ఆనంద నిలయం వద్ద వీధి దీపం నాలుగు రోజులుగా వెలగడం లేదు. ఈ ప్రాంతం చీకటిగా ఉంది **– వెంకటేష్ , విజయపురి కాలనీ**

✓ వెంటనే చర్యలు తీసుకుంటాం. **– రవి, వీధి దీపాల నిర్వాహకుడు, నాగారం**

? మేడ్చల్ మండలంలోని సైదోని గడ్డ తండా నుంచి రావల్‌కోల్‌కు వెళ్లే దారిలో మత్తడి వద్ద మలుపు ప్రమాదకరంగా ఉంది. సరి చేయాలి. **– బిక్షపతి, రావల్ కోల్**

✓ సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తాం. **– అపర్ణ, పంచాయతీ కార్యదర్శి**

? ఈసీఐఎల్, చర్లపల్లి మీదుగా చంగిచర్ల, ఉప్పల్‌కు సీటీ బస్సు సర్వీసులను నడిపించాలి. **– హరికిషోర్, చెంగిచర్ల**

✓ ఈ దిశగా బస్సు సర్వీసులను నడిపించే విషయం పరిశీలనలో ఉంది. **– మహేష్, డీఎం, కుషాయిగూడ డిపో**

? సాకేత్ రోడ్డు నుంచి ఆదర్శనగర్‌కు మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదు. **– వి.శ్రీకాంత్, ఆదర్శనగర్**

✓ పరిశీలించి కొత్త దీపాలను ఏర్పాటు చేస్తాం. **– రవీంద్ర, డీఈ, జీహెచ్ఎంసీ**

ప్రజలకు దగ్గరిగా..

- చోరీలపై ప్రజలకు అవగాహన
- అసాంఘిక చర్యలపై దృష్టి

నేరాలు దూరమయ్యేలా

సైకిల్‌పై వెళ్లి అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కీసర, న్యూస్‌టుడే:

కీసరలో జరిగే వారపు సంతలో కూరగాయలు కొనేందుకు వినోద్‌కుమార్ వెళ్లాడు. సంచిలో కూరగాయలు వేసుకునేందుకు కిందికి వంగాడు. అంతే... ప్యాంటు జేబులో ఉన్న ఖరీదైన సెల్‌ఫోన్ మాయమైంది. ● కూరగాయలు కొనుగోలు చేసేందుకుఓ మహిళ వ్యాపారితో బేరమాడుతోంది. చుట్టూ ఎవరున్నారో గమనించలేదు. జనం ఎక్కువగా ఉండటంతో పట్టించుకోలేదు.. కొద్ది దూరం వెళ్లి చూస్తే మెడలో మంగళసూత్రం కనిపించలేదు. ● నాగారంలో మెడికల్ షాప్‌లో మందులు కొనుగోలు చేసేందుకు ఓ మహిళ ఒంటరిగా వచ్చి వెళ్లడం గమనించిన ఓ గుర్తుతెలియని దుండగుడు వెంబడించి అదను చూసి ఆమె మెడలోని మంగళసూత్రం ఎత్తుకెళ్లాడు.

ఇలా శివార్లలో జరిగే వారపు సంతల్లో కొనుగోలుదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఇట్టే జేబుదొంగలు, గొలుసు, చరవాణిల చోరీలు, ఒంటరి మహిళలనే లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న గొలుసు దొంగతనాలు పోలీసులకు సవాల్‌గా మారాయి.

కాలనీల్లో ఇళ్లకు తాళాలు వేసి ఉంటే చాలు... దుండగులు ఇళ్లలోకి చొరబడి దొరికిన కాడికి దోచుకెళ్తున్నారు. పోలీసు యంత్రాంగం వీటిని అరికట్టందుకు ఎంతగా చర్యలు తీసుకుంటున్నా. ఆగడం లేదు.

ఇదీ ప్రయత్నం: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టారు.

నేరాలను నియంత్రించి ప్రజలకు రక్షణ కల్పించడానికి 24 గంటలు పోలీసులు తమ వాహనాల్లో తిరుగుతూ పెట్రోలింగ్ చేస్తారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో జరిగే నేరాలను అరికట్టడానికి పెట్రోలింగ్ చేస్తున్నారు. నియోజకవర్గంలోని మేడ్చల్, శామీర్‌పేట, కీసర, ఘట్‌కేసర్, జవహర్‌నగర్, మేడిపల్లి పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని కాలనీల్లో చోటు చేసుకుంటున్న చోరీలను అరికట్టేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజలతో బలమైన బంధం కోసం



– వెంకటయ్య, సీఐ కీసర

నేరాల నియంత్రణ, రక్షణ చర్యల్లో భాగంగా ప్రజలతో బలమైన కమ్యూనిటీ బంధాన్ని ఏర్పర్చుకునే క్రమంలో సైకిల్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. రాచకొండ కమిషనరేట్ పరిధిలో తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం సత్ఫలితాలనిస్తుంది. శివార్లలో జరిగే వారపు సంతల్లో పెట్రోలింగ్ చేయడంతో చోరీలను కొంత వరకు అరికట్టగలిగాం. పెట్రోలింగ్‌తో పాటు సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై ప్రజలలో అవగాహన పెంచుతున్నాం.

తగ్గుముఖం పట్టిన చోరీలు...

పోలీసులు సైకిళ్లపై పెట్రోలింగ్ చేస్తూ వివిధ రకాలుగా జరుగుతున్న నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. కీసర, నాగారం, దమ్మాయిగూడ, రాంపల్లి, అహ్మద్‌గూడ, శామీర్‌పేట, మేడ్చల్, ఘట్‌కేసర్, పోచారం, బోడుప్పల్, ఫిర్జాదిగూడలో పలు కాలనీల్లో నిర్వహించే వారపు సంతల్లో చోరీలపై అవగాహన కల్పిస్తున్నారు. గత కొన్ని రోజులుగా పోలీసులు వారపు సంతల్లో పెట్రోలింగ్ చేయడంతో చాలా వరకు చోరీలు తగ్గుముఖం పట్టాయి. ఒంటరిగా సంతల్లో కూరగాయల కొనుగోలుకు వెళ్లే సమయంలో మహిళలు ఖరీదైన బంగారు ఆభరణాలు, విలువైన సెల్‌ఫోన్లు వెంట తీసుకొని రావొద్దని, ఊళ్లకు వెళితే ఇంటి పక్కన ఉన్న వారికి, సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని అవగాహన కల్పిస్తున్నాం.

కీసరలోని కాలనీలో మహిళలకు సూచనలిస్తున్న పోలీసులు

PUBLIC NOTICE

The general public is hereby informed that my clients **Katakam Srinivas Reddy,** S/o Narsa Reddy, R/o. EWS 1133, KPHB Colony, Hyderabad, T.S and **Akkaldev Raghavendra Yadav,** S/o A. Jeeth Rao, R/o. Moosapet, Balanagar, Hyderabad, T.S. has entered into an Agreement of Sale dated 03-04-2021 with its lawful owner and possessor Mr. Billa Prabhakar Rao, S/o Late Billa Mallaiah, to purchase land in Sy.No. 43, admeasuring 3025 Sq. Yards or Ac 0.25 guntas situated at Medipally Village, Ghatkesar Mandal, Medchal-Malkajgiri Dist., T.S., and in this aspect my client has paid advance sale consideration and the final sale proceeding will be completed soon. Therefore, in this regard if any person/s have any right, title, claim or objection of whatsoever may contact the undersigned within 7 (seven) days from the date of this publication, together with all the relevant documents to sort out the objections, otherwise, my client will get the Sale Deed registered and thereafter no objection will be entertained.

MOHD BARKAT ALI
ADVOCATE
#3-5-854/1, Hyderguda, Hyderabad, T.S-29., **Cell: 9866696887**

నిఘా లేదు..
నిద్ర చోటెరగదు!

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో నిఘా, పోలీసుల పర్యవేక్షణ లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై దారికి అడ్డంగా ఓ వ్యక్తి నిద్రపోతున్నా ఎవరూ పట్టించుకోని పరిస్థితి ఇది. దీంతో ప్లాట్‌ఫారం పైకి రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఖరీదైన మద్యం ముసుగులో నకిలీ సరకు

పట్టుబడిన మద్యం, నిందితుడి (కూర్చున్న వ్యక్తి)తో ఆబ్కారీ అధికారులు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఖరీదైన మద్యం ముసుగులో కల్తీ మద్యం విక్రయాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. ఒడిశాకు చెందిన సత్యభారత్ శైల బంజారాహిల్స్ రోడ్ నం.2 ఇందిరానగర్‌లో నివసిస్తూ ఈవెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఖరీదైన మద్యం ఖాళీ సీసాల్లో తక్కువ ధర కలిగిన మద్యం నింపి బయటి మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు మరొకరి సాయంతో విక్రయిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్టీఎఫ్ పోలీసులు అతడి ఇంటిపై దాడి చేసి రెండు మద్యం సీసాలు, 42 ఖాళీ మద్యం సీసాలు, 128 మద్యం సీసా మూతలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నంద్యాల అంజిరెడ్డి తెలిపారు. ఈ నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన మలీనా దాసును అరెస్ట్ చేశామన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు సత్యభరత్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. మద్యం సీసాలను పట్టుకున్న వారిలో ఎస్టీఎఫ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్, సిబ్బంది భాస్కర్‌రెడ్డి, అజీమ్, శ్రీధర్, రాకేష్ ప్రకాశ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. వీరిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి అభినందించారు.

బాధితుల మౌనమే నేరాలకు దన్ను!

ఈనాడు, హైదరాబాద్

పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనకడుగు

దొంగతనాలు, అత్యాచారాలు, మోసాలకు పాల్పడుతున్న కేటుగాళ్లు పోలీసులకు కొత్త సవాల్ విసురుతున్నారు. ఎన్నో దారుణాలకు తెగబడుతూ దర్జాగా తిరుగుతున్నారు. దీనికి కారణం ఎవరో తెలిసినా.. పక్కా ఆధారాలున్నా.. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. గుట్టు బయటపడుతుందనే గుబులు. పరువు పోతుందనే భయంతో మౌనం వహిస్తున్నారు.

సొమ్ములు పోయినా.. గప్‌చుప్

- రాచకొండ పరిధిలో ఓ పాలవ్యాపారి ఇంట్లో ఇటీవల రూ.2 కోట్లు మాయమయ్యాయి. పోలీసులకు ఫిర్యాదు చేస్తే డబ్బు వివరాలు బయటపడతాయన్న కారణంతో రూ.15లక్షలు పోయినట్లు ఫిర్యాదు చేశారు. నిందితులనుంచి పోలీసులు రూ.85లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కరడుగట్టిన దొంగను అరెస్టుచేశారు.
- సికింద్రాబాద్‌లోని ఓ బంగారు దుకాణంలో రూ.1.5కోట్ల విలువైన నగలు చోరీకి గురయ్యాయి. ఫిర్యాదుచేస్తే స్మగ్లింగ్ బండారం బయటపడుతుందని యజమాని భావించారు.
- నగర శివారులోని ఓ ప్రముఖుని నివాసంలో బంగారు, వజ్రాభరణాలు మాయమయ్యాయి. ఆయన మౌఖిక ఆదేశాలతో సొమ్ము రికవరీ చేయించుకున్నారు. దొంగలు దొరికినా కేసు నమోదు చేయక పోవడంతో పోలీసులు హెచ్చరించి వదిలేసినట్లు తెలిసింది.
- అందమైన అమ్మాయిల పలకరింపు, వీడియోకాల్స్‌కు ఆకర్షితులై వలపువలలో చిక్కి రూ.లక్షలు నష్టపోతున్న బాధితుల్లో కేవలం 5 శాతం మంది మాత్రమే ఫిర్యాదు చేస్తున్నట్లు సైబర్‌క్రైం పోలీసులు తెలిపారు.
- గొలుసుకట్టు, సైబర్ మోసాల్లో రూ.10 వేల లోపు నష్టపోయిన బాధితులు ఫిర్యాదు చేయడం లేదు. పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తోందన్న అభిప్రాయంతో మౌనం వహిస్తున్నారు.

చెప్పలేక సతమతం

ఇటీవల అరెస్టయిన కరడుగట్టిన దొంగ వద్ద లభించిన సెల్‌ఫోన్‌లో పలువురు మహిళల నగ్నఫొటోలు, వీడియోలుచూసి పోలీసులు ఉలికిపాటుకు గురయ్యారు. చోరీలకు వెళ్లేముందు కల్లు దుకాణాల్లో, చిరు వ్యాపారాలు చేసే మహిళలను పరిచయం చేసుకుంటాడు. డబ్బులిస్తానని ఆశచూపి హోటల్ గదులకు తీసుకెళ్లి నగ్న వీడియోలు చిత్రీకరిస్తాడు. శారీరక అవసరం తీరాక ఆ వీడియోలు చూపి వారి నగలు కొట్టేసి మాయమవుతాడు. నగర శివారు నిర్మానుష్య ప్రాంతంలో ఏకాంతంగా గడిపేందుకు ప్రేమజంటలు చేరతాయి. వీరి ఫొటోలు, వీడియోలుతీస్తూ బెదిరించి కొన్ని ముఠాలు సొమ్ముచేసుకుంటున్నాయి. నిఘా ఉంచిన పోలీసులు కొందరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. డబ్బు, నగలు కాజేయడంతో పాటు కొందరు యువతులపై అత్యాచారాలకు పాల్పడినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఫిర్యాదుకు బాధితులు ముందుకు రాకపోవడంతో దోపిడీ కేసు నమోదుచేసినట్లు తెలుస్తోంది.

ముజ్రా పార్టీ.. 12 మంది అరెస్టు

అరెస్టయిన నిర్వాహకులు, ట్రాన్స్‌జెండర్లు

కేశవగిరి, న్యూస్‌టుడే: లేక్‌వ్యూ హిల్స్‌లో ముజ్రాపార్టీపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. నగర టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. బండ్లగూడ ప్రాంతానికి చెందిన హమీద్ గౌస్‌నగర్ ఉందాసాగర్ లేక్‌వ్యూహిల్స్‌లోని ఓ కంపౌండ్‌లో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. పరిసర బస్తీలకు చెందిన 8మంది యువకులు, నలుగురు ట్రాన్స్‌జెండర్లు(డ్యాన్సర్లు) పాల్గొన్నారు. రాత్రి 2.30 గంటల సమయంలో హోరెత్తుతున్న డీజే, అసభ్యకర నృత్యాలతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది. సమాచారం అందుకున్న దక్షిణమండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర, ఎస్సైలు ఎన్.నవీన్, ఎన్.నర్సింహులు, బండ్లగూడ ఠాణా పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించారు. మహ్మద్ జాబ్రీ(25), రియాజ్(23), షేక్ సొహెల్(19), షానవాజ్‌ఖాన్(23), ఇమ్రాన్(20), ఫేరోజ్(19), సయ్యద్ షా ఫారూఖ్(20), షేక్‌మహ్మద్(25)లతోపాటు ట్రాన్స్‌జెండర్లు, డాన్సర్లు ఆర్యా(28), సైఫ్ అలియాస్ లఖీ(27), జల్‌పల్లికి చెందిన కరీమాబక్ష(27), వట్టేపల్లికి అబ్దుల్ ఆమెర్(28)లను అరెస్టు చేశారు. వీరి నుంచి ఒక యాంప్లిఫయర్, డీజే బాక్సులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిర్వాహకుడు హమీద్ పరారీలో ఉన్నాడు. వీరిని తదుపరి దర్యాప్తు నిమిత్తం బండ్లగూడ పోలీసులకు అప్పగించారు. ముజ్రాపార్టీ నిర్వాహకులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు బండ్లగూడ సీఐ కె.సత్యనారాయణ తెలిపారు.

రాష్ట్ర సమగ్ర శిక్షణ ఐకాస కమిటీ ఎన్నిక

ఎన్నికైన సమగ్రశిక్ష ఉద్యోగులు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రాష్ట్ర సమగ్ర శిక్షణ కాంట్రాక్టు ఉద్యోగుల ఐకాసా నూతన కమిటీ ఎన్నికైందని అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడిగా తిరందాస్ సంతోశ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీలతరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌గౌడ్, కోశాధికారిగా యాదగిరి, ముఖ్య సలహాదారులుగా కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా అశోక్‌రెడ్డి, రాఘవేంద్రనాయుడు, స్వప్న, సంయుక్తకార్యదర్శిగా స్వరూప, పలువురు సభ్యులు ఎన్నికయ్యారు.

జీవో 317 బాధితుల చలో గాంధీ భవన్ 2న

గోడపత్రికల్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో జీవో 317 సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆ జీవో బాధిత ఉపాధ్యాయులు చలో గాంధీ భవన్‌కు పిలుపునిచ్చారు. ఏడాది కిందట గాంధీ జయంతిరోజు నాటి పీసీసీ అధ్యక్షుడిగా నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ ఈ అక్టోబరు 2న తామంతా పెద్ద సంఖ్యలో గాంధీభవన్‌కు వెళ్తున్నట్లు 317జీవో బాధిత ఉపాధ్యాయుల జేఏసీ ప్రకటించింది. ఆదివారం మధ్యాహ్నం చలో గాంధీభవన్ గోడపత్రికను నెక్లెస్ రోడ్డులోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు నాగేశ్వర్‌రావు, విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 48 గంటల్లో జీవో 317 బాధితుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఈ అంశాన్ని కాంగ్రెస్ మేనిఫెస్టోలోనూ చేర్చారని గుర్తుచేశారు. బాధితులు అందరికీ ఈ ప్రజాప్రభుత్వంలో న్యాయం జరిగేలా సబ్ కమిటీ ఛైర్మన్ మంత్రి దామోదర రాజనర్సింహ, సభ్యులైన మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ చొరవ చూపాలని కోరారు. నాయకులు మధుసూదన్‌రెడ్డి, సందీప్, వినోద, హరి, ప్రవీణ్, హారతి, లత, శ్రీలత, కవిత తదితరులు పాల్గొన్నారు.

మట్టి పెళ్లల కింద కార్మికుడి సమాధి

మూసాపేట, న్యూస్‌టుడే: మట్టిపెళ్లల కింద ఓ వలస కార్మికుడి బతుకు సమాధి అయ్యింది. కూకట్‌పల్లి ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపిన ప్రకారం..బిహార్ రాష్ట్రానికి చెందిన తండ్రీ కుమారులైన కిషోర్‌రాం, **రవికుమార్**(21) ఐదేళ్ల క్రితం నగరానికి వలసొచ్చారు. కూకట్‌పల్లి పరిధిలోని హానర్ భవన నిర్మాణ సంస్థలో పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. సదరు నిర్మాణ సంస్థలో తీగలు పరచడానికి 5 అడుగుల లోతుతో తవ్వకాలు చేపట్టారు. అందులోని మట్టిని పక్కనే పోసి ఉంచారు. రవికుమార్ ఆ గోతుల్లోకి దిగి తీగలకు మరమ్మతులు చేస్తున్నాడు. పక్కనే పోసిన మట్టి పెళ్లలు కూలి అతనిపై పడడంతో అందులోనే కూరుకుపోయాడు. సహచర కార్మికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు.

వచ్చే ఏడాది పర్యాటకశాఖ ఆధ్వర్యంలో గోల్ఫ్ టోర్నీ

హైదరాబాద్ గోల్ఫ్‌క్లబ్‌లో విజేతకు ట్రోఫీ అందిస్తున్న పర్యాటకశాఖ మంత్రి కృష్ణారావు

గోల్కొండ, న్యూస్‌టుడే: వచ్చే సంవత్సరం జనవరి, ఫిబ్రవరిలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో గోల్ఫ్‌టోర్నీ నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. టూంబ్స్ వద్ద గల హైదరాబాద్ గోల్ఫ్‌క్లబ్‌లో నిర్వహించిన తెలంగాణ మాస్టర్స్ గోల్ఫ్ ఛాంపియన్‌షిప్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో మరో గోల్ఫ్‌క్లబ్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చిన గోల్ఫ్ క్రీడాకారులు తెలంగాణలోని పర్యాటక కేంద్రాలను సందర్శించాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు రూ.కోటి ప్రైజ్‌మనీని అందజేశారు. కోల్‌కతాకు చెందిన శంకర్‌దాస్ తెలంగాణ మాస్టర్స్ గోల్ఫ్ ఛాంపియన్‌షిప్‌లో మొదటి స్థానంలో నిలిచి రూ.15లక్షల ప్రైజ్‌మనీ గెలుచుకున్నారు. అదేవిధంగా రెండో స్థానంలో నిలిచిన అంగద్‌చీమా రూ.10లక్షలు గెలుపొందారు.

ముందుగా ప్రజలకు కౌన్సెలింగ్ ఇచ్చి ఉండాల్సింది

- హైడ్రా కూల్చివేతలు, మూసీ రెడ్ మార్కులు సీఎం దృష్టికి తీసుకెళ్తా
- ఎమ్మెల్యే దానం నాగేందర్

ఫిలింనగర్, న్యూస్‌టుడే: చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మించిన అక్రమ కట్టడాలను హైడ్రా కూల్చివేసే ముందు అక్కడున్న వారికి ముందుగా కౌన్సెలింగ్ ఇచ్చి ఉంటే బాగుండేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఇదే తరహాలో మూసీ నిర్వాసితులను తరలించేటప్పుడు అధికారులు ప్రజలకు నచ్చజెప్పి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. హైడ్రా కూల్చివేతలపై నిజనిర్ధారణ కమిటీ వేయాలన్నారు. హైడ్రా కూల్చివేతలు, మూసి రెడ్ మార్కులు తదితర విషయాలన్నింటినీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో దానం ఆదివారం మీడియాతో మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పది మంది భారాస ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. భారాస హయాంలో రాజ్‌భవన్ ప్రాంతంలోని పార్క్ హోటల్‌కు శిఖం భూమిలో అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. దాని పక్కనే కేటీఆర్ స్నేహితుడు, ఆయన బినామి ప్రదీప్‌రెడ్డికి చెందిన ప్రదీప్ కన్‌స్ట్రక్షన్ పేరుతో శిఖం భూమిలో పది అంతస్తులకు అనుమతి ఎలా దక్కిందో చెప్పాలన్నారు. కేటీఆర్ ఉంటున్న ఫామ్‌హౌస్ కూడా ప్రదీప్‌రెడ్డిదేనన్నారు. ఐమ్యాక్స్ థియేటర్ కూడా చెరువులోనే ఉందన్నారు. అదే ప్రాంతంలో శోభ కన్‌స్ట్రక్షన్‌కు పదిహేను అంతస్తులకు శిఖం ల్యాండ్‌లో ఎలా అనుమతులిచ్చారని నిలదీశారు. భారాస నాయకులు హరీశ్‌రావు, కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డిలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ.. తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. మూసీనది పరివాహక ప్రాంతంలో ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. నందగిరిహిల్స్‌లో హైడ్రా గుడిసెలను కూల్చడానికి వచ్చిన సమయంలోనే తాను వ్యతిరేకించి గుడిసెల జోలికి వెళ్లవద్దని సూచించిన విషయాన్ని గుర్తు చేశారు.

వింటేజ్ టూర్స్ సంస్థకు జరిమానా

ఈనాడు, హైదరాబాద్: ప్రయాణ, ఆతిథ్య సేవల్లో లోపం కలిగించడం, అదనంగా డబ్బులు వసూలుచేసిన వింటేజ్‌టూర్స్ క్రియేటర్ ప్రైవేటు లిమిటెడ్‌కు హైదరాబాద్ కమిషన్-3 జరిమానా విధించింది. పురానాపూల్‌కు చెందిన ఎ.నరేందర్‌శర్మ ఫిర్యాదును విచారించిన కమిషన్ అతని నుంచి అదనంగా వసూలుచేసిన రూ.24వేలు చెల్లించాలని ప్రతివాదసంస్థను ఆదేశించింది. బ్యాంకాక్‌లోని ఫుకెట్‌లో నాలుగురోజుల ప్రయాణ, ఆతిథ్యసేవల కోసం నరేందర్‌శర్మ ప్రతివాదసంస్థను సంప్రదించి రూ.52వేలు చెల్లించారు. షెడ్యూల్ ప్రకారం ఆయా ప్రాంతాలకు తీసుకెళ్లడంలో ప్రతివాద సంస్థ విఫలమవ్వడంతో పాటు సేవలు సరిగా అందించలేదు. దీంతో కుటుంబమంతా అసంతృప్తిగా వెనుదిరగాల్సి వచ్చిందని ఫిర్యాదీ కమిషన్‌కు విన్నవించారు. పరిహారం ఇప్పించాలని కోరారు. ఇరువర్గాల వాదనలు, సాక్ష్యాధారాలు పరిశీలించిన కమిషన్.. ఈ మేరకు తీర్పు వెలువరించింది.

కుల గణనతోనే దేశ పురోగతి

మాట్లాడుతున్న అనిల్ జైహింద్, చిత్రంలో ప్రొ.సింహాద్రి, జస్టిస్ చంద్రకుమార్, దేవళ్ల సమ్మయ్య, వకుళాభరణం కృష్ణమోహన్, ప్రొ.మురళీ మనోహర్ తదితరులు

సోమాజిగూడ: దేశంలోని అన్ని సామాజిక వర్గాల లెక్కలను శాస్త్రీయంగా చేపట్టి సరైన చర్యలు చేపట్టినప్పుడే అంతరాలు లేని సమాజ నిర్మాణం జరుగుతుందని సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్ జాతీయ కన్వీనర్ డాక్టర్ అనిల్ జైహింద్ అన్నారు. ఆదివారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో తెలంగాణ బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన కులగణన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గౌరవ అధ్యక్షుడు దేవళ్ల సమ్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ, పాలకుల నిర్లక్ష్యం, ఉదాసీన వైఖరి కారణంగా దేశంలో వివక్ష, అణిచివేత, పేదరికం పెరుగుతున్నాయన్నారు. తెలంగాణ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ, కుల గణనకు దశాబ్దాలుగా డిమాండ్ వస్తున్నా కేంద్రం నిర్లక్ష్యంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క బీసీకి అన్యాయం జరిగిన అండగా నిలబడతానన్నారు. ప్రొ.కె.మురళీ మనోహర్, ప్రొ. ఐ.తిరుమలి, ప్రొ. పీఎల్ విశ్వేశ్వరరావు, ప్రొ. ఎస్.సింహాద్రి, డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్, దుర్గం రవీందర్, సోగరా బేగం, డాక్టర్ వేణు యాదవ్, వరంగల్ శ్రీనివాస్ మాట్లాడారు.

వేగంగా విస్తరిస్తున్న జీర్ణాశయ సమస్యలు

కార్యశాలలో ఆసుపత్రి (గ్రూపు) డైరెక్టర్ డా.పవన్ గోరంటి, తదితరులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: మారుతున్న ఆహార అలవాట్లు, జీవన శైలి నేపథ్యంలో దక్షిణ భారత్‌లో జీర్ణాశయ రుగ్మతలు వేగంగా పెరుగుతున్నాయని యశోద గ్రూప్ హస్పిటల్స్ డైరెక్టర్ డా.పవన్ గోరుకంటి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని యశోద ఆసుపత్రిలో ఆదివారం బ్రిడ్జ్ ది యాప్ 2.0 గ్యాస్ట్రో ఇంటెస్టైనల్ డిజార్డర్స్ అంశంపై కార్యశాల నిర్వహించారు. జీర్ణాశయ వైద్యంలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికత వైద్య విధానాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఐదుగురు పెద్దలలో ఒకరు జీర్ణాశయ రుగ్మతలు, కాలేయ వ్యాధులబారిన పడుతున్నారన్నారు. తగిన జాగ్రత్తలతో ఆ రుగ్మతలకు దూరంగా ఉండొచ్చన్నారు. వైద్యుల బృందం డా.నవీన్ పోలవరపు, డా.సంతోష్ ఎనగంటి, కె.ఎస్.సోమశేఖర్‌రావు, డా.గోపి శ్రీకాంత్, డా.శరత్‌చంద్ర గోరంట్ల తదితరులు పాల్గొన్నారు. 500మందికిపైగా గ్యాస్ట్రో ఎంటరాలజిస్టులు హాజరయ్యారు.

సేవే మా పథం..

గాంధీ ఆసుపత్రికి వెళ్లేందుకు రోడ్డు దాటలేక ఇబ్బందులు పడుతున్న కొందరు అంధులను చూసిన గాంధీ వైద్య కళాశాల విద్యార్థినులు ఇలా చెయ్యి పట్టుకుని తీసుకువెళ్లారు. తమ మంచి మనసు చాటుకున్నారు.

బిడ్డకు పాలు అందించడంపై సిజేరియన్ల ప్రభావం

సదస్సును ప్రారంభిస్తున్న ఆర్.వి.కర్ణన్, ఇతర ప్రతినిధులు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: శిశువులకు తల్లి పాలు ఇవ్వడంపై తీవ్ర ప్రభావం చూపుతున్న సమస్యల్లో సిజేరియన్లు ప్రధానమైనదని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్, నేషనల్ హెల్త్ మిషన్ ఎండీ ఆర్.వి.కర్ణన్ ఆందోళన వ్యక్తంచేశారు. 4వ సౌత్ ఏషియా లాంబ్‌కాన్ ఆధ్వర్యంలో అమీర్‌పేటలోని మ్యారీగోల్డ్ హోటల్‌లో తల్లిపాల బ్యాంకింగ్ వ్యవస్థపై ఆదివారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఆర్.వి.కర్ణన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల యూనిసెఫ్ ఫీల్డ్ అధికారి డా.జెలలేం బిర్హాను, సుషేనా హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా.సంతోష్‌కుమార్ మాట్లాడారు. తొలుత డా.సుదర్శన్‌రెడ్డి పటోళ్ల స్మారకోపన్యాసాన్ని డా.కె.పి.కుశ్వాహ ఇచ్చారు. డా.సుష్మా మల్లిక్‌కు ధాత్రి జీవనసాఫల్య పురస్కారం అందజేశారు. వివిధ దేశాలనుంచి 500 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

‘అమీన్‌పూర్‌లో కక్షపూరితంగానే కూల్చివేతలు’

మాట్లాడుతున్న డా.మహమ్మద్ రఫీ, చిత్రంలో మధుసూదన్, కళ్యాణ్, ఎన్.వెంకట్‌రెడ్డి

ఖైరతాబాద్: అమీన్‌పూర్‌లోని కిష్టారెడ్డిపేటలో గత ఆదివారం మూడు భవనాలను రెవెన్యూ అధికారులు కక్షపూరితంగానే నేలమట్టం చేశారని వాటి యజమానులు ఆరోపించారు. పట్టా స్థలాన్ని ప్లాట్లుగా చేసి విక్రయిస్తే అన్ని అనుమానాలు నివృత్తి చేసుకుని కొనుగోలు చేశామని, అధికారుల నుంచి నిర్మాణానికి పూర్తి అనుమతులు పొందామని ఆదివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో బాధితులు డా.మహమ్మద్ రఫి, కల్యాణ్, మధుసూదన్ ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల ఆసుపత్రిని జూన్‌లోనే ప్రారంభించామని, ఆసుపత్రి ఉన్న భవనాన్ని కూల్చారని ఆరోపించారు. మీడియాను, ప్రజలను, కోర్టును తప్పుదోవ పట్టించేలా హైడ్రా అధికారులు మీడియా సమావేశం ఏర్పాటుచేసి వక్రీకరించారన్నారు. తాము భవనం నిర్మించే దాకా ఏ అధికారి నుంచి అభ్యంతరం రాలేదన్నారు. రెవెన్యూ అధికారులు తమ నుంచి పెద్ద మొత్తంలో ఆశించారని, అందుకు సిద్ధంగా లేకపోవడంతో అప్పటి నుంచి ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు.

ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలి

మాట్లాడుతున్న జస్టిస్ రాధారాణి. చిత్రంలో జ్యోతి, సైక్లాబ్‌బాబు, వాహీద్, దశరథ్

ముషీరాబాద్: ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. ఆదివారం సుందరయ్య కళానిలయంలో.. కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం(కేవీఎస్ఎస్) రాష్ట్ర సదస్సు జరిగింది. ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. చట్టబద్ధంగా జరిగే కుల, మతాంతర వివాహాలను ప్రతిఒక్కరూ అంగీకరించాలన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టు కార్యదర్శి వినయ్‌కుమార్ మాట్లాడుతూ..ఇలాంటి పెళ్లిళ్లు చేసుకున్నవారికి రూ.10 లక్షలతోపాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. సైక్లాబ్‌బాబు, ఎండీ వాహిద్, కృష్ణచంద్, జ్యోతి, ఎం.దశరథ్ పాల్గొన్నారు.

‘హైడ్రాకు మూసీ ప్రక్షాళనకు సంబంధం లేదు’

మాట్లాడుతున్న మంత్రి పొన్నం

సిద్దిపేట టౌన్ : హైడ్రాకు మూసీ పరివాహక ప్రక్షాళనకు సంబంధం లేదని, భారాస నాయకులు సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో బలవంతంగా ఎవరినీ తరలించడంలేదన్నారు. నిర్వాసితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, రెండు పడక గదుల ఇళ్లు, వారి పిల్లలకు విద్యా, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. జిల్లా కేంద్రం సిద్దిపేటలో ఆదివారం నిర్వహించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడి పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో ఆక్రమణకు గురైన, అనుమతి లేని నిర్మాణాలను మాత్రమే హైడ్రా కూల్చివేస్తోందన్నారు.

గిట్టుబాటు ధరలతోనే రైతుల ఆత్మహత్యల నివారణ

మాట్లాడుతున్న డైరెక్టర్ సురేష్

మియాపూర్, న్యూస్‌టుడే: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించినప్పుడే రైతుల ఆత్మహత్యల నివారణ సాధ్యమవుతుందని పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్ ప్రాంగణంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి అధ్యయన కేంద్రంలో ఆదివారం ‘దేశంలో సమకాలీన వ్యవసాయ పరిస్థితి- సమస్యలు, పరిష్కారాలు -వ్యవసాయ ఆర్థిక విశ్లేషణ’ అంశంపై సెమినార్ నిర్వహించారు. అధ్యయన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ సురేష్ అధ్యక్షతన జరిగిన సదస్సులో వ్యవసాయ శాస్త్ర నిపుణులు ప్రొఫెసర్ నరసింహారెడ్డి, డాక్టర్ శరత్‌బాబు, డాక్టర్ సోమమర్ల, రైతు నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, ఆర్థికవేత్త ప్రొఫెసర్ సురేష్‌శర్మ తదితరులు హాజరయ్యారు. చిన్న రైతులకు అనుకూలంగా ఉండే రుణ, మార్కెటింగ్, రీసెర్చ్ విధానాలను ప్రభుత్వాలు రూపొందించాలని వక్తలు.కోరారు. రైతులకు బడ్జెట్‌లలో ప్రాధాన్యం కల్పించాలని అభిప్రాయపడ్డారు. రైతు కూలీ సంఘం నాయకులు ఝాన్సీ, విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాదరావు, సహకార వ్యవసాయ సంఘాల ఉద్యమ నేత నైనాని గోవర్ధన్, కిసాన్ సభ నాయకులు రామకృష్ణారెడ్డి, ప్రభు లింగం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటి ఫొటోలు తీసిన ఇద్దరి అరెస్టు

పోలీసుల అదుపులో నిందితులు

ధూల్‌పేట: ఎమ్మెల్యే ఇంటి వద్ద ఫొటోలు తీస్తున్న ఇద్దరిని మంగళ్‌హాట్ పోలీసులు అరెస్టు చేశారు. యూసుఫ్‌గూడకు చెందిన షేక్ ఇస్మాయిల్, ఖాజాపాషా శుక్రవారం అర్ధరాత్రి నంబరు ప్లేటు లేని బైకుపై ఆరాంఘర్‌కాలనీలోని ఎమ్మెల్యే రాజాసింగ్ ఇంటి వద్దకు వచ్చారు. చరవాణిలో ఫొటోలు, వీడియోలు తీస్తుండగా యువకులు 100 కు డయల్ చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. **ముంబయికి పంపిస్తున్నారు: రాజాసింగ్ ..** ఎమ్మెల్యే రాజాసింగ్ ఆదివారం వీడియో విడుదల చేశారు. ‘27న రాత్రి ఒంటిగంటన్నరకు నా ఇంటి వద్ద నలుగురు తిరిగారు. కొందరు వారిని పట్టుకోగా ఇద్దరు దొరికారు. వారి ఫోన్ చూస్తే ఫొటోలు ముంబాయిలోని వ్యక్తికి పంపిస్తున్నట్లు గుర్తించా. మంగళ్‌హాట్ సీఐని ఫోన్‌లో అడిగా. కేసు విచారిస్తున్నాం. త్వరలో వివరాలు ఇస్తానన్నారు’ అని తెలిపారు.

‘స్థానిక ఎన్నికల్లో’ రిజర్వేషన్ల పెంపు హామీ నెరవేర్చాలి

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రస్తావించిన మేరకు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామన్న హామీని నెరవేర్చాలని రాహుల్‌గాంధీని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఓ లేఖలో కోరారు. మద్దతిచ్చే విషయమై భారాస, భాజపా, సీపీఐ, సీపీఎం తదితర పార్టీలు విధాన ప్రకటన చేయాలన్నారు.

రాజ్యాంగ సవరణ చేయాలి సుప్రీం తీర్పు మేరకు 50శాతం పరిమితి అని చెప్పి రిజర్వేషన్లు పెంచకుండా తప్పించుకోవడానికి వీల్లేదన్నారు. ఇప్పటికే అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లను పెట్టి.. 50 శాతం సీలింగ్‌పై పార్లమెంటు రాజ్యాంగ సవరణ చేసిందన్నారు. పేద బీసీ కులాల కోసం రాజ్యాంగ సవరణ చేయరా? అన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు కొండవీటి రాధాకృష్ణ కన్నుమూత

నాగోలు, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు కొండవీటి రాధాకృష్ణ(93) మృతిచెందారు. అనారోగ్య సమస్యలతో మలక్‌పేట యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. నల్గొండ జిల్లా చిట్యాల మండలం తాళ్లవెల్లంల గ్రామానికి చెందిన ఆయన.. గడ్డిఅన్నారం డివిజన్ సరస్వతీనగర్‌లో స్థిరపడ్డారు. 14 ఏళ్ల ప్రాయంలోనే రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడారు. డీఈవోగా పదవీ విరమణ చేసిన అనంతరం ఇబ్రహీంపట్నంలో సేవా కేంద్రాన్ని ఏర్పాటుచేసి వయోవృద్ధులకు సేవలందించారు. స్వగ్రామంలో గ్రంథాలయాన్ని స్థాపించారు. రాష్ట్రపతి అవార్డు సైతం అందుకున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వీవీనగర్‌లోని శ్మశానవాటికలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

బుద్ధవనంతో సాగర్ రహదారి విస్తరణ

తక్కళ్లపల్లి వద్ద రహదారికి ఇరువైపులా కృష్ణా పైపులైన్లు

యాచారం, న్యూస్‌టుడే: నాగార్జున సాగర్‌లోని బుద్ధవనం పుణ్యమా అని హైదరాబాద్-నాగార్జున సాగర్ రహదారి విస్తరణకు మోక్షం లభించనుంది. బౌద్ధ పర్యాటక ప్రాంతాల సమగ్ర అభివృద్ధిలో భాగంగా ఈ అంతర్రాష్ట్ర ప్రధాన రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల అధికారులను ఆదేశించడం తెలిసిందే. దీంతో అధికారుల్లో కదలిక మొదలైంది. ప్రైవేటు ఏజెన్సీ ద్వారా డీపీఆర్(సమగ్ర ప్రాజెక్టు నివేదిక) డీపీఆర్ సిద్ధంచేస్తారు. తరువాత నిధులు కేటాయించి పనులుప్రారంభిస్తారు. ఏడు మీటర్ల వెడల్పు ఉన్న రోడ్డును కృష్ణా పుష్కరాల వేళ 2016లో 10 మీటర్ల(రెండు వరుసలు) వెడల్పుగా విస్తరించారు. ఇప్పుడు నాలుగు వరుసలు(16మీటర్లు)గా విస్తరించనున్నారు.

అప్పట్లో రూ.300 కోట్లతో ప్రతిపాదనలు

సాగర్ రహదారి విస్తరణపై అధికారులు రెండేళ్ల క్రితమే అంచనాలు రూపొందించారు. ఇరువైపులా ఉన్న కృష్ణా తాగునీటి పైపులైన్ల కారణంగా రోడ్డు విస్తరణ సాధ్యాసాధ్యాలపై ఆర్అండ్‌బీ, మహానగర జలమండలి అధికారులు సంయుక్త సర్వేచేశారు. యాచారం మండలం తక్కళ్లపల్లి మినహా మిగిలిన చోట్ల నాలుగు వరుసలుగా విస్తరించవచ్చని గుర్తించామని ఆ సర్వేలో పాల్గొన్న డీఈ వేణుగోపాల్‌రెడ్డి ఇటీవల చెప్పారు. ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ, యాచారం మండలం గున్‌గల్, మంచాల మండలం ఆగాపల్లి వద్ద అండర్‌పాస్ రోడ్డు నిర్మించాలని నిర్ణయించారు. ఇబ్రహీంపట్నంవద్ద కృష్ణా పైపులైన్ ఉన్న బైపాస్‌రోడ్డు జలమండలి ఆధీనంలో ఉంది. మొత్తం రహదారి నాలుగు వరుసల అభివృద్ధికి రూ.300కోట్లు అవసరమవుతాయని ప్రాథమిక అంచనాను ప్రభుత్వానికి అందజేశారు. నిధుల కొరతతో డీపీఆర్ సిద్ధంచేయలేదు. ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది.

ప్రస్తుతం ఇదీ పరిస్థితి

హైదరాబాద్‌నుంచి మాల్ వరకు 60 కి.మీ.ల సాగర్ రహదారి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉంది. మిగిలిన రహదారి నల్గొండ జిల్లాలో ఉంటుంది. నగరంలోని ఇన్నర్ రింగ్‌రోడ్డునుంచి ఓఆర్ఆర్(బొంగులూరు) వరకు 6 వరుసలుగా, అక్కడి నుంచి ఇబ్రహీంపట్నం వరకు 4 వరుసలుగా రహదారి ఉంది. ఇబ్రహీంపట్నం నుంచి సాగర్ వరకు నాలుగు వరుసలుగా విస్తరించి మధ్యలో విభాగిని ఏర్పాటుపనులు కొత్తగా చేపట్టాల్సి ఉంటుంది.

త్వరలో డీపీఆర్ పనులు

– మధుసూదన్, ఈఈ, ఆర్అండ్‌బీ

సాగర్ రహదారి విస్తరణకు డీపీఆర్ రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. విస్తరణ పనులు హైవేస్ అథారిటీ ద్వారా చేయిస్తారా లేక ఆర్అండ్‌బీ శాఖతో చేయిస్తారా అనేది స్పష్టం కావాల్సి ఉంది.

18వ అంతస్తు నుంచి దూకి తల్లీకూతుళ్ల ఆత్మహత్య

నార్సింగి: అనుమానాస్పద స్థితిలో కూతురుతో కలిసి తల్లి భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరానికి చెందిన మానస(30) తన భర్త, కూతురితో కలిసి నార్సింగి సమీపంలోని మైహోం అవతార్‌లో నివాసం ఉంటున్నారు. భర్త సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఆదివారం రాత్రి కూతురు కృషి(3)తో కలిసి 18వ అంతస్తు నుంచి దూకి మానస ఆత్మహత్యకు పాల్పడింది. ఇందుకు అనారోగ్యమే కారణం కావచ్చని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతురాలి సోదరుడు ఆమె వెన్నునొప్పితో బాధపడుతున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	115–00
రిటైల్	137–00
డ్రెస్డ్	199–00
స్కిన్‌లెస్	226–00

త్వరలో కులగణన ప్రారంభం: బీసీ కమిషన్ ఛైర్మన్

ప్రసంగిస్తున్న జి.నిరంజన్

చాంద్రాయణగుట్ట న్యూస్‌టుడే: రాష్ట్రంలో త్వరలో కులగణన ప్రారంభమవుతుందని రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ పేర్కొన్నారు. గౌలిపుర ఆరె కటిక పొదుపు, పరపతి సహకార సంఘం సమావేశం గౌలిపురలోని ఎ.కె.భవన్‌లో జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కులగణనతో రాష్ట్రంలోని అన్ని కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. మాజీ కార్పొరేటర్లు ఆలె జితేంద్ర, చేకోల్‌కార్ శ్రీనివాస్, సంఘం అధ్యక్షుడు యశ్వంత్‌రావు, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌రాజ్, అంబదాస్, ఎం.రమేశ్ పాల్గొన్నారు.

నిర్యాణం

పెద్దకర్మ
మంచితనానికి మారుపేరుగా నిలిచి అందరి హృదయాలలో సుస్థిరస్థానం సంపాదించుకున్న మీ మరణం మా అందరికీ తీరని లోటు. మీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము.
శోకతప్త హృదయాలతో...
తల్లి: అనంతుల విజయ
భార్య: అనంతుల సరిత వేణు
అన్నలు - వదినలు
అక్కలు - బావలు
తమ్ముళ్ళు - మరదళ్ళు
చెల్లెళ్ళు - మరదళ్ళు
కుమారులు - కూతుళ్ళు
కోడళ్ళు - అల్లుళ్ళు
మరియు కుటుంబ సభ్యులు
కీ॥శే॥ అనంతుల వేణుగోపాల్ గౌడ్ గారు
జననం: 10-08-1972 మరణం: 18-09-2024
కార్యస్థలం: తేది.30-09-2024, సోమవారం నాడు గౌడ సంక్షేమ సంఘం, నాగోల్ నందు నిర్వహించబడును.

దశదినకర్మ
మంచికి, మమతానురాగాలకు మారుపేరు మీరు, భౌతికంగా మా అందరి నుండి దూరమైన మీ మధుర జ్ఞాపకాలు మా అందరి హృదయాల్లో పదిలం.. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ..
శోకతప్త హృదయాలతో..
కుమారులు - కోడళ్ళు: బి. రాఘవేంద్ర రెడ్డి (Ex IAF) - అమరావతి
బి. శ్రీనివాస్ రెడ్డి (Class -1 Contractor) - సరిత,
బి. మధుసూదన్ రెడ్డి (Class -1 Contractor) - మంజుల
కూతుళ్ళు - అల్లుళ్ళు: బి. సుజాత - కీ॥శే॥ బి. రామ్‌రెడ్డి,
ఆర్. ఇంద్రమ్మ - కీ॥శే॥ ఆర్. బాల్‌రెడ్డి, కీ॥శే॥ ఎ. వినోద - మోహన్‌రెడ్డి
కీ.శే. బరెంకబావి తారమ్మ గారు
మరణం: 21-09-2024
భర్త: కీ.శే. బరెంకబావి నారాయణ రెడ్డి గారు
కార్యస్థలం: తేది: 30-09-2024, సోమవారం నాడు మ॥ 12.00 గం॥లకు SBR గార్డెన్, ఉప్పరపల్లి, పిల్లర్ నెం.175 నందు దశదినకర్మ జరుపబడును.
మనుమలు, మనుమరాళ్ళు మరియు బరెంక బావి కుటుంబ సభ్యులు


ప్రథమ వర్ధంతి
భాద్రపద బహుళ త్రయోదశి 30-09-2024
అమృత హృదయంతో మా అందరినీ ఆదరించి, అనుక్షణం కుటుంబ శ్రేయస్సుకు ఎంతో శ్రమించి మమ్మల్ని ఉన్నతంగా తీర్చిదిద్దిన మీరు మా నుండి దూరమై నేటికి 1 సం॥ గడిచినను నీ మధుర స్మృతులు మరువలేకున్నాం. మీ పవిత్ర ఆత్మ శాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...
బాధాతప్త హృదయాలతో...
భార్య: లింగ అన్నపూర్ణ
కుమారుడు - కోడలు: లింగ విశ్వనాథ్ - స్మిత
కూతుళ్లు - అల్లుండ్లు: లింగ మాధురి - మధుసూదన్
మంచుకొండ గాయత్రి - రవికుమార్
మనుమళ్లు: మినాల్, నిఖిల్ ఆర్య, ముకుంద్ కృష్ణ, సిద్ధార్థ్
మనుమరాండ్లు: వసుంధర, అఖిల
కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు
కీ॥శే॥ లింగ అంజయ్య గుప్త గారు
మరణం: 12-10-2023
కార్యస్థలం: మా స్వగృహము శ్రీనివాసము, గోఖలెనగర్, రామంతాపూర్ తేది: 30-9-2024

అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
పై సమాచారం సంబంధీకులందరికి చేరాలి ఎలా?
మీ ప్రయత్నానికి ఒక సులభ మార్గం
ఈనాడు లో ప్రకటన ఇవ్వడం ద్వారా
మీ సమస్యకు పరిష్కారం లభించును.
GST 5% అదనం
ఈనాడు హైదరాబాద్ సిటీలో కలర్ ప్రకటన రేటు చాలా తక్కువ
99635 22257
L.B.Nagar & Uppal: 90000 15736
Ameerpet, Oldcity & Sec-bad : 80085 97633
Kukatpally : 8008515142

రూ.9.90లకే జీబీ డేటా ఇస్తున్నాం

- వచ్చే ఆరేళ్లలో 6జీ సేవలు అందించనున్నాం
- టెలికాం శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అతుల్ సిన్హా

ఈనాడు, హైదరాబాద్: 'ప్రైవేటు టెలికాం సంస్థలతో పోల్చుకుంటే బీఎస్ఎన్ఎల్ సేవలు ఎంతో చవకైనవి. రూ.9.90 పైసలకే ఒక జీబీ డేటా ఇస్తున్నాం. ఇంత తక్కువ ధరలో ఏ టెలికాం ఆపరేటర్ ఇవ్వడం లేదు. ఇంటర్నెట్ వేగాన్ని పెంచేందుకు అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరిశోధనలు చేస్తున్నాం. వచ్చే ఆరేళ్లలో ఆరో జనరేషన్(6-జీ) సేవల్లో పది శాతం బీఎస్ఎన్ఎల్ వాటా ఉండాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకూ సమాచార నెట్‌వర్క్ లేని 26 వేల గ్రామాల్లో వీలైనంత వేగంగా సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటు చేయనున్నాం. విద్యార్థులు, యువత మా నెట్‌వర్క్‌కు ఆకర్షితులయ్యేలా ప్రణాళికలు అమలు చేస్తున్నా"మని కేంద్ర టెలికాం శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్(ఐసీటీ) అతుల్ సిన్హా అన్నారు. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు. ప్రైవేటు టెలికాం ఆపరేటర్లు రీఛార్జీ ధరలు పెంచినా.. తాము మాత్రం పెంచడం లేదని తెలిపారు.

కొత్త సంవత్సరంలో 5జీ సేవలు

ఇంటర్నెట్, మొబైల్ సేవల్లో ప్రైవేటు, సంస్థలతో పోలిస్తే.. వేగంగా ముందుకు వెళ్తున్నాం. కొత్త సంవత్సరంలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు 5జీ సేవలు అందించనున్నాం. 5జీ టెక్నాలజీని పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించాం. చరవాణులు, బ్రాడ్‌బాండ్ సహా ఇతర ఫ్రీక్వెన్సీలకు ఇది ఉపయోగపడనుంది. విదేశీ సంస్థలకు దీటుగా సాంకేతిక పరిజ్ఞానం ఉండడంతో మెట్రో నగరాల్లో విద్యార్థులు, యువకులు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను ఇష్టపడుతున్నారు.

గ్రామీణ ప్రాంతాలకు ప్రాధాన్యం.. ప్రైవేటు, కార్పొరేటు, విదేశీ టెలికాం ఆపరేటర్లు పట్టణాలు.. నగరాలకే ప్రాధాన్యమిస్తుండగా.. వివిధ రాష్ట్రాల్లోని మారుమూల గ్రామీణ ప్రాంతాలకే మేం ప్రాధాన్యమిస్తున్నాం. బ్యాంకులు, ఆసుపత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో ఇంటర్నెట్ కనెక్టివిటీకి ప్రాధాన్యం పెరిగింది. నగదుకు బదులుగా డిజిటల్ చెల్లింపులు పెరిగాక గ్రామాల్లో మహిళలు, పిల్లలు జీపే, ఫోన్‌పే, పేటీఎం, భీమ్‌లను ఎంచుకుంటున్నారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకునే 26వేల గ్రామాల్లో సెల్‌ఫోన్ టవర్లు అందుబాటులోకి తీసుకువస్తున్నాం.

'గజ్వేల్ ఘటన'పై నిజనిర్ధారణ కమిటీ నివేదిక

మహేశ్‌కుమార్‌గౌడ్‌కు నివేదిక అందిస్తున్న అచ్యుత రమేష్‌బాబు, జల్పల్ నరేంద్ర

అంబర్‌పేట, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం ములుగు మండలంలోని దాసరపల్లి గ్రామంలో దళిత కుటుంబాలు ఏర్పాటు చేసుకున్న వినాయక మండపం దహనం ఘటనపై కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీ సెల్ వేసిన నిజనిర్ధారణ కమిటీ నివేదికను ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు అందజేశారు. ఈ ఘటనపై నిజనిర్ధారణకు కాంగ్రెస్ దళిత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ నగరిగారి ప్రీతం... ఉపాధ్యక్షుడు అచ్యుత రమేష్‌బాబు నేతృత్వంలో జల్పల్ నరేంద్ర, డా.పెరుమాండ్ల రామకృష్ణ సభ్యులుగా త్రిసభ్య కమిటీని వేశారు. ఘటనపై విచారణను పూర్తిచేశాక.. నివేదికను టీపీసీసీ అధ్యక్షుడికి అందజేసినట్లు అచ్యుత రమేష్‌బాబు వెల్లడించారు.

దేవాలయాల భూములు పరిరక్షించాలి

గోల్నాక, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అన్యాక్రాంతమవుతున్న దేవాలయాల భూములను పరిరక్షించాలని భాజపా ధార్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ అన్నావజ్ఝల సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ... నగరంలోని బేగంబజార్ పరశురామ ఆలయానికి చెందిన 1100 చదరపు గజాల స్థలాన్ని కొందరు కబ్జా చేశారని ఆరోపించారు. దీంతో భాజపా ధార్మిక సెల్, సర్వ బ్రాహ్మణ పరిషత్, పరశురామ ఆలయ కమిటీ సభ్యులు సంయుక్తంగా పోరాటం చేసి ఈ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడినట్లు పేర్కొన్నారు. ఆలయాల భూముల పరిరక్షణకు భాజపా ధార్మిక సెల్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తుందని కూడా ఆయన చెప్పారు.


సుందరీకరణ.. గోడలపై బొమ్మలే ఆకర్షణ నగర సుందరీకరణలో భాగంగా ప్రధాన రహదారుల పక్కన ప్రహరీలపై వివిధ రకాల చిత్రాలను వేస్తున్నారు. రాజ్‌భవన్ రోడ్డులో రైల్వే మార్గం పక్కన గోడలపై వేసిన బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి.

విండ్సర్ కారుతో సినీనటి సీరత్‌కపూర్, ఎండీ బషీర్ బాబుఖాన్, డైరెక్టర్ సిరాజ్ బాబుఖాన్

ఎంజీ విండ్సర్ సీయూవీ కారు ఆవిష్కరణ

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: వినియోగదారులకు అందుబాటు ధరలో, అత్యాధునిక ఫీచర్లతో ఎంజీ విండ్సర్ సీయూవీ కారును తీసుకొచ్చారని, ఇలాంటి కార్లు తమకెంతో ఇష్టమని సినీనటి సీరత్‌కపూర్, బుల్లితెర నటుడు మానస్ నాగులపల్లి తెలిపారు. ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్‌లోని మహాత్మాగాంధీ రోడ్డులోని ఎంజీ మోటర్స్ షోరూంలో ఎండీ బషీర్ బాబుఖాన్, డైరెక్టర్ సిరజ్ బాబుఖాన్‌తో కలిసి విండ్సర్ కారును ఆవిష్కరించారు. వినియోగదారుల భద్రత, సౌకర్యం, అత్యాధునిక ఫీచర్ల మేళవింపుతో విండ్సర్ కారును తీసుకొచ్చామని డైరెక్టర్ సిరజ్ బాబుఖాన్ తెలిపారు.

మణికొండలో మాంగళ్య షోరూం ప్రారంభం

నార్సింగి న్యూస్‌టుడే: మణికొండలో కొత్తగా ఏర్పాటు చేసిన మాంగళ్య షోరూంను సినీ నటి శ్రీలీల ఆదివారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. షోరూంలో అన్ని రకాల వస్త్రాలు ఆకట్టుకుంటున్నాయన్నారు. మాల్ డైరెక్టర్లు పి.ఎన్.మూర్తి, కాసం నమఃశివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలలో 12 ఏళ్లుగా ప్రజల ఆదరణ చూరగొంటున్నామని తెలిపారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, యాలాల నరేష్, సిద్దప్ప, బషీర్, కాసం ఫణి, కాసం సాయిక్రిష్ణ, కాసం ధీరజ్, డా.కాసం ప్రీతం పాల్గొన్నారు.

బహుముఖ సవాళ్లకు సామాజిక శాస్త్రాలతోనే పరిష్కారం

జ్యోతి వెలిగిస్తున్న జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో ప్రొ.ఆసిమ్ ప్రకాష్, డీపీ సింగ్, మనోజ్ కుమార్ తివారి, నరేంద్ర మిశ్రా

ఫిలింనగర్, న్యూస్‌టుడే: జీవితకాల అభ్యాసానికి అవసరమైన ఆలోచనలను టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టీఐఎస్ఎస్) అకాడమీలో విద్య పెంపొందిస్తుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో టీఐఎస్ఎస్ హైదరాబాద్ విభాగం పదో వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రస్తుత రోజుల్లో సామాజిక శాస్త్రాల విద్యకు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని వివరించారు. వైస్ ఛాన్స్‌లర్ ప్రొ.మనోజ్‌కుమార్ తివారీ, ప్రొ. డి.పి.సింగ్, టీఐఎస్ఎస్ హైదరాబాద్ క్యాంపస్ డైరెక్టర్ ప్రొ.ఆసిమ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వంతో వైద్యుడికి మరింత విలువ

WORLD HEART
బ్రహ్మానందానికి చిత్రపటాన్ని అందిస్తున్న రాజశేఖర్, మన్నం గోపీచంద్, డాక్టర్ రమేష్ గుడపాటి

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: మనిషిని భయం, ఒత్తిడి ఎంతో కుంగదీస్తాయనీ.. ముందుగానే గుర్తించి వాటి నుంచి బయటపడితే మంచి ఆరోగ్యంతో ఉంటామని సినీ హాస్యనటుడు డాక్టర్ బ్రహ్మానందం అన్నారు. వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో ఆదివారం స్టార్ ఆసుపత్రి ఏర్పాటు చేసి 16 ఏళ్లవుతున్న సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. పువ్వుకు వాసన ఎంత విలువనిస్తుందో.. వైద్యుడికి మానవత్వం అంత విలువనిస్తుందని అన్నారు. స్టార్ ఆసుపత్రుల గ్రూపు ఎండీ డాక్టర్ గోపీచంద్ మాట్లాడుతూ గుండె వ్యాధులను నియంత్రించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి ఎంతో ముఖ్యమన్నారు. జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ గుడపాటి మాట్లాడుతూ ఆసుపత్రిలో మంచి వాతావరణంతో రోగి ఎంతో త్వరగా సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా తిరిగి వెళ్తారన్నారు. ఆసుపత్రి ప్రారంభించిన మొదటి రోజుల్లో గుండె శస్త్రచికిత్సలు చేయించుకుని ఆరోగ్యంగా జీవిస్తున్న పదిహేను మందికి 'స్టార్ ఇన్‌స్పైరింగ్ హార్ట్ అవార్డు-2024'ను అందించారు. ఆసుపత్రి డైరెక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆభరణాల పరిశ్రమల సేవలకు పురస్కారం

అవార్డు అందుకుంటున్న కీర్తిలాల్స్ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఆభరణాల పరిశ్రమకు అందించిన విశేషమైన సేవలకు గుర్తింపుగా కీర్తిలాల్స్ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్‌ను ఐకాన్ ఆఫ్ ది జ్యువెలరీ ఇండస్ట్రీ 2024 అవార్డుతో ముంబయిలోని జియో కన్వెన్షన్ ట్రేడ్ సెంటర్‌లో సత్కరించారు. స్టోర్ ఆఫ్ ది ఇయర్, రింగ్ ఆఫ్ ది ఇయర్, థీమ్ బేస్డ్ జ్యువెలరీ, బ్రైడల్ జ్యువెలరీ ఆఫ్ ది ఇయర్ అవార్డులు అందుకున్నట్లు ఆల్ ఇండియా జెమ్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ పేర్కొంది.

ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడిగా కె.ఎస్.రామారావు విజయం

31st Annual General Body Meeting
మాట్లాడుతున్న కె.ఎస్.రామారావు, చిత్రంలో తుమ్మల రంగారావు, కాజ సూర్యనారాయణ తదితరులు

ఫిలింనగర్, న్యూస్‌టుడే: ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్ఎన్‌సీసీ) ఎన్నికల్లో ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడిగా సినీ నిర్మాత కె.ఎస్.రామారావు విజయం సాధించారు. ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో ఆదివారం ఎఫ్ఎన్‌సీసీ ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. అధ్యక్ష పదవికి డా. జ్యోతిప్రసాద్ కోసరాజు, కె.ఎస్.రామారావులు పోటీ పడ్డారు. ఉపాధ్యక్షుడుగా ఎస్.ఎన్.రెడ్డి, కోశాధికారిగా జాజుల శైలజ, పర్మనెంట్ కమిటీ మెంబర్స్‌గా కొగంటి భవాని వీవీజీ కృష్ణంరాజు, సీహెచ్ వరప్రసాద్‌రావు, ఏడిద సతీష్, మోహన్ వడ్లపట్లలు విజయం సాధించారు.

EENADU
Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

Data Editing Software Projects are Available for Outsourcing to Companies with Min. 5 Computers. Ph: 9652438681

SAREES

మావద్ద కంచి, ఆరతి, ధర్మవరం, ఉప్పాడ, వెంకటగిరి, గద్వాల్, పోచంపల్లి, నారాయణపేట, అన్ని రకముల పట్టు చీరలు & బెనారస్, కలకత్తా, సూరత్ ఫ్యాన్సీ చీరలు హోల్‌సేల్‌గా లభించును. Hyd, మియాపూర్ ఆల్విన్ కాలనీ. ✆ 7396099834.

TENDER

స్క్రాప్ కాంట్రాక్ట్: 100 మె.ట. అల్యూమినియం డ్రాస్, చిప్స్, పౌడర్, MS, కార్టన్, కంటైనర్లు, తుక్కు. తనిఖీ ప్లాంట్- I, బొల్లారం & ప్లాంట్- II, సదాశివపేట వద్ద. రాణే (మద్రాస్) లి, IDA బొల్లారం, మెదక్ జిల్లా- 502325 వద్ద 1-10-2024 మ 2 గం.లకు టెండరు నిర్వహించబడును. వెల్కమ్ ఆక్షనీర్స్, చెన్నై-14. సెల్: 09840731925, www.welcomeauctioneers.com.

FINANCIAL SERVICES

CHITS

కపిల్, మార్గదర్శి & CVR చిట్స్‌లో లక్ష నుండి కోటి రూపాయల చిట్స్, న్యూ మరియు వేకెంట్ చిట్స్ కలవు. ✆ 9573130999.

REAL ESTATE

FLAT FOR SALE

ECIL

Kapra, Srinivas Nagar, Jyothi Pearl Apartments, 3 BHK, Flat No.501, 1872 Sft, E/Face. Contact: 9866755549. No Brokers.

KUKATPALLY

Individual Floor 3-BHK Apartment (1900, 2200 & 2275 Sft E/W/N Facing) Flats for Sale in KPHB. Raja- 9966744544.

SAGAR ROAD

BNరెడ్డి నగర్, సాగర్ హైవే రోడ్డు నందు 2BHK, 3BHK Flats- Ready to Move అమ్మకమునకు కలవు. 4,500/-P.Sft only. Ph:8523044468

JUBILEEHILLS

3BHK E/F Flat (2000sft) for sale at Filmnagar, Jubileehills Opp: Apollo Medical college & Hospital. Ph: 9849010325

KOMPALLY

Flat for Sale Approx 1500x15 Sq.Ft North Facing at Dulapally ✆ 9949986656, 9533633010.

PLOT FOR SALE

ADIBATLA

ఫాక్స్‌కాన్, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ దగ్గరలో 25 ఎ॥ల్లో HMDA ప్లాట్లు @ ఎలిమినేడు, స్పాట్ రిజి. Nr ORR, TSIIC, ఫ్రీ సైట్ ట్రిప్.లోన్స్. Ph: 8978470361

ECIL

Kapra: Sri Enclave(NRI colony) 170sqy East Face Gated community, 24/7 security. Godavari water. call: 8247310332

HAYATHNAGAR

500 yds plot for sale at Autonagar Vanasthalipuram, 80 ft road facing, Contact: 9246522275

MEDCHAL

Villa Plots Available at Saket Sizes: 200 to 600 sq.yds Near Ayodhya Circle, Gowdavelli. Cont: 97015 49945

SECUNDERABAD

266 Sq.Yards W/F AP Text Book Colony Gunrock 200 Sq.Yards N/W/F Kiran Enclave Diamond Point ✆ 9949986656, 9533633010.

SHADNAGAR

Shadnagar Town Villa Plots Rs.16,500/- P.sq.yd Nego. DTCP/ RERA. Bank Loans. 2KM From Bus Stand, Gated Comm. Ph: 9666856378

SRISAILAM HIGHWAY

8 Lakhs discount on Land Lord share Villa Plots @ Kadthal- Srisailam H/W nr Future City & Pharma City. Raja- 9966744544.

SHANKARPALLI

JB's Infra వారి అతితక్కువ ధరలో @ మోమిన్‌పేట. DTCP Appvd. ప్రీమియం లేఅవుట్ VKB Dt. Spl ఆఫర్- 7500/- P. Sq.Yd. 9010277299, 9032645065.

GENERAL

800 Sq.yds for sale at peddagolconda facing service road of ring road. Contact: 9848274893/ 9246522275

Plots for Sale HMDA Approved Bhongir 300 Sq.Yds N/E Facing and near Ramoji Film City Malkapur 266 Sq.Yds E/F Direct Buyers. ✆ 9949178495.

సువర్ణభూమి హైదరాబాద్, వైజాగ్‌లో. డిటిసిపి హెచ్ఎండిఏ హుడా అప్రూవల్ కలిగిన ప్లాట్లు గలవు. ఎటువంటి ఏజెంట్ బ్రోకర్ లేకుండా డైరెక్ట్ కంపెనీ ద్వారా కొనుక్కోవచ్చు. చాలా తక్కువ ధరకే 70% లోన్ ఫెసిలిటీ కలదు. 9966777773.

FARM HOUSES

Srisailam Highway-13Km to Kadthal. Best Location. 900 Sq.Yds. Gated Farm Land with Gate, Plantation, Fencing, Security. 36L Only. Clear Title. Just 2Km to RRR. Best Investment. Site Pics Call: 89288 85353

TO LET

Office space 2BHK rent @ SR Nagar, 1100 sft, East facing, Newly constructed, Lift available, 300 meters from Metro. Ph: 9676665324

JOBS

Prakash Hyundai Nizamabad Requires Below Staff: Spares Parts Manager: 5-6 Yrs Exp., Spares Parts Assistant: 2 Yrs Exp., Contact: 9133311667 (Whatsapp), Email: hrprakashyundai@gmail.com

Wanted Experienced "Sales Managers" for a Reputed Construction Company at Kompally. Contact: 9000216443, 9000216448.

Req home appliance field services ENG's 10no female TL 2no field sales exe's 5no sal+ fuel+ ince. Ph: 9059223423

Wanted Sales Boy/ Girl for Exclusive Night Wear Garments Shop @ Bachupally Main Road near Volvo Center. Time 10 AM-9 PM. ✆ 9390152875.

Kotak Group Need Rtd Govt./ Pvt, HW, Doctors Tax Con. P/F Jobs 30K pm. V N Chary: 9866311741

Wanted for Showroom in koti office boys & helpers. contact: 9440091832

Wanted Godown Incharge for FMCG Products Preferable Areas: Alwal & Secunderabad. Good Salary. ✆ 7893003525.

క్యాషియర్ కావలెను. అనుభవం ఉన్నా/ లేకున్నా Comp. నాలెడ్జ్. వ: 35 లోపు. జీతం: 10-15,000/- వరకు. రూప్‌లక్ష్మి PVT మార్కెట్, కొత్తపేట్. 9948074388, 9246287462.

హౌస్‌కీపింగ్ బాయ్స్/ సూపర్‌వైజర్లు/ సెక్యూరిటీ/ మార్కెటింగ్ మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. సెక్టర్ సర్వీసెస్ LLP. ✆ 9963088813, 9963261110.

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషంట్స్ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 18k. ✆ 91609 00024, 96404 00073.

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు. ఫ్రీ రూమ్ + భో॥ Hyd. 9182260297.

వాచ్‌మెన్ కావలెను. ప్రముఖ విద్యా సంస్థలో పనిచేయుటకు వాచ్‌మెన్ కుటుంబం కావలెను. భోజనం + వసతి ఇవ్వబడును. ✆ 9493979566/ 7780266711

హోటల్ కొరకు సప్లయర్స్, కటింగ్ బాయ్స్, క్లీనింగ్ మరియు మోరీ బాయ్స్ కావలెను. 15-24 వేలు మరియు భోజనం, వసతి కలదు. Ph:9394894138, 6300978030.

FACULTY/ TEACHERS

Wanted Educated Woman to Teach Primary School with Good Communication Skill. Call: Gandhian School. ✆ 9989399427, 9392501989.

MARKETING/ SALES

JR Jewel Palace, Miyapur New Showroom is hiring for Sales Staff. Salary: 20K- 50K PM. Interested can share your resume on WhatsApp: 9515278203.

రియల్ ఎస్టేట్ చరిత్రలో ఫస్ట్ టైం మా సంస్థ యొక్క DTCP గేటెడ్ కమ్యూనిటీ వెంచర్స్. మార్కెటింగ్ చేయుటకు టీం లీడర్స్ శాలరీ 45K, టెలికాలర్స్ శాలరీ 25K+ గిఫ్ట్స్+ ఇన్సెంటివ్స్+ బొనాంజా. ✆ 8341965559.

DRIVERS

Wanted Driver For Ashok Leyland Dost & Mahindra, JEETO staying near Balanagar cell: 9100921049

ACCOUNTING

Required Tally Operator Ladies/ Gents to work in Office at Suraram, Opp: Mallareddy Hospital, Good Salary. ✆ 9866222229, 8074645445.

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డ్స్, లేడీ గార్డ్స్ సూరారం నందు హాస్పిటల్ మరియు హాస్టల్‌లో పనిచేయుటకు కావలెను. మంచి జీతం. Ph: 7799766169, 8688010536

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

BOOK YOUR CLASSIFIED
Ad ₹1450/- (5 Lines B/w)
3 Ads Package ₹ 3695/-
7 Ads Package ₹ 8580/-
★ GST 5% Extra
Ph: 040- 23440304, 23318181, Extn: 6422
Through Online
www.eenaduclassifieds.com

వృద్ధుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: మంత్రి

బెలూన్లు ఎగురవేసి ర్యాలీ ప్రారంభిస్తున్న సీతక్క

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: వృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డి.అనసూయ సీతక్క అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి అవగాహన ర్యాలీని ఆదివారం ఉదయం నెక్లెస్ రోడ్డులో నిర్వహించారు. మంత్రి బెలూన్లు ఎగురవేసి, జెండా ఊపి ప్రారంభించారు. వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సాధికారిత శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగులు, వృద్ధుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి జిల్లాలో వృద్ధాశ్రమాల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. ర్యాలీ జలవిహార్ నుంచి పీపుల్ ప్లాజా వరకు కొనసాగింది. తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య, దివ్యాంగుల, వయోవృద్ధుల, మహిళ సంక్షేమ శాఖ సంచాలకులు బి.శైలజ, సహ సంచాలకులు రాజేందర్, ఎన్జీఓ సంఘాలు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించండి


జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి, శ్రీనివాస్‌గుప్తా తదితరులు

నాగోలు, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దిల్‌సుఖ్‌నగర్‌లో ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ వాణీదేవితో కలిసి టీపీసీసీ ప్రచారకమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలీచాలని జీతంతో మెరుగైన విద్యాబోధన చేస్తున్న ప్రైవేటు టీచర్ల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్సీ వాణీదేవి మాట్లాడుతూ.. ప్రైవేటు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వాలు చొరవ చూపాలని కోరారు. ప్రైవేటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు, అజయ్ కార్తిక్, బీసీ సంఘం నేత కోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈఎస్ఐసీలో వైద్య శిబిరానికి స్పందన


శిబిరంలో ఈఎస్ఐసీ వైద్య సిబ్బంది

సనత్‌నగర్, న్యూస్‌టుడే: సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ వైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో శని, ఆదివారాలు ఉచిత కార్డియాలజీ, కిడ్నీ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 3 వేల మంది ఈఎస్ఐసీ కార్డుదారులకు ఈసీజీ, ఎకో, రక్తపరీక్షలు ఉచితంగా చేశారు. వైద్యులు ఆరోగ్య సలహాలు అందించారు. శిబిరాన్ని ఆసుపత్రి వైద్య నిపుణులు డా.సూర్యప్రకాశ్‌రావు పర్యవేక్షించారు.

నగరంలో ఈనాడు

- ధర్నాచౌక్‌లో ఉ.11 గం.లకు భాజపా ప్రజాప్రతినిధుల 24గంటల రైతు హామీల సాధన దీక్ష ప్రారంభం
- ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో ఉ.11గం.లకు పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభ
- బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మ.2గం.లకు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రెస్ కాన్ఫరెన్స్
- సైఫాబాద్‌లోని టెలిఫోన్ భవన్‌లో సా.4గం.లకు సిల్వర్ జూబ్లీ వేడుకలు
- టీహబ్‌లో సా.4గం.లకు ఉబర్ షటిల్ సర్వీస్ ప్రారంభోత్సవ కార్యక్రమం
- అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తులో సా.5.30గం.లకు 'పరిణిత వాణి' కార్యక్రమం
- రవీంద్రభారతి మినీ హాల్‌లో సా.6గం.లకు 'పంచుకుందాం రా' పుస్తకావిష్కరణ.

'గోసంరక్షణ బిల్లు మోదీతోనే సాధ్యం'

బీబీ పాటిల్‌తో రితీష్ జాగిర్దార్, జస్మత్‌పటేల్

కాచిగూడ, న్యూస్‌టుడే: పార్లమెంటులో గోసంరక్షణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించడం ప్రధాని నరేంద్రమోదీతోనే సాధ్యమవుతుందని తెలంగాణ గోసంరక్షణ సంస్థలు తెలిపాయి. గోవును జాతీయప్రాణిగా ప్రకటించి సంరక్షించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. కాచిగూడకు చెందిన తెలంగాణ లౌఫర్‌కౌ ఫౌండేషన్ ఛైర్మన్ జస్మత్‌పటేల్, ప్రాణిమిత్ర రమేష్ జాగింగ్దార్ మెమోరియల్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి రితీష్ జాగిర్దార్‌లు.. మాజీ ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో భాజపా సభ్యత్వాన్ని తీసుకున్న సందర్భంగా మాట్లాడారు.

పేపర్ డిస్ట్రిబ్యూటర్లకు సహకార సంఘం ఏర్పాటు చేయాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే: పేపర్ డిస్ట్రిబ్యూటర్లకు సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.సత్యం కోరారు. ఆదివారం చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో.. ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ల సమావేశం జరిగింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి డిస్ట్రిబ్యూటర్లు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ డిస్ట్రిబ్యూటర్ల కోసం సహకార పరపతి సంఘాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్, ప్రతినిధులు అశోక్‌కుమార్, మధు, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్.బి.నగర్

●ఎల్.బి.నగర్ ● మలక్‌పేట

బాలల హక్కుల పరిరక్షణ సమావేశం

జస్టిస్ మౌషమి భట్టాచార్యతో కరుణ వాకాటి, అశోక్‌కుమార్, మిర్జా రజా అలీబేగ్ తదితరులు

సైదాబాద్, న్యూస్‌టుడే: ఈ నెల 28, 29 తేదీల్లో దిల్లీలో యూనిసెఫ్ సహకారంతో సుప్రీంకోర్టు జువైనల్ జస్టిస్ కమిటీ బాలల హక్కుల పరిరక్షణ సమావేశం జరిగినట్లు తెలంగాణ కరక్షనల్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మిర్జా రజా అలీ బేగ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో దివ్యాంగ పిల్లల హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. తెలంగాణ జువైనల్ జస్టిస్ కమిటీ ఛైర్‌పర్సన్ జస్టిస్ మౌషమి భట్టాచార్య, తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రెటరీ కరుణ వాకాటి, సీఐడీ ఎస్పీ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

న్యాయవాదుల రిలే దీక్షలు నేటి నుంచి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: న్యాయవాదుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సోమవారం (నేడు) నుంచి రాష్ట్రంలోని అన్ని కోర్టుల ఎదుట ధర్నాలు, రిలే దీక్షలు చేపట్టనున్నట్లు తెలంగాణ న్యాయవాదుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు వై.కొండల్‌రెడ్డి ప్రకటించారు. వర్చువల్‌గా ఆదివారం నిర్వహించిన తెలంగాణ న్యాయవాదుల సంఘాల సమాఖ్య సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల స్థానంలో ఎట్టి పరిస్థితుల్లో క్యాడర్ (రెగ్యులర్) పీపీలను నియమించొద్దని కోరారు. క్రిమినల్ కేసుల్లో పోలీస్ దర్యాప్తు అధికారులకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(41ఏ సీఆర్‌పీసీ) ప్రకారం కల్పించిన విస్తృత అధికారాలను సవరించాలని డిమాండ్ చేశారు. అలాగే న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. ఈ డిమాండ్లను నెరవేర్చేవరకు ధర్నాలు, దీక్షలు చేస్తామని పేర్కొన్నారు.

వ్యాయామంతో గుండె పదిలం

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: నిత్య వ్యాయామంతో గుండె పదిలంగా ఉంటుందని పలువురు వైద్యులు సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బైరామల్‌గూడ గ్లెనిగల్స్ అవేర్ ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. గుండె జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గుండె వైద్యనిపుణులు రాజీవ్‌గార్గ్, శ్రీనివాస్‌రెడ్డి, ముఖేశ్‌రావు, మల్లీంద్రస్వామి, కరుణాకర్‌రెడ్డి తదితరులు వివరించారు.

వనస్థలిపురం, న్యూస్‌టుడే: ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వనస్థలిపురం జీవన్‌సాయి ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి ఎండీ డా.రామ్‌దాస్, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

మూసారాంబాగ్, న్యూస్‌టుడే: దిల్‌సుఖ్‌నగర్ ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆధ్వర్యంలో ఆదివారం ప్రోస్టేట్ క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ప్రోస్టేట్ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. వైద్యులు శ్రీనివాస్, సుభాశ్‌చంద్రబోస్, దీప్తి, వలి, స్నిగ్ధ, రామకృష్ణ, రఘునాథ్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా..

సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో పావని, కార్పొరేటర్ అరుణ

సైదాబాద్, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా చార్మినార్ ప్రాజెక్టు పరిధిలో నెల పాటు పోషణ్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాతా, శిశు సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ నెల ఒకటో తేదీ నుంచే మలక్‌పేట, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, చార్మినార్, అంబర్‌పేట నియోజకవర్గాల్లోని 274 అంగన్‌వాడీ కేంద్రాల్లో వినూత్న కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, చిన్నారులకు ఇవ్వాల్సిన పోషకాహారం గురించి వివరించారు. గర్భిణుల నమోదు, సీమంతాల నిర్వహణ, ఆరోగ్య పరీక్షలు, చిన్నారులకు అన్నప్రాశన, అక్షరాభ్యాసం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

నెల రోజులు కొనసాగిన అవగాహన కార్యక్రమాలు

పిల్లల వివరాల సేకరణ..

● అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎత్తు, బరువులను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేశారు. సప్లిమెంటరీ పోషకాహార కార్యక్రమంలో టేక్ హోమ్ రేషన్, ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షలు చేపట్టారు. పిల్లలు, గర్భిణులు, కౌమార బాలికల్లో పోషకాహార లోపాన్ని అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర అవగాహన కల్పించారు. పాఠశాలల విద్యార్థులకు పోషకాహారం అవశ్యకత, వ్యక్తిగత పరిశుభ్రత ప్రాధాన్యాన్ని వివరించారు. పెరటి తోటలు లేని ప్రదేశాల్లో వాటిని నెలకొల్పేలా కార్యచరణ చేపట్టారు. ఐరన్, విటమిన్-సి, విటమిన్-బి కాంప్లెక్స్, కాల్షియం సమృద్ధిగా ఉండే పండ్లు, కూరగాయల గురించి పూర్తిస్థాయి అవగాహన కల్పించారు.

చార్మినార్ ప్రాజెక్టు పరిధిలో..

అంగన్‌వాడీ కేంద్రాలు	: 274
గర్భిణులు	: 5,785
బాలింతలు	: 4,944
ఆరేళ్లలోపు పిల్లలు	: 10,535
కౌమార బాలికలు	: 8,560
● ఖాళీలు:	
ఉపాధ్యాయులు	: 40 మంది
ఆయాలు	: 80 మంది

అంగన్‌వాడీలకు మార్గదర్శనం..

పోషణ్ అభియాన్ ముగింపు ఉత్సవం సైదాబాద్ ఎస్బీహెచ్ గడ్డి అన్నారం-1 కాలనీలో శనివారం నిర్వహించారు. రక్తహీనత ఉన్న బాలింతలు, గర్భిణుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ.. అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. మానసిక, శారీరక ఎదుగుదల తక్కువగా ఉన్న పిల్లలకు సకాలంలో పోషకాహారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా చార్మినార్ ప్రాజెక్టు సీడీపీవో బి.పావని అంగన్‌వాడీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. పలు పోషకాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

ఎల్బీనగర్:	76759 19030
మలక్‌పేట:	80085 73284
హయత్‌నగర్:	98336 64897
కర్మన్‌ఘాట్:	94400 32872
బండ్లగూడ:	96034 78579
మూసారాంబాగ్:	79933 00559

న్యూస్‌టుడే, బండ్లగూడ, మూసారాంబాగ్, హయత్‌నగర్, కర్మన్‌ఘాట్

? ఆనంద్‌నగర్ ప్రధాన రోడ్డు పక్కన డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి పూడిక తీసి పక్కనే పడేశారు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. తరలించకపోవడంతో వాహనాల రాకపోకలతో వ్యర్థాలు రోడ్డంతా పరుచుకుంటున్నాయి. **–జంగానాయక్, ఆనంద్‌నగర్**

✓ వెంటనే తరలించాలని సిబ్బందిని ఆదేశిస్తాం. **– శ్రీనివాస్‌రెడ్డి, జీఎం, జలమండలి**

? మూసారాంబాగ్ పరిధి బాప్టిస్ట్ చర్చి పక్క వీధిలో వీధి కుక్కలతో ఇబ్బందులు పడుతున్నాం. రాకపోకల సమయంలో వెంటపడుతున్నాయి. **– ప్రియాంక, హాస్టల్ విద్యార్థిని**

✓ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కార చర్యలు చేపడతాం. **– భాగ్యలక్ష్మి, కార్పొరేటర్, మూసారాంబాగ్**

? శాలివాహన నగర్ ఉద్యానం ఎదురు వీధిలో మూడు నాలుగు రోజుల నుంచి చెత్త తొలగించడం లేదు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. **– రామారావు, కాలనీవాసి**

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి, వెంటనే చెత్తాచెదారాన్ని తొలగిస్తాం. **– గోవిందరెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి, మలక్‌పేట**

? మూసారాంబాగ్ పరిధి మలక్‌పేట ప్రధాన రహదారి నుంచి సలీంనగర్ కాలనీకి వెళ్లే మార్గం అధ్వానంగా మారింది. నూతన రోడ్డు నిర్మించాలి. **– దయానంద్**

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి.. నూతన రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక రూపొందిస్తాం. **– పీర్ సింగ్, ఈఈ, జీహెచ్ఎంసీ**

? అన్మగల్ హయత్‌నగర్ పరిధిలోని వేంకటేశ్వర కాలనీలో ఏడాది క్రితం భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. నేటికీ పనులు ప్రారంభించలేదు. డ్రైనేజీ వ్యవస్థల లేక ఇబ్బందులు పడుతున్నాం. **– నాగిళ్ల పాండురంగయ్య, వేంకటేశ్వర కాలనీ**

✓ జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడి, డ్రైనేజీ పనులు ప్రారంభమయ్యేలా చూస్తాం. **– కళ్లెం నవజీవన్‌రెడ్డి, కార్పొరేటర్, హయత్‌నగర్**

? హస్తినాపురం భూపేశ్‌గుప్తా నగర్ ప్రభుత్వ పాఠశాల ఎదుట చెత్త పారబోస్తున్నారు. **– శ్రీనివాస్‌యాదవ్, కాలనీ అధ్యక్షుడు, భూపేశ్‌గుప్తానగర్**

? భూపేశ్‌గుప్తా నగర్ కల్లు దుకాణం ముందు చెత్తాచెదారం పేరుకుపోయింది. రాకపోకల సమయంలో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. **– స్వామిరావు, శ్రీరమణకాలనీ**

✓ ఈ సమస్య మా దృష్టిలో ఉంది. రెండు, మూడు రోజులకు ఓసారి స్పెషల్ డ్రైవ్ చేపట్టి, వ్యర్థాలను తొలగిస్తున్నాం. పాఠశాల విద్యార్థులతో పాటు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం. **– శంకర్, జవాన్, హస్తినాపురం**

పట్టపగలే వెలుగులు

వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో పగలు వెలుగుతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో రాత్రి వెలగడం లేదు. బీఎన్‌రెడ్డినగర్ రాఘవేంద్రస్వామి ఆలయం వెనక నర్సరీ పార్కు సమీపంలో ఆదివారం పగలు వెలుగుతూ కనిపించాయి ఇలా...

–న్యూస్‌టుడే, వనస్థలిపురం

పరపతి సహకార సంఘం వార్షిక సమావేశం

జిల్లాల ప్రధాన న్యాయమూర్తులతో సంఘం నాయకులు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: న్యాయస్థానాల్లో విధులు నిర్వర్తించే ప్రతి ఉద్యోగి న్యాయశాఖలో ముఖ్య భూమిక కలిగి ఉంటారని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల కోర్టుల ప్రధాన న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల పరస్పర సహాయక సహకార పరపతి సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం రంగారెడ్డి జిల్లా కోర్టులో సంఘం అధ్యక్షుడు కరుణాకర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వచ్చిన రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు, వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ.. సంఘం కోరిక మేరకు ఆయా జిల్లాల కోర్టుల్లో ఉద్యోగుల పరపతి సహకార సంఘం కార్యాలయాల కోసం గదులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో 2022-23, 2023-24 విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబర్చిన ఉద్యోగుల పిల్లలకు బహుమతులు అందజేశారు. ముగ్గురు న్యాయమూర్తులతో పాటు సంఘం మాజీ డైరెక్టర్‌గా ఉండి ప్రస్తుతం ఆర్మూర్‌లో న్యాయమూర్తిగా పనిచేస్తున్న సరళారాణిని సత్కరించారు. సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్లు డప్పు రాములు, దార రాములు, వేణుగోపాల్, సి.రాజు, అక్తర్ పాషా, మహిపాల్, వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుతప్పితే ప్రమాదమే!

హయత్‌నగర్‌లో జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ బాలికల వసతి గృహం ఇది. భవనం పిట్టగోడపై నిత్యం కొంత మంది విద్యార్థినులు ఇలా ప్రమాదకరంగా కూర్చుంటున్నారు. పట్టు తప్పితే ప్రమాదం తప్పదు.

–న్యూస్‌టుడే, హయత్‌నగర్

శాఖల మధ్య సమన్వయలోపంతో ఇబ్బందులు

ఆందోళన చేస్తున్న స్థానికులతో నర్సింహారెడ్డి

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: జీహెచ్ఎంసీ, ఆర్ అండ్‌బీ శాఖల మధ్య సమన్వయ లోపం స్థానికులకు శాపంగా మారిందని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. జాతీయరహదారికి ఇరువైపులా ఉన్న పలు కాలనీల వాసులతో ఆదివారం మన్సూరాబాద్ పరిధి కేఎల్ఎం షాపింగ్ మాల్ సమీపంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జాతీయ రహదారి పనుల కారణంగా.. రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలనీవాసులు రహదారిపైకి వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు ఎత్తుగా ఉండటంతో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. మరమ్మతుల విషయంలో గుత్తేదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. భాస్కర్‌రావు, వేణారెడ్డి, కరుణాకర్ యాదవ్, రామేందర్, గిరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు

సభ్యత్వాన్ని అందజేస్తున్న సురేందర్ యాదవ్

బండ్లగూడ, న్యూస్‌టుడే: అన్ని రంగాల్లో దేశ బలోపేతానికి పాటుపడుతున్న ప్రధాన మోదీ పాలనపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారని భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్ యాదవ్ అన్నారు. భాజపా సభ్యత్వ నమోదుకు పెరుగుతున్న ఆదరణే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ బండ్లగూడ రాజీవ్ స్వగృహ సముదాయంలోని సీ-బ్లాక్‌లో ఆదివారం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులకు పార్టీ సభ్యత్వాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో భాజపా బలోపేతం అవుతుందన్నారు. రానున్న రోజుల్లో పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాధిక, శేఖర్, శివకుమార్ పాల్గొన్నారు.

పదవీ విరమణ శుభాకాంక్షలు

శ్రీ మతి శ్రీ శ్రీనివాసులు-జయశ్రీ

పోలీసు శాఖలో 42 సం॥లు అధికారుల, ప్రజల మన్ననలతో అంబరుపేట P.S. నుండి SI గా పదవీ విరమణ చేయుచున్న శ్రీనివాసులు గారికి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని శుభాకాంక్షలతో...

బావలు: శ్రీమతి & శ్రీ కె. కుమారి మోహన్
శ్రీమతి & శ్రీ వి. రమణి - వెంకటేశ్వరరావు
శ్రీమతి & శ్రీ లక్ష్మీ - రాజు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మూసారాంబాగ్, న్యూస్‌టుడే: 32 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న పలువురు ఒక్క చోట సమావేశమయ్యారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. మలక్‌పేట ప్రభుత్వ పాఠశాలలో 1992లో పదో తరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం స్థానిక పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ప్రస్తుత జనగామ జిల్లా విద్యాశాఖాధికారి, స్థానిక పాఠశాల పూర్వవిద్యార్థి కె.రాము ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆటపాటలు, నృత్య ప్రదర్శనలతో సందడి చేశారు.

జూనియర్ కళాశాలల నూతన కార్యవర్గం ఎన్నిక

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : రంగారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్యవర్గ ఎన్నిక నిర్వహించామని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. అధ్యక్షుడిగా సి.జగదీశ్ (మహేశ్వరం కళాశాల), ఉపాధ్యక్షుడిగా సీహెచ్.చైతన్య (మాడుగుల), ప్రధాన కార్యదర్శిగా జీ.సైదులు (కందుకూర్), సంయుక్త కార్యదర్శిగా కె.బుచ్చయ్య (చేవేళ్ల), కోశాధికారి ఎం.రవికుమార్ (ఇబ్రహీంపట్నం), మహిళా కార్యదర్శిగా ఎం.శశి (హయత్‌నగర్ కళాశాల)తో పాటు ఏడుగురు స్టేట్ కౌన్సిలర్లు ఎన్నికైనట్లు తెలిపారు.

సాహిత్యబంధంతో సమాజంలో గౌరవం

‘లోపలి వాన’ గ్రంథాన్ని ఆవిష్కరణలో ఆచార్య ఎన్ గోపి, కవులు

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ఎంత కవిత్వం రాసిన గొప్ప కవి అనిపించుకోవచ్చు గానీ, మంచి మనిషి కావడం ఎంతో కష్టం అని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎన్ గోపి అన్నారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్ర భారతి సమావేశ మందిరంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో కుడికాల వంశీధర్ రచించిన ‘లోపలి వాన’ కవితా సంపుటి గ్రంథావిష్కరణ సభ జరిగింది. ఓయూ తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రఘు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథి సహ ఆవిష్కర్త ఆచార్య ఎన్ గోపి మాట్లాడుతూ.. కవిత్వం అంటే రమణీయంగా కమనీయంగా మనసులోని భావాలను అక్షరీకరించే ప్రక్రియ అని అన్నారు. ధనవంతుడికి ధనబలం ఉండవచ్చు కానీ సాహిత్యంతో సంబంధం వల్ల సమాజంలో బోలెడంత గౌరవం లభిస్తుందన్నారు. కవి డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన, సికింద్రాబాద్ పీజీ కళాశాల ఆచార్యులు డాక్టర్ ఆదినారాయణలు రచయితను అభినందించారు.

వ్యవసాయ సహకార సంఘ సమావేశం నేడు

హయత్‌నగర్, న్యూస్‌టుడే: హయత్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ సీఈవో మల్లికార్జున్ తెలిపారు. సహకార సంఘం అధ్యక్షుడు చామ కృష్ణారెడ్డి అధ్యక్షత ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, రైతులు పాల్గొనాలని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

వసతుల కల్పనకు చర్యలు

హయత్‌నగర్, న్యూస్‌టుడే: పెద్దఅంబర్‌పేట పురపాలికలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు వైస్ ఛైర్‌పర్సన్ చామ సంపూర్ణరెడ్డి తెలిపారు. కుంట్లూర్ 21వ వార్డులో స్థానిక కౌన్సిలర్ ఓరుగంటి సుజాతతో కలిసి రూ.19 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణం, పార్కు పనులను ఆదివారం ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం కొత్తగా ఏర్పాటుచేసిన విద్యుత్తు నియంత్రికను ప్రారంభించారు. చామ విజయశేఖర్‌రెడ్డి, కేసారం బాల్‌రెడ్డి, ఓరుగంటి కొండల్ గౌడ్, జోర్క శ్రీరాములు, బద్దం శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఎన్‌ఆర్ కాలనీ సంఘం ఏకగ్రీవం

అధ్యక్షుడు మధుసూదన్‌గుప్తా

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: హస్తినాపురం డివిజన్ పరిధి పిండి నారాయణరెడ్డి ఫేజ్-1 కాలనీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా **నీల మధుసూదన్‌గుప్తా,** ప్రధాన కార్యదర్శిగా మల్గిరెడ్డి కొండల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పి.భూపతిరావు, సంయుక్త కార్యదర్శులుగా ఎం.గోవింద్‌రెడ్డి, వి.లక్ష్మారెడ్డి, కోశాధికారిగా కె.లక్ష్మీనరసింహారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఎస్.ప్రభాకర్‌రెడ్డి, డి.సురేందర్‌రెడ్డి తదితరులు ఎన్నికయ్యారు.

మంత్రివర్గంలో బంజారాలకు స్థానం కల్పించాలి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గంలో బంజారాలకు స్థానం కల్పించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ప్రభుత్వాన్ని కోరింది. తెలంగాణలో 40 లక్షలకు పైగా జనాభా ఉన్న బంజారాలకు మంత్రి వర్గంలో స్థానం లేకపోవడం బాధాకరమని అభిప్రాయపడింది. మింట్‌కాంపౌండ్‌లోని గిరిజన విద్యుత్తు భవన్‌లో ఆదివారం సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ రామచంద్ర నాయక్ ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు పూర్తిస్థాయిలో పనిచేసిన లంబాడీలను విస్మరించడం సరికాదన్నారు. వెంటనే మంత్రి పదవి కేటాయించాలని సీఎంను కోరారు. లంబాడీలు వాడే గోర్బోలి భాషకు అధికార హోదా కల్పించి.. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీలకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘం సహ అధ్యక్షుడు మోహన్‌సింగ్ నాయక్, ముఖ్య నేతలు పాండురంగ నాయక్, శ్యాంనాయక్, కిషన్ నాయక్, రాంబాబు నాయక్‌లు మాట్లాడారు. సంఘం కార్యవర్గం, వివిధ గిరిజన సంఘాల నాయకులు, జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

‘కులగణన చేపట్టకుండా వర్గీకరణ తగదు’

హిమాయత్‌నగర్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. కన్వీనర్ మన్నె శ్రీధర్ మాట్లాడుతూ.. ఎస్సీ కుల గణన చేపట్టకుండా వర్గీకరణపై తీర్పు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. మాలల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, వర్గీకరణ ఆలోచన విరమించుకోవాలన్నారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తితో జ్యుడీషియల్ కమిషన్ వేయాలన్నారు.

కొనసాగుతున్న కార్మిక వ్యతిరేక విధానాలు

ఖైరతాబాద్: కార్మికులకు కులం, మతం, దేశం లాంటివేవీ ప్రతిబంధకాలు కాదని ఎస్‌యూసీఐ రాష్ట్ర కార్యదర్శి మురహరి అన్నారు. తెలంగాణ యునైటెడ్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సభలు ఆదివారం ఖైరతాబాద్ శ్రీనివాసనగర్‌లో జరిగాయి. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పదేళ్లు పాలించిన భారాస ప్రభుత్వాన్ని ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కడితే.. వారూ కార్మిక వ్యతిరేక విధానాలు కొనసాగిస్తున్నారన్నారు. తెలంగాణ స్త్రీ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షురాలు శోభా పెరిందేవి, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు సిరాజుద్దీన్ తదితరులు మాట్లాడారు.

బాగున్న రోడ్లకే నిధులా..?

మణిపురి కాలనీలో రోడ్డును తవ్వారిలా..

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: అధికారులు అనాలోచితంగా చేపడుతున్న అభివృద్ధి పనులతో స్థానికులు అవస్థలు తప్పడం లేదు. అధ్వానంగా మారిన రహదారులను వదిలేసి, బాగున్న రోడ్లకే నిధులు కేటాయిస్తూ తవ్వకాలు చేపడుతున్నారు. ఆ పనులు సైతం పూర్తి చేయకపోవడంతో వాహనదారులు నరకం చవిచూస్తున్నారు.

వేలాది వాహనాల రాకపోకలు..

లింగోజిగూడ డివిజన్‌లో అవేర్ గ్లోబల్ ఆసుపత్రి నుంచి పోస్టాఫీస్ వరకూ ఉన్న ప్రధానమార్గం గుంతలమయంగా మారింది. ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనదారులు రాకపోకలు సాగిస్తారు. ఇంతటి ప్రాధాన్య రోడ్డుకు నిధులు కేటాయించి, మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కొన్నేళ్లుగా కోరుతున్నారు. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మణిపురి కాలనీలో బాగున్న రహదారి నిర్మాణానికే నిధులు కేటాయించి పనులు చేస్తున్నారు. సాగర్ రోడ్డు నుంచి అల్తాఫ్ నగర్, విజయ్‌పురి, అధికారి నగర్, ధర్మపురి కాలనీ, సాయిరాం నగర్, లింగోజిగూడ ఓల్డ్ విలేజ్, మణిపురి కాలనీ, మాస్ కాలనీ, పోస్టాఫీస్ చౌరస్తాతో పాటు ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయం, సరూర్‌నగర్ రెవెన్యూ కార్యాలయం, ప్రభుత్వ దవాఖానాతో పాటు తదితర కార్యాలయాలకు ఈ మార్గం మీదుగానే నిత్యం వేలాది మంది వాహనదారులు రాకపోకలు సాగిస్తారు. పలు చోట్ల గుంతలు ఏర్పడి, ఆ గుంతల్లో మురుగు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిసారి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిశీలించాలని కోరుతున్నారు.

గుంతలమయంగా లింగోజిగూడ మార్గం

ప్రతిపాదనలు పంపాం..

–విజయ్‌కుమార్, ఏఈ, జీహెచ్ఎంసీ

మణిపురి కాలనీ, లింగోజిగూడ పాత గ్రామానికి కలిపి రూ.39 లక్షలు మంజూరయ్యాయి. మణిపురి కాలనీలోని రహదారి గుంతల మరమ్మతులకు రూ.20 లక్షలు కేటాయించాం. ప్రస్తుతం అక్కడ పనులు సాగుతున్నాయి. లింగోజిగూడ ప్రధాన రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే జీహెచ్ఎంసీకి ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉంది. మంజూరు కాగానే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేస్తాం.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE, KADAPA, AP
O.S.No. 21/2024

Sane Siva Prasad, S/o Guruvaiah, aged about 44 years, Hindu, Doctor, Residing at D.No. 40/80, Mutharasupalli Veedhi, Chinnachowk Ilakha, Kadapa City, YSR Kadapa District. ... **Plaintiff**

Vs

3. Andela Ramesh Kumar, S/o Late Sreenivasulu, aged about 55 years, Hindu, Business, R/o Flat No. 81, Self - Finance Colony, Saibaba Temple Line, Vansthalipuram, K.V. Ranga Reddy District, Telangana State. **Defendant No.3**

SUMMONS TO DEFENDANT No.3

పై దావాలోని వాది మీపైన ఆయకపు బాకీ వసూలు నిమిత్తం దావా దాఖలు చేయడమైనది. అలాగే పై దావాలో అందెల రమేష్‌కుమార్ డి4 మరియు బత్తుల ప్రవీణ్ కుమార్ గారిని D3 & D4 గారిని ప్రతివాదులుగా చూపించడమైనది. పై దావా మీ హాజరు కోసం 18.10.2024న వాయిదా వేయడమైనది. కావున మీరు 18.10.2024న ఉదయం 10.30 గం॥లకు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలెను. లేనియెడల సదరు కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

// By Order of Court //
P.Rajendra Prasad
Advocate for Plaintiff

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE, KADAPA, AP
I.A.No. 657/2024/ O.S.No. 21/2024

Sane Siva Prasad, S/o Guruvaiah, aged about 45 years, Hindu, Doctor, Residing at D.No. 40/80, Mutharasupalli, Chinnachowk Ilakha, Kadapa City, YSR Kadapa District. **...Petitioner Plaintiff**

Vs

3. Andela Ramesh Kumar, S/o Late Sreenivasulu, aged about 55 years, Hindu, Business, R/o Flat No. 81, Self - Finance Colony, Saibaba Temple Line, Vansthalipuram, K.V. Ranga Reddy District, Telangana State. **...Respondents No.3/ Defendants No.3**

NOTICE TO RESPONDENTS No.3

పై దావాలోని వాది పిటీషన్ షెడ్యూల్ దాఖలా ఆస్తిని మీరు ఇతరులకు అమ్మకుండా పై దావాలో పై పిటీషన్ దాఖలు చేసి ఉన్నారు. సదరు పిటీషన్‌లో మీ హాజరు నిమిత్తమై వాయిదా 18.10.2024న ఉన్నది. కావున మీరు 18.10.2024న ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

// By Order of Court //
P.Rajendra Prasad
Advocate for Petitioner

(c) eenadu

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్
• చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

ఉత్సాహంగా 3కే రన్

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా లంగర్‌హౌస్‌లోని రెనోవా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 3కే వాకథాన్ జరిగింది. ఆసుపత్రి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా.శ్రీధర్ పెద్దిరెడ్డి, డా.షోయబ్, డా.శివకుమార్, డా.తిప్పరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం 45 నిమిషాల నడక అలవాటు చేసుకోవాలని వైద్యులు సూచించారు.

3K WALKATHON
RENOVA
24x7

వాకథాన్‌లో గాలిబుడగలను వదులుతున్న వాకర్లు

తిరుపతి లడ్డూ వివాదంపై సీబీఐ విచారణకు డిమాండ్

బషీర్‌బాగ్: తిరుపతి లడ్డూపై జరుగుతున్న వివాదంపై సీబీఐ విచారణ చేపట్టి వాస్తవాలను వెలికి తీయాలని మాదిగ హిందూ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు డాక్టర్ టీఎన్ వంశతిలక్ డిమాండ్ చేశారు. దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం బషీర్‌బాగ్‌లో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా డప్పుల దండోరా వేస్తూ... పెద్ద పెట్టున నినదించారు. డాక్టర్ టీఎన్ వంశతిలక్ మాట్లాడుతూ.. దళితులను హైందవ మతం నుంచి దూరం చేసే కుట్ర జరుగుతుందన్నారు.

తిరుపతి లడ్డును అపవిత్రం చేసిన దోషులను తీవ్రంగా శిక్షించాలి

బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న వంశతిలక్ తదితరులు

పచ్చిమిర్చి కిలో రూ.28

మెహిదీపట్నం: రైతుబజార్‌లో (ఆదివారం నాటి ధరలు, కిలో రూ.లో) టమాటా 49, వంకాయ 35, బెండకాయ 40, పచ్చిమిర్చి 28, కాకరకాయ 35, బీరకాయ 28, క్యాబేజీ 19, బీన్స్ 55, క్యారెట్ 35, దొండ 28, చిక్కుడుకాయ 50, గోకరకాయ 40, బీట్‌రూట్ 28, క్యాప్సికం 55, ఆలుగడ్డ 36, కీర 18, దోసకాయ 28, సొరకాయ 13, పొట్లకాయ 18, ఉల్లిగడ్డ 50, చామగడ్డ 40.

ఉచిత వైద్య శిబిరం

సుల్తాన్‌బజార్: పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని బద్రీవిశాల్ పన్నాలాల్ పిత్తీ ట్రస్టు ఛైర్మన్ శరత్ బి.పత్తీ పేర్కొన్నారు. బద్రీవిశాల్ పన్నాలాల్ పిత్తీ ట్రస్టు, అగర్వాల్ సేవాదళ్, సర్వోదయ విచార్ ప్రచార్ ట్రస్టు సంయుక్తాధ్వర్యంలో ఆదివారం కోఠిలోని గాంధీ జ్ఞాన్‌మందిర్ యోగా కేంద్రంలో నిర్వహించిన ఉచిత 'మెగా వైద్య శిబిరానికి' విశేష స్పందన లభించింది.

మూసీ నిర్వాసితులను ఆదుకోవాలి

బేగంబజార్: మూసీ నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజా ఏక్తాపార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. నది సుందరీకరణ పేరుతో అధికారులు పేదల ఇళ్లను ఖాళీ చేయిస్తున్నారన్నారు.

'రామాయణ్ మేళా' విజయవంతానికి కృషి

సుల్తాన్‌బజార్: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాజస్థానీ ప్రగతి సమాజ్, ఎగ్జిబిషన్ సొసైటీల సంయుక్తాధ్వర్యంలో ఎగ్జిబిషన్ మైదానంలో అక్టోబరు 3 నుంచి ప్రారంభం కానున్న రామాయణ్ మేళా విజయవంతం చేసేందుకు కృషి చేయాలని మేళా చీఫ్ కన్వీనర్ గోవింద్‌రాఠీ పేర్కొన్నారు. ఆయన అధ్యక్షతన ఆదివారం హస్మత్‌గంజ్‌లో సమావేశమయ్యారు.

కూరగాయల విక్రేతలకు గుర్తింపు

• మెహిదీపట్నం రైతుబజార్‌లో ధ్రువీకరణపత్రాలు జారీ

మెహిదీపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర సర్కారు రైతుబజార్లలో కూరగాయలు, ఇతర నిత్యావసరాలు, వస్తువుల విక్రేతలకు 'ఫుడ్ సేఫ్టీ లైసెన్సులు' జారీ చేయాలని నిర్ణయించింది. ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాలతో సంబంధిత అధికారులు, జీహెచ్ఎంసీ సహకారంతో లైసెన్సులు జారీ చేస్తున్నారు. మొదటగా మెహిదీపట్నం, ఎర్రగడ్డ రైతుబజార్‌లలో జారీ ప్రక్రియ ప్రారంభించి, నగరంలోని అన్నీ రైతుబజార్‌కు విస్తరించాలని నిర్ణయించింది. లైసెన్సుల జారీతో విక్రేతల్లో జవాబుదారీతనం వస్తుందని అధికారులు భావిస్తున్నారు. అందుకు రైతుబజార్‌లలో కూరగాయలు అమ్మే అన్నదాతల జాబితా సేకరించిన అధికారులు వాటిని జారీ చేయడం ప్రారంభించారు. లైసెన్సులు కలిగి ఉన్న కర్షకులు, స్వయం సహాయక బృందాలకు సాయం అందించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అందుకు సోమవారం రైతుబజార్‌లో వారితో సమావేశం ఏర్పాటు చేశారు. ఫుడ్ సేఫ్టీ లైసెన్సులతో ప్రయోజనాలను చర్చించనున్నట్లు సమాచారం.

1250 మంది రైతులు

నగర శివారు, రంగారెడ్డి జిల్లాలోని 65 గ్రామల నుంచి రైతులు తాము పండించిన కూరగాయలను మెహిదీపట్నం రైతుబజార్‌కు తీసుకొస్తారు. క్షేత్ర స్థాయిలో సంబంధిత తహసీల్దార్ పరిశీలన చేసి రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తారు. ఈ కార్డుతో అన్నదాతలు తాము పండించిన కూరగాయలు అమ్ముకోవచ్చు. అదేవిధంగా మార్కెటింగ్ శాఖ జారీ చేసిన లైసెన్సుతో రైతులకు అందుబాటులో లేని కూరగాయలు, ఇతర సరకులను స్వయం సహాయక బృందాల సభ్యులు బజార్లలో విక్రయిస్తారు. మెహిదీపట్నం రైతుబజార్‌లో 1250 రైతులు కార్డులు కలిగి ఉండగా, రోజూ దాదాపు 180 మంది, సీజన్‌లో 250 మంది బజార్‌కు కూరగాయలు తీసుకొస్తారు. రోజూ దాదాపు 12 టన్నులు, సీజన్‌లో 18 టన్నుల కూరగాయలు రైతుబజార్‌కు వస్తాయి.

fssai
Registration Certificate

రైతుకు అందజేసిన ధ్రువీకరణ పత్రం

అన్నదాతలకు ఉచితం

మెహిదీపట్నం రైతుబజార్‌లో 1250 మంది రైతులు, 77 మంది స్వయం సహాయక బృందాల సభ్యులు గుర్తింపు కార్డులు కలిగి ఉన్నారు. ఫుడ్ సేఫ్టీ లైసెన్సు కోసం రైతుల నుంచి ఫీజు వసూలు చేయొద్దని అధికారులు నిర్ణయించారు. స్వయం సహాయక బృందాల నుంచి నామమాత్రంగా రూ.100 వసూలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 50 మంది రైతులు, 140 మంది స్వయం సహాయ బృందాలకు ఫుడ్ సేఫ్టీ లైసెన్సులు జారీ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

చాంద్రాయణగుట్ట-8008573324, కార్వాన్-8008573341, నాంపల్లి-8008573338, గోషామహల్-8008573334, యాకుత్‌పుర-8008573307, చార్మినార్-9100581018

న్యూస్‌టుడే, చార్మినార్, బేగంబజార్

? గుల్జార్‌హౌస్‌లోని మిట్టీకాషేర్ మార్గంలో నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురవుతున్నాయి. – ఆనంద్, రషీద్, వ్యాపారులు

✓ మదీనా నుంచి చార్మినార్ మీదుగా వాహనాల రాకపోకలు పెరిగాయి. వాహనాల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్‌ను నియంత్రిస్తాం. – సురేందర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

? ఎంజీబీఎస్‌లోని వివిధ స్టాళ్లలో నిర్ణీత ధర కంటే అధిక ధరలకు తినుబండారాలు విక్రయిస్తున్నారు. – సునీత ప్రయాణికురాలు

✓ నిర్ణీత ధరల కంటే అధికంగా తినుబండారాలు విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, సీఆర్ఎం, ఎంజీబీఎస్

భగత్‌సింగ్ జయంతి

భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కృష్ణానాయక్ తదితరులు

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: జంగమ్మెట్ ఫలక్‌నుమా స్టేషన్ రోడ్డులోని సీఐటీయూ కార్యాలయం ఆవరణలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతిని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమలో డీవైఎఫ్ఐ సౌత్ జిల్లా కార్యదర్శి ఎ.కృష్ణానాయక్ పాల్గొని భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా నాయకులు మహేశ్, శ్రీను, నవీన్, నగేష్ రాజేష్, చిన్నా, నరేంద్ర, మల్లేశ్ పాల్గొన్నారు.

ఆలయం ఆవరణలో స్వచ్ఛ భారత్

కేశవగిరి, న్యూస్‌టుడే: చాంద్రాయణగుట్టపైని చారిత్రక దేవాలయాల ప్రాంగణాల్లో కుమ్మరివాడీలోని కారుణ్య భారతి ఆశ్రమం, సైదాబాద్‌లోని కారుణ్య సింధు ఆశ్రమాలకు చెందిన విద్యార్థులు, బస్తీవాసులతో కలిసి మెట్ల మార్గంలో పిచ్చిమొక్కలు తొలగించారు. చెత్తాచెదారం ఊడ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

బండి సంజయ్‌కి సత్కారం

గన్‌ఫౌండ్రి: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను భాజపా ఓబీసీ సెల్ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ ఆదివారం సత్కరించారు.

వాహనం ఢీకొని ఒకరి దుర్మరణం

ముస్తఫా

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే: వంట పని ఆధారంగా కుటుంబాన్ని పోషించుకునే ఓ యువకుడిని రహదారి ప్రమాదంలో మృత్యువు కబలించింది. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. కొత్తకోట ఎస్సై మంజునాథరెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన హసన్ వంట మాస్టార్‌గా పని చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో ఓ శుభకార్యంలో వంట చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన 12 మందితో కలిసి మినీ బస్సులో శనివారం రాత్రి 10 గంటల తరువాత కర్నూలుకు బయల్దేరారు. కొత్తకోట వద్దకు రాగానే 44వ నంబరు జాతీయ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న బస్సు టైర్ పగిలిపోయింది. బస్సు నుంచి కొందరు దిగి టైరు మార్చేందుకు ప్రయత్నిస్తుండగా హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న డీసీఎం వేగంగా వచ్చి టైరు మారుస్తున్న వారితో పాటు మినీ బస్సును బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో హైదరాబాద్ చాంద్రయాణగుట్ట హఫీజ్‌బాబానగర్ కాలనీకి చెందిన ముస్తఫా (33) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. శరీరం రెండు భాగాలుగా విడిపోయింది. పక్కనే ఉన్న మహ్మద్ అజీమ్, రవినాయక్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. హసన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ముస్తఫాకు భార్య తస్లీమాబేగం, ముగ్గురు కుమారులున్నట్లు బాధిత బంధువులు తెలిపారు.

ప్చ్.. మారట్లే!

వివాదాస్పదంగా పోలీసుల తీరు

వారికి వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

న్యూస్‌టుడే, గోషామహల్: నగరంలోని సౌత్/వెస్ట్ జోన్ పరిధిలో శాంతిభద్రతల పరంగా అత్యంత సున్నితమైన ఓ సబ్ డివిజన్‌లో కొందరు పోలీసు అధికారులు, సిబ్బంది తీరు వివాదాస్పదంగా మారుతోంది. గతంలోనూ వివాదాస్పద అంశాల్లో జోక్యం చేసుకొని కొందరు అధికారులు, సిబ్బంది సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. అయినా.. ఇక్కడి కొందరు అధికారులు, సిబ్బంది చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న

అక్రమాలకు వత్తాసు

◆ గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం తరపున విడుదల చేసిన నగదులో ఓ అధికారి నయా పైసా ఖర్చు పెట్టలేదనే ఆరోపణలు ఉన్నాయి. వేడుకల ఖర్చు పేరుతో ఆ ప్రాంతంలో అక్రమార్కుల నుంచి వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి.

◆ ఓ అధికారి తరచూ సెలవుల్లో నిబంధనలకు విరుద్ధంగా అధికారిక వాహనం, డ్రైవరు, హోంగార్డును ఇంటి వద్దకు రప్పించుకొని ప్రైవేటు పనులు చక్కబెట్టుకుంటున్నారు.

◆ మరో ఠాణాలో ఓ అధికారి అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ దందాకు వత్తాసు పలుకుతుండడం వివాదాస్పదంగా మారుతోంది. అంతేకాదు జూదం, సట్టాలకు అనధికారికంగా అనుమతులు ఇస్తూ అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ స్టేషన్‌లో ఓ ఎస్సై అన్నీ తానై అక్రమార్కులకు మద్దతుగా నిలుస్తూ ఉన్నతాధికారులు లేని సమయంలో ఈ వ్యవహారాలన్నీ చక్కబెడుతున్నట్లు తెలుస్తోంది. గతంలోనూ అతనిపై పలు ఆరోపణలు రాగా స్టేషన్‌లో సీనియర్ కావడంతో.. ఉన్నతాధికారులు కాస్త మెతకవైఖరి చూపిస్తున్నారు.

◆ కొందరు సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి కేసులోనూ చేతి తడపనిదే వదిలిపెట్టడం లేదని బాధితులు వాపోతున్నారు.

◆ మద్యం గొలుసు దుకాణాలకు సంబంధించి గత నెలలో అప్పటి సీపీ ఆ సబ్ డివిజన్‌లోని ఓ అధికారికి మెమో కూడా ఇచ్చినట్లు సమాచారం. ఈ విషయాలు బయటకు పొక్కకుండా సబ్ డివిజన్‌లోని కొందరు అధికారులు జాగ్రత్త పడుతూ.. ఉన్నతాధికారులను మచ్చిక చేసుకుంటున్నట్లు తెలిసింది.



కరెంట్ షాక్ కొట్టకుండా..

వర్షాకాలం కావడంతో ఇనుప విద్యుత్తు స్తంభాల నుంచి విద్యుదాఘాతం సంభవించే అవకాశం ఉంది. అధికారులు రక్షణగా వాటి చుట్టూ పాలిథిన్ షీట్లు చుట్టారు.



ప్రచార బస్సు.. తుస్సు

సాలార్‌జంగ్ మ్యూజియం విశేషాలు, విశిష్టతలు విద్యార్థులకు తెలియజేయడానికి ఈ బస్సును ఉపయోగించేవారు. ప్రస్తుతం మూలకుపడింది. వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

'పేదల ఇళ్లు కాదు.. ఒవైసీ ఫాతిమా కళాశాలను కూల్చండి'

ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్ లోథ్

ధూల్‌పేట, న్యూస్‌టుడే: పేదల ఇళ్లు కూల్చి ఇబ్బందులు పెట్టడం కాదు.. హైడ్రా పేరుతో డ్రామాలు ఆపి ఒవైసీ ఫాతిమా కళాశాలతో పాటు మీ సోదరుడి కళాశాలను కూల్చి నిజాయతీ చాటుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే రాజాసింగ్‌లోథ్ సూచించారు. గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని మూసీ పరివాహక ప్రాంతం జుమ్మేరాత్‌బజార్ అరుంధతీ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన సమావేశంలో స్థానికులతో మాట్లాడారు. పేదల ఇళ్లనే కూల్చివేసి నిరాశ్రయుల్ని చేసే కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టడం దురదృష్టకరమన్నారు. మూసీ నుంచి పేదల్ని తరిమి కొట్టేందుకు గత భారాస ప్రభుత్వం బీజం వేసిందన్నారు. నార్సింగి నుంచి నాగోలు వరకు 26 వేల ఇళ్లను కూల్చివేసే పని పెట్టుకున్నారన్నారు.

ధూల్‌పేటలో గంజాయి విక్రయం

పట్టుబడిన వారితో ఆబ్కారీ శాఖ అధికారులు, సిబ్బంది

ధూల్‌పేట: ధూల్‌పేటలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని ఆబ్కారీ స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్టీఎఫ్ ఈఎస్ నంద్యాల అంజిరెడ్డి ఆధ్వర్యంలోని బృందం ఆదివారం ధూల్‌పేటలోని జుమ్మేరాత్‌బజార్‌లో దాడులు నిర్వహించింది. గంజాయి అమ్ముతున్న ముఖేశ్‌సింగ్, లడ్డూసింగ్, సాగర్‌సింగ్, వైష్ణవిసింగ్‌లను అరెస్టు చేశారు. నిందితుల నుంచి 1.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో సీఐ మధుబాబు, జీడీ గోపాల్ పాల్గొన్నారు.

ట్రేడింగ్‌లో శిక్షణ.. రూ. 21.68 లక్షల మోసం

నారాయణగూడ, న్యూస్‌టుడే: స్టాక్ ట్రేడింగ్‌లో శిక్షణ ఇచ్చి.. పెట్టుబడులు పెట్టించి నగదు దోచేశారంటూ ప్రభుత్వ ఉద్యోగి హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగికి స్టాక్ ట్రేడింగ్ పేరుతో లింక్‌తో కూడిన సందేశం వచ్చింది. బాధితుడు దానిపై క్లిక్ చేయడంతో ఫోన్ నంబరు వాట్సాప్ గ్రూప్‌తో అనుసంధానమైంది. ముందుగా స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై శిక్షణ ఇవ్వడంతో పాటు వృత్తిపరమైన మార్గదర్శనం కూడా చేశారు. ఆ తర్వాత యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి పెట్టుబడులు పెట్టించాడు. రూ.10 వేల పెట్టుబడి పెట్టారు. దానికి లాభాలొచ్చాయి. దాంతో ఉద్యోగి క్రమంగా రూ.21.68 లక్షలు పెట్టేశారు. ఆ తర్వాత యాప్ మాయమైంది.

'బాపుబాటలో.. సత్యశోధన' పాదయాత్ర 2 నుంచి

గోడపత్రిక ఆవిష్కరించిన రమణాచారి, బడేసాబ్, విజయకుమార్, మనోహర్‌రెడ్డి, అబ్దుల్ రజాక్

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో పిల్లల భవిత కోసం విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి డా.శివార్చక విజయకుమార్ సారథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వంద రోజులు, వెయ్యి కిలోమీటర్లు 'బాపుబాటలో.. సత్యశోధన పాదయాత్ర' కొనసాగనుంది. అక్టోబరు 2న జోగులాంబ జిల్లా, ఆలంపూర్ జోగులాంబ దేవాలయం నుంచి మొదలయ్యే ఈ పాదయాత్ర 2025 జనవరి 12 నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని ఉమామహేశ్వర దేవాలయంలో ముగియనుంది. ఆదివారం నగరంలోని రెడ్‌హిల్స్‌లోని డా.కె.వి.రమణాచారి క్యాంపు కార్యాలయంలో పాదయాత్ర గోడపత్రికను ప్రభుత్వ మాజీ సలహాదారు డా.కె.వి.రమణాచారి ఆవిష్కరించి మాట్లాడుతూ.. గాంధీజీ మార్గంలో నడవటమే కాదు.. పది మందికి మార్గదర్శకంగా ఉండాలని విజయకుమార్ 67వ ఏటా పాదయాత్రకు సంకల్పించడం గొప్ప విషయమన్నారు. ఆయనతో కలిసి రోజుకు కనీసం ఒకటి, రెండు కిలోమీటర్లు పిల్లలు నడవాలని సూచించారు. విజయకుమార్ మాట్లాడుతూ.. గాంధీజీ ఆలోచనలు, ఆశయాలు, జీవన విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో పాదయాత్ర చేపడుతున్నట్లు వివరించారు. సాహితీవేత్తలు గంటా మనోహర్‌రెడ్డి, పి.బడేసాబ్, ప్రభాకర్‌రెడ్డి, అబ్దుల్ రజాక్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

ఎస్సై ఆత్మహత్యకు కారణమైన పోలీసులను అరెస్టు చేయాలి

బషీర్‌బాగ్‌లో మాట్లాడుతున్న లక్ష్మయ్య

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పోలీసుస్టేషన్ ఎస్సై శ్రీరాముల శ్రీను ఆత్మహత్యకు కారణమైన ఇన్‌స్పెక్టర్ జితేందర్‌రెడ్డి, ఇతర కానిస్టేబుళ్లను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్ట ప్రకారం తక్షణమే అరెస్టు చేయాలని పలు సంఘాలు డిమాండ్ చేశాయి. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 'కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి' జాతీయ కన్వీనర్ బండారి లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షుడు గురిమిళ్ల రాజు, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర నేత గడ్డం సదానందం, గాయకుడు మచ్చ దేవేందర్, సావిత్రీబాయి పులే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.సరోజన, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పిల్లి సుధాకర్, పాత్రికేయుడు ఇంద్రవెల్లి రమేశ్ మాట్లాడారు. ఎస్సై మరణ వాంగ్మూలాన్ని కూడా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఎస్సై దళితుడు కావడం వల్లనే సమస్యను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎస్సై భార్యకు గ్రూప్-1 ఉద్యోగంతో పాటు ఆయన కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్సై సతీమణి కృష్ణవేణి, సోదరి శంకరమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

పెళ్లి విందులో నగల సూట్‌కేసు మాయం

కేశవగిరి, న్యూస్‌టుడే: సోదరుడి పెళ్లి విందుకు హాజరైన ఓ మహిళ నగల సూట్‌కేసును దుండగులు చాకచక్యంగా అపహరించారు. ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. సూట్‌కేసులో రూ.2.06 లక్షల విలువైన నగలు, నగదు ఉన్నాయి. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన బండ్లగూడ ఠాణా పరిధిలో జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బార్కస్ సలాలా ప్రాంతానికి చెందిన సబియా షిరీన్(28) ఈ నెల 20న కాటేదాన్ క్వీన్స్ ప్యాలెస్‌లో జరిగిన తన సోదరుడి నిఖాకు హాజరైంది. 22న బండ్లగూడలోని మేరాజ్‌గార్డెన్ ఫంక్షన్ హాలులో జరిగిన పెళ్లి విందుకు తన సోదరి సోఫియా షిరీన్‌తో కలిసి వెళ్లింది. 23 తెల్లవారుజాము 4 గంటల వరకు వారు ఫంక్షన్ హాలులోనే ఉన్నారు. అతిథులుగా నటిస్తూ దుండగులు సబియా షిరీన్‌కు చెందిన ట్రాలీ సూట్‌కేసును ఎత్తుకెళ్లారు. అందులో 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.6 వేల నగదు, చరవాణి ఉన్నాయి. సూట్‌కేసు కనిపించక పోవడంతో ఆందోళనకు గురైన సబియా హాలు నిర్వాహకుల సాయంతో సీసీ కెమెరా దృశ్యాలు పరిశీలించింది. తన సూట్‌కేసుతో ఇద్దరు వెళుతున్నట్లు గుర్తించింది. 24వ తేదీన బండ్లగూడ ఠాణాలో సబియా ఫిర్యాదు చేయగా పోలీసులు కేసునమోదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించేందుకు దర్యాప్తు జరుగుతోంది.

అతివలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి: ఎంపీ

PUBLIC MEETING
MORALITY IS FREEDOM

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు ఖురాన్ బహూకరిస్తున్న జమాతే ఇస్లామీ హింద్ మహిళా ప్రతినిధులు

జియాగూడ, న్యూస్‌టుడే: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. చెడుకు దూరంగా ఉంటూ నైతిక విలువలతో జీవితం గడిపితే మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. ఆదివారం నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో 'నైతికతే నిజమైన స్వేచ్ఛ' అంశంపై నిర్వహించిన బహిరంగసభకు ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముస్లిం మహిళలు పెద్దఎత్తున నైతిక విలువల ప్రచారం కోసం ఉద్యమించడం అభినందనీయమన్నారు. మహిళా సాధికారత అంటే ఆర్థిక సాధికారత మాత్రమే కాదని, ఆరోగ్య సాధికారత కూడా సాధించాల్సిన అవసరం ఉందన్నారు. అతివలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, 40 ఏళ్లు దాటిన వారు క్రమంగా ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలన్నారు. జమాతే ఇస్లామీ హింద్ జాతీయ కార్యదర్శి షహిస్తా రఫత్ మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యసనాలకు బానిసై అనారోగ్యం పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు నాయకురాలు జలీసాసుల్తానా, ప్రొఫెసర్ షాహగుఫ్తాషహీన్, నసీరాఖానమ్ తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

బేగంబజాం, న్యూస్‌టుడే: దసరా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బేగంబజార్ పరిసర ప్రాంతాల్లోని ఆలయాలను అలంకరిస్తున్నారు. భూలక్ష్మీ దేవాలయం, బేగంబజార్ ఫీల్‌ఖానాలోని సంతోషిమాత మందిరం, గౌలిగూడ మహంకాళి గుడిని శోభాయమానంగా అలంకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్ తెలిపారు. మాత విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పేదలకు అండగా భారాస

దరియాబాగ్‌లో స్థానికులతో మాట్లాడుతున్న మధుసూదనాచారి

కార్వాన్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల్ని వంచిస్తోందని మాజీ శాసనసభాపతి మధుసూదనాచారి విమర్శించారు. కార్వాన్ మూసీ తీరంలోని దరియాబాగ్‌లో సర్వే జరిగిన ప్రాంతంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఇళ్లు కోల్పోతున్న వారితో పాటు పేద ప్రజలకు భారాస అండగా ఉంటుందన్నారు. పేదలకు న్యాయం చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిన కాంగ్రెస్ పేదల ఇళ్లు కూలగొట్టేందుకు దూకుడు ప్రదర్శిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో భారాస నేత మంతటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు రక్షణ కరవు: భాజపా

నిరసన తెలుపుతున్న కృష్ణ, కార్పొరేటర్ శశికళ, భాజపా శ్రేణులు

గోషామహల్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ హయాంలో ప్రజాప్రతినిధులకు రక్షణ కరవైందని నియోజకవర్గం భాజపా కన్వీనరు కృష్ణ విమర్శించారు. ఎమ్మెల్యే రాజాసింగ్ ఇంటి వద్ద అనుమానాస్పద పరిస్థితుల్లో కొందరు వ్యక్తులు అర్ధరాత్రి పూట రెక్కీ నిర్వహించడాన్ని నిరసిస్తూ మంగళ్‌హాట్ కార్పొరేటర్ శశికళ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పురానాపూల్ గాంధీవిగ్రహం చౌరస్తాలో నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. ఇది ముమ్మాటికీ పోలీసుల వైఫల్యమేనని ధ్వజమెత్తారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓంప్రకాశ్ భీష్వ, నేతలు రాకేశ్, బబ్లూగౌడ్, బసంత్, రమేశ్ యాదవ్, జేడీ నితిన్, చీలంపల్లి సురేశ్, నరహరి, నటరాజ్ నాందారి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE
I ADDL. JUNIOR CIVIL JUDGE
MEDCHAL-MALKAJGIRI DISTRICT
AT: KUSHAIGUDA
O.S No. 927 OF 2022
BETWEEN:
Kandi Nikhil Reddy ...Plaintiff
AND
K.S.N Murthy and Another
...Defendant No.1
To
K.S.N Murthy S/o. Late A.S.Krishnan
Aged about 76 years, Occ: Retired
Defence Service, R/o. Maharaj Bhavan,
Esamai Bazar, Koti, Hyderabad - 500027

Please take notice that the above named Plaintiff filed the above suit for Declaration and Perpetual Injunction. The above suit is posted on **17.10.2024** for your appearance, either in person or through your Advocate at 10:30 A.M. Before the above said court. Failing which the matter will be heard and decided Exparte.

(By order of the court)

Sd/- **S. VIJAY KUMAR,** Advocate
Flat No. 10, Shanti Commercial Complex
4th Floor, H.No. 19-65/3/4/10,
Brundawan Colony, Dr.A.S.Rao Nagar,
Hyderabad-500062

(c) eenadu

రాజేంద్రనగర్

•రాజేంద్రనగర్ • షాద్‌నగర్ • చేవెళ్ల

ఎమ్మెల్యే శంకర్‌ను కలిసిన మాజీ ఎంపీ బీబీ పాటిల్

షాద్‌నగర్, న్యూస్‌టుడే: సేవా పథంలో ముందుండే షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అసెంబ్లీకి ప్రగతి వెలుగులు పంచుతాడని జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు పరస్పరం శాలువాలతో సత్కరించుకున్నారు. వీరశైవ సమాజం గౌరవ అధ్యక్షుడు అగ్గనూరు విశ్వం, నేతలు తిరుపతిరెడ్డి, కౌన్సిలర్ ఈశ్వరరాజు, ఇబ్రాహీం, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో రోడ్డు పనులు

పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, న్యూస్‌టుడే: ఊరెళ్ల గ్రామానికి వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. శనివారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బైక్ పై భార్య, పిల్లలతో వస్తుండగా పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గ్రామస్థులంతా చందాలు పోగు చేసి రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయించాలని నిర్ణయించారు. ఆదివారం పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న బీటీ రోడ్డుకు ఇరువైపులా మట్టి వేసి రోడ్డు వెడల్పు చేస్తున్నారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే యాదయ్య పనులు పరిశీలించారు.

ఆరాంఘర్‌లో ట్రాఫికర్

కాటేదాన్, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి ఆరాంఘర్ నుంచి ఫ్లైఓవర్, మైలార్‌దేవుపల్లి రైల్వే ట్రాక్‌పై బ్రిడ్జి నత్తనడక నిర్మాణాలతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిత్యం 12 గంటల పాటు ట్రాఫిక్ జామ్‌తో కిలోమీటరు దాటాలంటే అరగంటైనా ముందుకు సాగకపోవడంతో వాహనాదారులు కొట్టుమిట్టాడుతున్నారు.

విద్యార్థుల అవస్థలు..

జల్‌పల్లి, లక్ష్మీగూడ, మైలార్‌దేవుపల్లి, కాటేదాన్ పరిసరాల ప్రాంతాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను నగరంలోని ప్రైవేటు పాఠశాలలు ఆపై పక్కనే ఉన్న శివరాంపల్లి కేంద్రీయ విద్యాలయాలకు తమ వాహనాలపై ప్రతీ రోజు తీసుకెళ్తారు. ఉదయం 8గంటల నుంచి పాతబస్తీ వైపు వెళ్లాలంటే దుర్గానగర్‌లో రెండు నిమిషాలు ఆపై ఆరాంఘర్ చౌరాస్తా దాటాలంటే మూడు లేదా నాలుగు నిమిషాలు వేచి ఉండాలి. అంతసేపు నిలిచి ఇక వెళదామనుకున్నా... 25 సెకన్లను మాత్రమే సమయం కేటాయిస్తారు. తొందరపడ్డారంటే ఆరాంఘర్‌లో నిత్యం రోడ్డు ప్రమాదాలతో ప్రాణాలు గాలిలో కలుస్తున్న విషాధ సంఘటనలు ఎన్నో చోటుచేసుకుంటూనే ఉన్నాయి.

సమస్యలపై ప్రత్యేక దృష్టి

–ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్

ట్రాఫిక్ సంఖ్య రోజు రోజుకు పేరుగుతోంది. సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. వాహనదారులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటాం.

అధ్వానంగా బతుకమ్మ నిమజ్జన కుంటలు

కాటేదాన్, న్యూస్‌టుడే: మూడు రోజుల్లో బతుకమ్మ వేడుకలు ప్రారంభం కానున్నాయి. నిమజ్జనానికి మైలార్‌దేవుపల్లి పల్లెచెరువు, రాజేంద్రనగర్ పత్తికుంట తదితర జలాశయాల్లో పారిశుద్ధ్య చర్యలు ప్రారంభం కాలేదు. ఇటీవల వినాయక నిమజ్జనాల వ్యర్థాలతో పాటు పేరుకుపోయిన గుర్రపుడెక్కతో అపరిశుభ్రతంగా తలపిస్తున్నాయి. జలశయాలు, కుంటల్లో నీళ్లే కనిపించుకుండా పోయాయని మహిళలు, యువతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మైలార్‌దేవుపల్లి, శాస్త్రిపురం, డివిజన్‌లతో పాటు పాత బస్తీ చాంద్రాయణగుట్ట, బండ్లగూడ పరిసరాల వేలాది మంది మహిళలు పల్లెచెరువులో బొడ్డెమ్మలు నిమజ్జనం చేస్తుంటారు. ప్రతి సంవత్సరం బతుకమ్మ ప్రారంభానికి పదిరోజుల ముందే ఈ చెరువు వద్ద ఏర్పాట్లు, అభివృద్ధి పనులు చేసేవారు. ప్రస్తుతం అది కనిపించడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుర్రపు డెక్కను తొలగించాలని, మరోవైపు విద్యుత్ దీపాలు, భద్రతా సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

పేరుకుపోయిన గుర్రపుడెక్క, వ్యర్థాలు

గుర్రపుడెక్కతో మైలార్‌దేవుపల్లి పల్లెచెరువు

చర్యలు తీసుకుంటాం: ఎమ్మెల్యే

ఈ విషయంపై సర్కిల్ అధికారులకు సూచించి బతుకమ్మ కుంటలు, చెరువుల వద్ద అవసరమైన సదుపాయాలు కల్పించేలా చేస్తామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పేర్కొన్నారు. నేటినుంచి ప్రణాళికబద్దంగా అన్ని సౌకర్యాలు అందించేలా చూస్తాం.

నేడు అత్తాపూర్‌కు కేటీఆర్

అత్తాపూర్: మూసీ నిర్వాసితులను పరామర్శించడానికి భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సోమవారం అత్తాపూర్‌లోని లక్ష్మీనగర్‌కాలనీ, నందవనం అపార్ట్‌మెంట్స్‌కు రానున్నారని ఆ పార్టీ నాయకులు కొలను సుభాష్‌రెడ్డి తెలిపారు. మూసీలో ఇళ్లు కోల్పోతున్న బాధితులను పరామార్శించి వారితో మాట్లాడతారని పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు కేటీఆర్ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.

VIVEKANANDA COLLEGE
B.Ed.,/ MBA
Management Seats
Available SHADNAGAR
✆ 9866958815

NOOR COLLEGE OF EDUCATION.(B.Ed)
Recognized by NCTE, AFFILIATED TO PALAMURU UNIVERSITY
Noor Gate: Kammadanam, Amangal road, Shadnagar, RR Dist, TG – 509216.

ADMISSION NOTIFICATION
FOR B.Ed. COURSE 2024-2026 BATCH
CATEGORY 'B' SEATS (MANAGEMENT QUOTA)

Applications are invited from qualified and eligible candidates who have qualified in TG Ed CET – 2024 and Secured 50 % Marks in B.A., B.Com, B.Sc., BCA/BBM,BBA/B.Tech and 40 % for Reserved Categories are Eligible for Admissions in to the two year B.Ed, Course for 2024-2026 batch under category "B" Seats (Management Quota) The seat matrix is indicated below.

Sl.No.	Methodology Wise seats	Seats available
1	Mathematics	12
2	Sciences (Bio –Science & Phy – Science)	15
3	Social Studies (Social Studies, Spl English & Oriental Languages)	23
Total		50

Intrested Candidates may contact the Principal's Office on all working days between 11.00 AM to 04.00 PM and register their names for consideration. **Ph: 7702001681, 9000142933, 9966182234.**
Email: noorcoe@gmail.com

Correspondent
MIRZA MOHEMMED HUSSAIN BAIG

పదవీ విరమణ శుభాకాంక్షలు

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, అందరి మన్ననలు పొంది, తన వృత్తి ధర్మాన్ని నీతి, నిజాయితీలతో నిర్వర్తించి, మా అందరి ఉన్నతికై అహర్నిశలు శ్రమించి, మాకు బంగారు భవిష్యత్తు అందించిన మా నాన్న వి.శ్రీనివాసులు గారు నేడు పదవీ విరమణ చేయుచున్న సందర్భంగా వారికివే మా హార్ధిక శుభాకాంక్షలు

కుమారుడు-కోడలు

శ్రీ వి.శ్రీనివాసులు-శ్రీమతి వి.రాణి
Dy. Executive Engineer, (SWM)
GHMC, Hyderabad

కూతుళ్లు-అల్లుళ్లు

వి.తేజ-కె.అపూర్వ
సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, USA

టి.శ్వేత-సాయికుమార్
సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, USA

జి.దీప్తి-విజయకృష్ణ
సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, హైదరాబాద్

ఎమ్మెల్యేపై గంగుల కమలాకర్ విమర్శలు

రాజేంద్రనగర, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌పై భారాస ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శలు గుప్పించారు. బండ్లగూడజాగీర్ కార్పొరేషన్ పరిధిలో మూసీ నిర్వాసితులను పరమార్శించడానికి వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. భారాసలో గెలిచి అభివృద్ధికోసం కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించిన ఆయన రాజేంద్రనగర్‌కు ఎన్ని నిధులు తెచ్చాడని చెప్పారు. ప్రజలు ఇచ్చిన పదవిని వారికోసం పోరాటం చేయడానికి వాడుకోవాలని తెలిపారు.

ఏఈగా నియమితుడైన యువకునికి సన్మానం

చేవెళ్ల: శంకర్‌పల్లి పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన యువకుడు మాల కిరణ్‌కుమార్ ఏఈగా నియమితులయ్యాడు. ఇటీవల ముఖ్యమంత్రి చేతుల మీదుగా అతను నియామక పత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా ఆదివారం కిరణ్‌కుమార్‌ని పట్టణంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పలువురు ప్రజాప్రతినిధులు సన్మానించారు. డా.గోపాల్, ఎస్సై నాగభూషణం, మాజీ ఎంపీపీ నర్సింహులు, ఉపాధ్యాయులు పెంటయ్య, రాములు, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎలికట్ట ఆలయానికి రూ.లక్ష విరాళం

షాద్‌నగర్: ఫరూక్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ శివారులో అతి పురాతనమైన భవానీమాత ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల నిర్వాహణ నిమిత్తం కాంగ్రెస్ సీనియర్ నేత కాశీనాథ్‌రెడ్డి రూ.లక్ష విరాళంగా అందించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ ముత్యాల రాజు ఆయన ఆదివారం అందజేశారు. ఆంజనేయ స్వామి ఆలయకమిటీ ఛైర్మన్ నారం దినేశ్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, ఆర్లయాదయ్య, కృష్ణయాదవ్, కావలి శ్రీశైలం, రాజు తదితరులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు

కొత్తూరు: అంతర్జాతీయ స్థాయిలో భారత్ బలమైన దేశంగా ఎదగాలంటే భాజపా మరింత బలోపేతం కావాలని ఆ పార్టీ సీనియర్ నేత అందె బాబయ్య అన్నారు. కొడచర్ల గ్రామంలో ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి పత్రాలు పంపిణీ చేశారు. నాయకులు నరసింహ గౌడ్, మాణిక్యం, శ్రీశైలం, గణేశ్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారుడి మృతి

రాజేంద్రనగర్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ ద్విచక్రవాహనదారుడు మృతిచెందిన ఘటన రాజేంద్రనగర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మౌనిక తెలిపిన వివరాల మేరకు... కర్మాన్‌ఘట్‌కు చెందిన మధుసుదన్ (57) హిమాయత్‌సాగర్ నుంచి రాజేంద్రనగర్‌కు తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే ప్రత్యక్షసాక్షులను విచారించగా డీసీఎం ఢీ కొట్టినట్లు చెప్పారు. విషయం కుటుంబ సభ్యులకు తెలియజేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు..

కేశంపేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పుట్టోనిగూడెం పంచాయతీ పరిధిలోని కంకరాళ్ల తండాకు చెందిన రమేశ్, పద్మ దంపతులు తమ నెలన్నర కుమారుడితో నిర్దవెల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లేందుకు శనివారం రాత్రి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. అదే సమయంలో లేమామిడి వైపు నుంచి కేశంపేటకి చెందిన గుంటి యాదయ్య బైక్‌పై మండల కేంద్రానికి వస్తూ వారిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో శంషాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషయంగా ఉండటంతో నిలోఫర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

PUBLIC NOTICE

We, **M/s. S.V. Rathnam & Associates – Advocates**, Hyderabad, have been engaged by our clients **(1) Mr. Epuri Sai Harish, S/o. Mr. Epuri Naga Pullaiah; and (2) Mr. Hari Prasad Epuri, S/o. Mr. Krishna Murthy Epuri**, residents of Hyderabad.

My clients propose to purchase **"Open Plot No.32, admeasuring 475 Square yards or 397.16 Square Meters, Survey No.16/ఎ, 16/లు, 137/ఇ, 137/ఈ and 138 having its L.P. No.33/ Lo/Plg/HMDA/09, situated at Teegapur Village & Gram Panchayat, Kothur Mandal, Sub-Registration Shadnagar, District Registration, Ranga Reddy"** from **Mr. Estamsetty Dayakar, son of Mr. E. Subbaiah**, R/o. of Hyderabad. **(Mr. Estamsetty Dayakar is the AGPA Holder of Mrs. Deepa Agarwal, wife of Mr.Anand Kumar Agarwal)** Any person having or asserting any claim, right or interest of any nature over the title to the Schedule Property or any part thereof and/or having any objection to the conveyance of the Schedule Properties, is hereby called upon to notify the undersigned with documents supporting his/her claim within **7 days** from the date of publication of this notice, after which period it shall be deemed that no person other than the Owners have any right, title, claim or interest over the Schedule Property and no one has any objection for the conveyance of the Schedule property in favour of our clients.

S.V. RATHNAM & ASSOCIATES – Advocates
Lalith Mall, Office No.10, 1st Floor, Andhra Bank (Union Bank)
Complex, Manikonda, Hyderabad-500089.
Mobile : 8125031189 / 8317543099

'స్వచ్ఛతా హీ సేవ' 5కె రన్

నార్సింగి, న్యూస్‌టుడే: నార్సింగి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గండిపేటలో నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవ' 5కె రన్ ఆదివారం నిర్వహించారు. నార్సింగి, గండిపేట, కోకాపేట, మణికొండ ప్రాంతాల నుంచి ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నార్సింగి మున్సిపల్ ఛైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ క్రిష్ణమోహన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. సినీ, టీవీ నటులు ప్రభాకర్, చంద్రహాస్, గిరిధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. . పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. డీఈ నరసింహరాజు, మేనేజర్ యోగేశ్, టీపీఎస్ నిహారిక తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో కార్యవర్గ ఎన్నిక

ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రంగారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్యవర్గ ఎన్నిక నిర్వహించామని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. అధ్యక్షుడిగా సి. జగదీశ్(మహేశ్వరం కళాశాల), ఉపాధ్యక్షుడిగా సీహెచ్.చైతన్య(మాడుగుల), ప్రధాన కార్యదర్శిగా జీ.సైదులు(కందుకూర్), సంయుక్త కార్యదర్శిగా కె.బుచ్చయ్య(చేవేళ్ల), కోశాధికారి ఎం.రవికుమార్(ఇబ్రహీంపట్నం), మహిళా కార్యదర్శిగా ఎం.శశి(హయత్‌నగర్ కళాశాల)తో పాటు ఏడుగురు స్టేట్ కౌన్సిలర్లు ఎన్నికైనట్లు తెలిపారు.

తల్లిదండ్రులకు సేవలందిస్తే జన్మ సార్థకం

గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న నాగచంద్రికాదేవి తదితరులు

శంషాబాద్, న్యూస్‌టుడే: పిల్లల బాగోగుల కోసం అహర్నిషలు కృషి చేసిన తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో సేవలందిస్తేనే జన్మ సార్థకతమవుతుందని కిన్నెర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు నాగచంద్రికాదేవి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధి ముచ్చింతల్‌లో స్థానిక నాయకులతో కలిసి 'వృద్ధులను రక్షించుకుందాం' గోడ పత్రికను ఆవిష్కరించారు. బ్యానర్లను ప్రదర్శిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించి వృద్ధుల చట్టాలపై అవగాహన కల్పించారు. బీర్ల పెంటయ్య, వడ్డె చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కేక్ మిక్సింగ్ వేడుకలు

శంషాబాద్, న్యూస్‌టుడే: శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నొవాటెల్ హోటల్‌లో జనరల్ మేనేజర్ సుఖ్‌బీర్ సింగ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కేక్ మిక్సింగ్, గ్రేప్ స్టాంపింగ్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. పెద్దలతో కలిసి చిన్నారులు సందడి చేశారు.

పొదుపు సంఘాల ద్వారా ఆర్థిక చేయూత

రాజేంద్రనగర్: పొదుపు సంఘాల ద్వారా సభ్యులకు ఆర్థిక చేయూత లభిస్తోందని రాజేంద్రనగర్ సర్కిల్ పద్మశాలిపురం పార్థసారథి పొదుపు సంఘం అధ్యక్షుడు సోమయ్య అన్నారు. ఆదివారం పొదుపు సంఘం సభ్యులకు గత సంవత్సరం వచ్చిన లాభాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ... 36 సంవత్సరాల క్రితం పొదుపు సంఘం స్థాపించినట్లు చెప్పారు. 1100 మంది సభ్యులు ఉన్న సంఘం ప్రస్తుతం 36 కోట్ల టర్నోవర్‌తో సాగుతోందని వివరించారు.

యోగాతో ఆరోగ్యం

కేశంపేట: నిత్యం యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని పతాంజలి యోగా సమితి భాగ్యనగర్ దక్షిణ విభాగం ప్రచారకులు సత్తయ్య పేర్కొన్నారు. ఆదివారం సంతాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మాజీ సర్పంచి అంజయ్య ఆధ్వర్యంలో ఉచిత యోగ తరగతులు నిర్వహించారు. ఆసనాలవల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రోజు క్రమం తప్పకుండా ధ్యానం చేయడం మంచిదన్నారు. మాజీ ఎంపీటీసీ రాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

చేవెళ్ల: చన్‌వెళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1997-98 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించింది. ఈ సందర్భంగా చదువు చెప్పిన గురువులు రాంప్రసాద్, విజయ్‌కుమార్, బల్వంత్‌రెడ్డి, అనంతం, బుచ్చిరెడ్డి తదితరులను ఆహ్వానించి సన్మానించారు. 25 సంవత్సరాల తర్వాత ఒక చోట కలుసుకున్న మిత్రులు యోగక్షేమాలు తెలుసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని తెలిపారు.

శునకాలతో ఇబ్బందులు

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: షాద్‌నగర్ పురపాలిక పరిధిలోని ఆర్టీసీ కాలనీలో సంచరిస్తున్న శునకాల గుంపులతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో కుక్కలు కాలనీలోని వీధుల్లో తిరుగుతూ పాదచారులు, వాహనచోదకులను కరుస్తున్నాయని వివరించారు. చిన్నారులు, వృద్ధులు ఇంటి నుంచి బయటికి రావడానికి జంకుతున్నారని తెలిపారు. రెండు రోజుల క్రితం ఓ మహిళను కుక్కలు కరువడంతో ఆసుపత్రిపాలైందని చెప్పారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ జీవనశైలిని మార్చుకోవాలి

బొమ్మకు సీపీఆర్ చేస్తున్న డా.హన్మంత్‌రెడ్డి

శంషాబాద్: ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరూ అహారపు అలవాట్లు, జీవనశైలిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని త్రిదండి రామానుజ చిన జీయర్ స్వామి పేర్కొన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల పరిధి శ్రీరామ నగరంలోని జీవా ప్రాంగణంలో కార్డియాలజిస్టు డా.మల్‌రెడ్డి హన్మంత్‌రెడ్డి, మేధినిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో సీపీఆర్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చినజీయర్ స్వామి మాట్లాడుతూ.. వైద్యుల అవసరం లేకుండా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. దేవుడి ప్రసాదాన్ని కూడ కలుషితం చేయడం బాధాకరమన్నారు. అహోబిల జీయర్ స్వామి, అజయ్‌మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన అలవాట్లతోనే గుండెకు రక్ష

షాబాద్: మనిషి జీవనానికి అత్యంత అవశ్యకమైన గుండెను కాపాడుకోవాలని, ఆరోగ్యకరమైన అలవాట్లతోనే సాధ్యమని డా.స్వర్ణలత అన్నారు. చందన్‌వెళ్లి పీహెచ్‌సీ పరిధిలో ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రదర్శన నిర్వహించారు. ఒత్తిడికి గురి కాకుండా ఉండడం, ఎనిమిది గంటలు నిద్ర పోవడం, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. సీహెచ్‌వో సుందర్ నాయక్, నిరంజన్, గోపాల్, నవీన్, కళావతి పాల్గొన్నారు.

మన శంకరపల్లి & షాద్ నగర్ లో
DUSSEHRA MAHOTSAVA
సద్దుల బతుకమ్మ మరియు దసరా ఆఫర్స్
ప్రతి ₹500 కొనుగోలు పై లక్కీ డ్రా కూపన్ పొందండి
TVS Star city Ex showroom price ₹63,000/- only
ప్రతి ఊరిలో ఒక 'బైక్' 'బంపర్ డ్రా' లో గెలుచుకునే అవకాశం
*T&C APPLY
FROM SEPTEMBER 23RD TO OCTOBER 11TH
కాసం ఫ్యాషన్స్ లో దసరా షాపింగ్ చెయ్యండి
గెలుచుకోండి అద్భుతమయిన TVS స్టార్ సిటీ బైక్ బహుమతిగా
KASAM FASHIONS
WE ♥ FASHION & FASHION AT KASAM
SAREES | KIDS | WOMENS | MENS | GHAGRAS
SUITING & SHIRTING
HANNAMKONDA | PARKAL | SHADNAGAR | BHADRACHALAM | JAMMIKUNTA | SADASHIVPET
VIKARABAD | MAHABUBABAD | PALWANCHA | SHANKARPALLY | GADWAL | JAGGAIAPET

అందరి సహకారంతో మార్కెట్ అభివృద్ధి

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీని అందరి సహకారంతో అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఛైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తమ పాలకవర్గానికి అవకాశం కల్పించేందుకు సహకారం అందించిన మంత్రి సీతక్కను రాష్ట్ర సచివాలయంలో కలిసి సత్కరించినట్లు తెలిపారు. మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, ఉప్పల్ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి తదితరులను వారి నివాసాల్లో కలిసి ధన్యవాదాలు తెలిపానని మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ సీహెచ్ భాస్కర్‌చారి, కమిటీ సభ్యులు రఘుపతిరెడ్డి, నవరాజ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, సభ్యులు

బీసీ సంఘ బలోపేతమే లక్ష్యం

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి మండలంలో బీసీ సంఘాన్ని బలోపేతం చేసేందుకు అన్ని పార్టీల, సంఘాల నాయకులు సహకరించాలని బోసు వెంకటయ్య, లింగంగౌడ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో వారు సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో బీసీ కార్యవర్గాలను ఏర్పాటు చేస్తామన్నారు.

భాజపా ఎస్సీ సెల్ కో-కన్వీనర్‌గా వెంకటేష్

బాలాపూర్, న్యూస్‌టుడే: రాష్ట్ర భాజపా ఎస్సీ మోర్చ ఎస్సీ కార్పొరేషన్ కో-కన్వీనర్‌గా బాలాపూర్‌కు చెందిన గడ్డం వెంకటేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీధర్ నియామకపత్రాన్ని అందజేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.25వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, జిల్లా నాయకులు చింతపట్ల ఎల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమిషనర్ రవీంద్ర సాగర్‌కు కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికులు ఆదివారం వినతిపత్రం అందజేశారు.

బతుకమ్మ పండగకు ఏర్పాట్ల పరిశీలన

బాలాపూర్, న్యూస్‌టుడే: బతుకమ్మ పండగ నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత అన్నారు. కాశీబుగ్గ దేవాలయంలో ఆదివారం పరిసరాలను శుభ్రం చేయించారు. బతుకమ్మ ఘాట్‌ల వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పి.సుదర్శన్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి.యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

మహేశ్వరం

•మహేశ్వరం •ఇబ్రహీంపట్నం •కల్వకుర్తి

జారుతారు.. జాగ్రత్త!

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి నుంచి మిడ్జిల్ రహదారి నిర్మించి 8 ఏళ్లు గడిచింది. మధ్యలో వంతెన, అసంపూర్తి పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. చిన్నపాటి వర్షానికి రహదారి బురదగా మారుతోంది. వాహనాలు తరచూ జారిపోయి ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

భారీ వర్షం.. బంతి రైతుకు నష్టం

కందుకూరు, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: హైదరాబాద్ నగరానికి ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలు అతి సమీపంలో ఉండడంతో ఇక్కడ రైతులు.. ఎక్కువగా కూరగాయలతో పాటు వివిధ రకాల పూలను సాగు చేస్తుంటారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం, కప్పపాడ్, తులేకలాన్, ఆరుట్ల, చౌదర్‌పల్లి, మొండిగౌరెల్లి, గడ్డమల్లాయ్యగూడ తదితర గ్రామాల్లోని కొంతమంది రైతులు ఖరీఫ్‌లో బంతి, చామంతి, మల్లె పూలను సాగు చేస్తారు. బతుకమ్మ పండగ, దసరా, దీపావళి నేపథ్యంలో ఈ పూలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాలకు పూలపై వర్షం నీరు నిలిచిపోయింది. దీంతో పూలు కుళ్లి నల్లటి మచ్చలు ఏర్పడ్డాయి. వీటిని మార్కెట్‌కు తీసుకెళ్లినా ఎవరూ కొనట్లేదని రైతులు వాపోతున్నారు.

ఇబ్రహీంపట్నంలో సాగు చేసిన బంతి తోట

జైత్వారంలో వర్షాలకు పాడైన పువ్వులు..

దక్కని పెట్టుబడి..

వేలాది రూపాయలు పెట్టుబడితో సాగు చేసిన పూల తోటలకు ఇటీవల కురిసిన భారీ వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. దిగుబడులకు గిట్టుబాటు ధర లేక ఓవైపు రైతులు తీవ్ర ఆందోళన చెందుతుంటే.. ఇటీవల వర్షాలకు పూల తోటలు నేలకొరిగి మరింత నష్టం మిగిల్చాయి. దిగుబడి దశకు వచ్చిన పువ్వులు నల్లబారడంతో ఆ రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. భారీ వర్షాలకు బంతి, చామంతి, గులాబీ తోటల్లో నీరు నిలిచిపోయింది. పెట్టిన పెట్టుబడి దక్కే పరిస్థితి లేదని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

మిగతా పూల సాగుదీ ఇదే తీరు

తగ్గిన గిరాకీ..

గణపతి నవరాత్రుల తర్వాత మార్కెట్లో పూల ధరలు పడిపోయాయి. వారం క్రితం వరకు కిలో రూ.50 నుంచి రూ.80 పలికినా.. ప్రస్తుతం వీటి ధర కిలో రూ.10-15లకు పడిపోయింది. తోటలో వీటిని కోసి మార్కెట్‌కు తరలిస్తే అదనపు భారమవుతుందని రైతులు పొలాల్లోనే వదిలేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, కందుకూరు, ఇబ్రహీంపట్నంలో బంతి, చామంతి, గులాబీ వంటి పలు రకాల పువ్వులను రైతులు సాగు చేశారు. బోనాలు, గణపతి నవరాత్రులు, దసరా సందర్భంగా నగరంలో పూలకు గిరాకీ ఉంటుందని రైతులు అంచనా వేసి ఎక్కువగా సాగు చేశారు. భారీ వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. దసరా రాకుండానే తోటలు అన్నీ నీట మునిగి పాడైపోయాయి. కందుకూరు మండలం జైత్వారానికి చెందిన రైతు వెంకట్‌రెడ్డి రూ.70 వేలు పెట్టుబడితో ఎకరంలో బంతిపూల సాగు చేశాడు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట మొత్తం పాడైపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గ్లామన్ మిసెస్ ఇండియాగా హేమలతారెడ్డి

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: టీవీ జర్నలిస్టు, వ్యాఖ్యాత, 'నిన్ను చూస్తే' చిత్ర నటి హేమలతారెడ్డికి గ్లామన్ మిసెస్ ఇండియా-2024 అవార్డు దక్కింది. మలేసియాలో జరిగిన మిసెస్ ఇండియా 2024 కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును అందుకోవటంతోపాటు ఉత్తమ టాలెంట్, ఫొటోజెనిక్ విభాగాల్లోనూ విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె జూబ్లీహిల్స్‌లో మీడియాతో మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం జరిగిన వేడుకల్లో ఈ అవార్డును అందుకున్నట్లు చెప్పారు. అందాల పోటీల రంగంలో తెలుగువారు చాలా తక్కువగా ఉంటారని, అలాంటిది తనకు ఈ అవార్డులు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

శ్రీవారి లడ్డూ కల్తీపై ఆందోళన

మీర్‌పేట: కలియుగ దైవం తిరుమల శ్రీవారి పవిత్రమైన లడ్డూ కల్తీ చేయడం మహాపాపమని వక్తలు ఖండించారు. వివేకానంద ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మీర్‌పేటలో ఆదివారం నిరసన దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు మంగు రాఘవరావు, వైష్ణవ సంఘం నాయకుడు శేషం జగన్నాథాచార్యులు, జనగామ శంకర్రావు, రమణ గురుస్వామి, భాజపా నేతలు అందెల శ్రీరాములు యాదవ్, కొలన్ శంకర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. దాడులను ఎదుర్కోవడానికి హిందువులంతా ఏకం కావాలని వారు కోరారు. నిరసన దీక్షలో పాల్గొన్న వారికి బాలాపూర్ గణేష్ లడ్డూను కొలన్ శంకర్‌రెడ్డి పంచిపెట్టారు. నిరసన దీక్షలో స్థానిక కార్పొరేటర్లు, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరసన దీక్షలో మాట్లాడుతున్న భాజపా అందెల శ్రీరాములుయాదవ్

ఆమనగల్లులో జగన్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఆమనగల్లు, కడ్తాల్, న్యూస్‌టుడే: శ్రీవారి లడ్డూను అపవిత్రం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు దొంతు విశ్వనాథం డిమాండ్ చేశారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆమనగల్లులో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఏపీ మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో పురపాలక సంఘం వైస్‌ఛైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు లక్ష్మణ్, చెన్నకేశవులు, కృష్ణపాల్గొన్నారు.

ఆర్కేపురం: తిరుమల లడ్డూ కల్తీపై తక్షణమే విచారణ జరిపించాలని భాజపా రాష్ట్ర నేత ఉప్పల రాజ్యలక్ష్మి.. కేంద్రాన్ని కోరారు. ఆదివారం ఆర్కేపురంలో ఆమె మాట్లాడారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

మహేశ్వరం 80085 73290
ఇబ్రహీంపట్నం 80085 73295
ఆమన్‌గల్, కడ్తాల్ 98481 98888
ఉ.10 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య మాత్రమే

అబ్దుల్లాపూర్‌మెట్, ఆదిభట్ల, కందుకూరు, ఆర్కేపురం,న్యూస్‌టుడే

? అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి గ్రామ ప్రధాన రహదారి వెంట మురుగు పారుతూ దుర్గంధం వ్యాపిస్తోంది. గ్రామంలో మురుగు రోడ్డ వెంట వదిలేయడంతో సమస్య తీవ్రమవుతోంది.– శంకర్, కవాడిపల్లి

✓ వెంటనే పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.
– రమేష్, పంచాయతీ కార్యదర్శి, కవాడిపల్లి

?ఆదిభట్ల పురపాలిక పరిధిలోని కొంగరకలాన్ కల్వర్టు వద్ద రోడ్డు దెబ్బతిని పాడైంది. సమస్యను పరిష్కరించండి.– శివ, కొంగరకలాన్

✓ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.
– బాలకృష్ణ, కమిషనర్, ఆదిభట్ల పురపాలిక

? నేదునూరులో రేషన్ దుకాణం సమీపంలో భూగర్భ మురుగు కాలువల మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా ఉన్నాయి.– శ్రీరాములు, నేదునూరు

✓ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతాం. – సరిత ఎంపీడీఓ

? ఆర్కేపురంలోని ఎన్టీఆర్ నగర్, హరిపురి కాలనీలో పగటి పూట వీధి దీపాలు వెలుగుతున్నాయి. – ఉజ్మ, ఎన్టీఆర్ నగర్

✓ పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం.– సుజాత, సరూర్‌నగర్ డీసీ

మీర్‌పేట, తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే:

? మీర్‌పేట కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ పరిధి చందనచెరువులో గుర్రపుడెక్క పెరిగి దుర్గంధం, దోమలు వ్యాపిస్తున్నాయి.
– వికాస్, మిథిలానగర్‌కాలనీ, మీర్‌పేట

✓ చందనచెరువులో గుర్రపుడెక్క తొలగించడానికి హెచ్‌ఎండీఏ అధికారులతో మాట్లాడాం. వీలైనంత త్వరగా తొలగిస్తాం.
– వెంకన్న, డీఈఈ, మీర్‌పేట కార్పొరేషన్

? మీర్‌పేట చౌరస్తా నుంచి జిల్లెలగూడ లలితానగర్ చౌరస్తా మధ్యలో ప్రధాన రహదారి ధ్వంసమైంది. రహదారికి వెంటనే మరమ్మతులు చేయాలి.– టి.గోపాల్‌గౌడ్, ప్రభుత్వ ఉద్యోగి, తిరుమలహిల్స్

✓ వీలైనంత త్వరగా రహదారికి మరమ్మతులు చేపడతాం.
– వెంకన్న, డీఈఈ, మీర్‌పేట

? సాగర్ రహదారి కమ్మగూడ వివేకానంద కూడలి వద్ద కృష్ణానీటి పైపులైను ఎయిర్‌వాల్వ్ పనుల్లో జాప్యం కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. – శంకర్, వాహనదారుడు

✓ పనుల్లో మరింత వేగం పెంచి త్వరగా పూర్తిచేస్తాం.
– వినయ్‌కుమార్, మేనేజర్, జలమండలి

జూదం ఆడుతున్న అయిదుగురి అరెస్టు

ఆదిభట్ల, న్యూస్‌టుడే: రావిర్యాలలో జూదం ఆడుతున్న అయిదుగురిని ఆదివారం సాయంత్రం ఆదిభట్ల ఎస్సై వెంకటేష్ అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.13 వేలు స్వాధీనం చేసుకున్నారు.

నేడు మంచాల సహకార సంఘ సమావేశం

మంచాల, న్యూస్‌టుడే: మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ హనుమంతురెడ్డి, సీఈఓ శ్రీనివాస్ తెలిపారు.

పదవీ విరమణ శుభాకాంక్షలు
రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో గత 26 సంవత్సరాలుగా అంకితభావం, నిబద్ధత, విశ్వసనీయతతో సేవలందించి అందరి మన్ననలు పొంది నేడు పదవీ విరమణ చేయుచున్న మా డాడీకి శ్రీ బుర్ర వీరస్వామి గౌడ్ గారికి ఇవే మా హృదయ పూర్వక పదవీ విరమణ శుభాకాంక్షలు.
శ్రీమతి & శ్రీ
బుర్ర వీరస్వామి గౌడ్ - జంగమ్మ
Revenue Department
కూతురు - అల్లుడు:
రామకృష్ణ గౌడ్ - భార్గవి
కొడుకు - కోడలు:
కార్తిక్ గౌడ్ - స్వప్న
మనుమళ్ళు మరియు మనుమరాళ్ళు
రుతిక్షా, సహర్ష్, సాన్విక, ధ్రువిక్ నారాయణ్

ఆసుపత్రులు, మెట్రోస్టేషన్లే లక్ష్యంగా చోరీలు

సికింద్రాబాద్: నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, మెట్రోస్టేషన్ల వద్ద పార్కింగ్ చేసిన బైకులే లక్ష్యంగా చోరీ చేస్తున్న దొంగను చిలకలగూడ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.10 లక్షల విలువ చేసే 18 బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఠాణాలో ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి వివరాలు వెల్లడించారు. కామారెడ్డికి చెందిన శ్రీనివాస్ కూలీ చేస్తుంటాడు. కుటుంబ పోషణకు డబ్బులు చాలక నగరంలోని చర్లపల్లికి వచ్చి బైకుల దొంగతనం మొదలుపెట్టాడు. దొంగిలించిన వాహనాన్ని తక్కువ ధరకు విక్రయిస్తుంటాడు. రెండ్రోజులుగా గాంధీ ఆసుపత్రి ఆవరణలో బైకులు మాయమవుతుండంతో.. బాధితుల ఫిర్యాదుతో చిలకలగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్ నేతృత్వంలోని సిబ్బంది మాటు వేసింది. సీసీ ఫుటేజీల ఆధారంగా శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. నీలోఫర్, ఈఎస్ఐ, ఉస్మానియా ఆసుపత్రులు, మియాపూర్, మెట్టుగూడ, నాంపల్లి మెట్రోస్టేషన్లు, మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పార్కింగ్ చేసిన బైకులు దొంగిలించినట్లు అంగీకరించాడు.

జూనియర్ లెక్చరర్ల కార్యవర్గం ఎన్నిక

ఈనాడు డిజిటల్,హైదరాబాద్ : రంగారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్యవర్గ ఎన్నిక నిర్వహించామని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. అధ్యక్షుడిగా సి.జగదీశ్(మహేశ్వరం కళాశాల), ఉపాధ్యక్షుడిగా సీహెచ్.చైతన్య(మాడుగుల), ప్రధాన కార్యదర్శిగా జీ.సైదులు(కందుకూర్), సంయుక్త కార్యదర్శిగా కె.బుచ్చయ్య(చేవెళ్ల), కోశాధికారి ఎం.రవికుమార్(ఇబ్రహీంపట్నం), మహిళా కార్యదర్శిగా ఎం.శశి(హయత్‌నగర్ కళాశాల)తో పాటు ఏడుగురు స్టేట్ కౌన్సిలర్లు ఎన్నికైనట్లు తెలిపారు.

గాంధీ వైద్య కళాశాలకు రచయిత్రి డా.విజయభారతి భౌతికకాయం

సనత్‌నగర్, గాంధీ ఆసుపత్రి, ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ప్రముఖ రచయిత్రి డా.విజయభారతి భౌతికకాయాన్ని కుటుంబసభ్యులు ఆదివారం సికింద్రాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాలకు అప్పగించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సనత్‌నగర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. బంధువులు, అభిమానుల సందర్శనార్థం ఆదివారం ఉదయం కుందన్‌బాగ్‌లోని ఐఏఎస్ క్వార్టర్స్‌లోని ఆమె నివాసంలో భౌతికకాయాన్ని ఉంచారు. మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న, ఐఏఎస్ అధికారులు దానకిషోర్, బుద్ధ ప్రకాష్, రవిబాబు, బోయి విజయేంద్ర, ఐఆర్‌పీఎస్ భరత్‌భూషణ్, జస్టిస్ చంద్రయ్య, హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వర్‌రావు, గడ్డం ఝాన్సీ, సుధారాణి తదితరులు నివాళులర్పించారు.

సందడిగా గణేశ్ నిమజ్జనోత్సవం

కవాడిపల్లి ఉదయ్ గార్డెన్ కాలనీలో..

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి గ్రామ పరిధి ఉదయ్ గార్డెన్ కాలనీలో గణనాథుడి నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. లడ్డూ ప్రసాదాన్ని గుడూరు సీతారాంరెడ్డి రూ.1.75 లక్షలకు వేలంలో కైవసం చేసుకున్నారు. గణపతి వస్త్రాన్ని మేక వెంకట నరసింహారెడ్డి రూ.30 వేలకు దక్కించుకున్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి కృషి

గడ్డం బాలయ్యగౌడ్‌ను సత్కరిస్తున్న స్థానికులు

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: గీత కార్మికుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ గౌడ సంఘం నూతన అధ్యక్షుడు గడ్డం బాలయ్యగౌడ్ పేర్కొన్నారు. స్థానిక గౌడ సంఘం కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన ఎన్నికలో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1998-99 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఎన్ఆర్ గార్డెన్‌లో సమావేశమయ్యారు. నాటి మిత్రులంతా కలిసి అప్పటి గురువులు కొప్పు జంగయ్య, శ్రీనివాసులు, పొగాకు సురేష్‌ను ఘనంగా సన్మానించారు.

ఇబ్రహీంపట్నం ఎన్ఆర్ గార్డెన్‌లో..

తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: తుర్కయంజాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి 2000-2001 విద్యార్థులు సమావేశమయ్యారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను సత్కరించారు.

తుర్కయంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

రూ.19 లక్షలతో అభివృద్ధి పనులు

పెద్దఅంబర్‌పేట్, న్యూస్‌టుడే: పెద్ద అంబర్‌పేట్ పురపాలికలోని అన్ని వార్డులలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయనున్నట్లు వైస్‌ఛైర్‌పర్సన్ చామ సంపూర్ణరెడ్డి తెలిపారు. కుంట్లూర్ గ్రామం 21వ వార్డులో స్థానిక కౌన్సిలర్ ఓరుగంటి సుజాతతో కలిసి రూ.19 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, పార్కు పనులను ఆమె శంకుస్థాపన చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రికను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కుంట్లూర్‌లో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వైస్‌ఛైర్మన్ చామ సంపూర్ణరెడ్డి

'రైతులను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం'

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: రైతులను మోసం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి రైతు దీక్షతో బుద్ధి చెప్పాలని భాజపా కిసాన్ మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యులు పాపయ్యగౌడ్.. రైతులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి రైతులకు అనేక హామీలు ఇచ్చి వాటిని ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. సోమవారం ఉదయం 10గంటలకు ఇందిరా పార్కు వద్ద నిర్వహించే రైతు దీక్షను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్, కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యదర్శి తుమ్మిడి వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి, జిల్లా నాయకులు దొండ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భాజపా నేత పాపయ్యగౌడ్


ప్రథమ వర్ధంతి
మీరు మా నుండి దూరమై నేటికి ఒక సంవత్సరం కాలం గడిచిననూ మీ యొక్క మధురస్మృతులు మరువలేకున్నాము. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...
శోకతప్తహృదయాలతో...
భర్త : రాళ్ల గూడెం ముత్యం రెడ్డి
కొడుకులు - కోడళ్ళు :
రాళ్ల గూడెం ఆయిల్ రెడ్డి - శంకరమ్మ
రాళ్ల గూడెం మల్లారెడ్డి - అరుణ
రాళ్ల గూడెం బలవంత్ రెడ్డి - మాధవి
కూతుళ్లు - అల్లుళ్ళు :
పొద్దుటూరు కళావతి - రాంరెడ్డి
బొక్క జమున - గోవర్ధన్ రెడ్డి
మరియు మనుమండ్లు, మనుమరాలు
రాళ్ల గూడెం కుటుంబ సభ్యులు
మరియు బంధుమిత్రులు
కీ॥శే॥ రాళ్లగూడెం రాములమ్మగారు
మరణం: 30-09-2023

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి నేడు (30.9.2024) ఉద్యోగ విరమణ చేయుచున్న శుభసందర్భంగా... గౌ॥ శ్రీ మర్రి అంజిరెడ్డి గారికి వారి భావి జీవితం అష్టైశ్వర్య, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ... మీ...
శ్రీమతి & శ్రీ
మర్రి మాధవి అంజిరెడ్డి గారు
మేనేజర్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్
వియ్యంకుడు - వియ్యపురాలు:
రొక్కం భీంరెడ్డి - సావిత్రి
(మాజీ ఎంపిపి, హయత్‌నగర్)
మనుమరాలు:
రొక్కం శ్రవంతి రెడ్డి
మనుమళ్ళు:
రొక్కం యోదన్ రెడ్డి,
రొక్కం చేతన్ రెడ్డి,
రొక్కం ధీరన్ రెడ్డి
అల్లుళ్లు - కూతుళ్ళు:
రొక్కం చంద్రశేఖర రెడ్డి - అనితా రెడ్డి
(కౌన్సిలర్, తుర్కయంజల్ మునిసిపాలిటీ)
రొక్కం రామకృష్ణా రెడ్డి - దివ్య రెడ్డి
రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్,
తుర్కయాంజాల

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మేనేజర్‌గా విధులు నిర్వర్తించి... నేడు (30.09.2024) ఉద్యోగ విరమణ చేయుచున్న గౌ॥ శ్రీ మర్రి అంజిరెడ్డి గారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు
వారి శేష జీవితం సుఖ సంతోషాలతో... ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ..
శ్రీమతి & శ్రీ
మర్రి మాధవి అంజిరెడ్డి గారు
మేనేజర్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్
కూతురు - అల్లుడు:
రొక్కం దివ్యరెడ్డి - రామకృష్ణారెడ్డి
కుమారుడు - కోడలు:
మర్రి దినేష్ రెడ్డి - భవాని రెడ్డి
భార్య :
శ్రీమతి మర్రి మాధవి రెడ్డి
మనుమళ్ళు:
రొక్కం చేతన్ రెడ్డి,
రొక్కం ధీరన్ రెడ్డి

(c) eenadu

వేంకటేశ్వర ఆలయంలో సహస్ర దీపాలంకరణ

పంజాగుట్ట, న్యూస్‌టుడే: పంజాగుట్ట దుర్గానగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సహస్ర దీపాలంకరణ చేశారు. ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. అంతకుముందు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ పలమర్తి వెంకటేశ్వర్లు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో బాల నర్తకి నమోదు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: యూసుఫ్‌గూడ ప్రగతి నగర్‌కు చెందిన బాల నర్తకి వేక్షాహ్నిక స్థానిక కళాంజలి కూచిపూడి డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో పేరు నమోదు చేసుకుంది. గంటసేపు నిరంతరాయంగా కూచిపూడి నృత్య ప్రదర్శనతో రికార్డు సొంతం చేసుకుందని నిర్వాహకుడు సుధాకర్ రెడ్డి తెలిపారు. నృత్య ప్రదర్శనను సంస్థ సౌత్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ జ్యోతి రంగా పర్యవేక్షణలో నిర్వహించారని చెప్పారు.

ధ్రువపత్రం అందుకుంటున్న వేక్షాహ్నిక

రెండుపడక గదుల ఇళ్లను అర్హులకు కేటాయించాలి

బోరబండ, న్యూస్‌టుడే: రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం కోసం తమ స్థలాలను అప్పగించిన అర్హులకు ఇళ్లను కేటాయించాలని రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ కమలానగర్ వ్యవస్థాపక అధ్యక్షుడు హైదర్ ప్రభుత్వాన్ని కోరారు. ఇళ్లస్థలాలు అప్పగించిన వారితో కలిసి ఎస్పీఆర్ హిల్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో కె.విజయరామారావు మంత్రిగా ఉన్నప్పుడు కమలానగర్‌లో నిర్మించిన 210 రెండుపడక గదుల ఇళ్లలో 102 మందికి కేటాయించారని, తమవారికి ఇంకా 56 ఇళ్లు రావాల్సి ఉందని చెప్పారు. అర్హులైన వారందరికీ కమలానగర్‌లో రెండుపడక గదుల ఇళ్లను కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రాలు సమర్పించినట్లు చెప్పారు. రావాల్సిన ఇళ్లను కేటాయించిన తర్వాతే మూసీ నిర్వాసితులకు వాటిని అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.

* కమలానగర్‌లో రెండు పడక గదుల ఇళ్లను అర్హులకు కేటాయించేలా చూస్తానని రహ్మత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి తెలిపారు. ఎస్పీఆర్ హిల్స్ కమలానగర్‌లో ఆందోళన చేస్తున్న లబ్ధిదారులకు ఆదివారం ఆయన సంఘీభావం తెలిపారు. కలెక్టర్, ఆర్డీఓతో మాట్లాడి ఇళ్లు త్వరగా మంజూరయ్యేలా చూస్తామని చెప్పారు.

హస్తకళ.. భళా..!

పీపుల్స్ ప్లాజాలో కొలువుదీరిన స్వయం సహాయక సంఘాల 'సరస్ ఫెయిర్'

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: నెక్లెస్‌రోడ్ పీపుల్స్‌ప్లాజాలో కొలువుదీరిన స్వయం సహాయక సంఘాల 'సరస్ ఫెయిర్ 2024' హస్తకళా ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంటోంది. మహిళలు తయారు చేసిన చెక్కబొమ్మలు, వెదురు ఉత్పత్తులు, గోండు, కోయ చిత్రపటాలు, లెదర్‌ల్యాంప్స్, వాల్ పోస్టర్లు, వాటి మీద చేతితో వేసిన చిత్రాలు, కొబ్బరిపీచుతో తయారు చేసిన పక్షి గూళ్లు వంటి వందల రకాలు ఇక్కడ అందుబాటులో ఉంచారు. పదిరోజులపాటు జరిగే ఈ ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చినవారు స్టాల్స్ ఏర్పాటు చేశారు. పలువురు తమ అభిప్రాయాలు 'ఈనాడు'తో పంచుకున్నారు.

ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా: ప్రేమ్‌లీలా

సికింద్రాబాద్‌కు చెందిన ట్రాన్స్‌జెండర్ ప్రేమ్‌లీల తననకుంటూ ప్రత్యేక గుర్తింపు రావాలని ప్రేమ్‌లీలా క్రియేషన్స్ పేరుతో ఎకోఫ్రెండ్లీ జ్యూట్ బ్యాగ్స్, హ్యాండీక్రాఫ్ట్‌లు తయారు చేస్తోంది. కూకట్‌పల్లి దుర్గాబాయి శిశువికాస కేంద్రంలో జూట్‌బ్యాగ్స్ తయారు చేయడం నేర్చుకుని అయిదుగురు మహిళలు, మరో ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి కల్పిస్తుంది. ఇప్పటి వరకు 80 ప్రదర్శనల్లో పాల్గొన్నారు. నాలుగు యంత్రాలతో పలువురికి శిక్షణ ఇస్తున్నారు. 'అనారోగ్యంతో ఉన్న నా తల్లిని కాపాడుకొనేందుకు బిక్షాటన చేశా. అనేక అవమానాలు ఎదుర్కొన్నా. నాకంటూ మంచి పేరు తెచ్చుకోవాలని భావించి బ్యాగుల తయారీ ప్రారంభించా. పర్యావరణ అనుకూలమైన వస్తువులను అందించడమే మా ఉద్దేశం' అని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లోనూ విక్రయిస్తున్నాం: ప్రియాంక

పెద్దపల్లికి చెందిన ప్రియాంక వెదురుతో చేసిన బొమ్మలతో స్టాల్ ఏర్పాటు చేశారు. తాజ్‌మహల్, ఈఫిల్‌టవర్, గడియారాలు, ఇండియా పటాలు వంటివి ఉన్నాయి. వీటిపై వేసిన చిత్రాలు నీటిలో తడిసినా పాడవకుండా ఉంటాయని పేర్కొన్నారు. ఆయా ఉత్పత్తులను ఆన్‌లైన్‌లోనూ విక్రయిస్తున్నామని, ఖరీదు రూ.500 నుంచి రూ.2వేలకు పైగా ఉంటాయని చెప్పారు.

నాటి ఆటలు గుర్తుచేయాలని: పి.లలితకుమారి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన పి.లలిత కుమారి కొండపల్లి బొమ్మలను ప్రదర్శనకు ఉంచారు. 'ఇప్పుడు ఉన్న పిల్లలకి పాతకాలం నాటి ఆటలు, వస్తువులు తెలియవు. వారికి వాటిని పరిచడం చేసేందుకు బొమ్మలు తయారు చేస్తున్నాం. తెల్లపునికి చెక్కతో వీటిని చేస్తామన్నారు. ఎద్దుల బండ్లు, తాడిచెట్లు, తొక్కుడు బిళ్ల వంటి సందర్శకులు ఆసక్తిగా చూస్తున్నారు.' అని పేర్కొన్నారు.

సోలార్ పొడులు సిద్ధం

నాగర్‌కర్నూలుకు చెందిన మహిళలు గ్రామీణ సోలార్ ఫుడ్స్ పేరుతో వివిధ ఆహార పదార్థాలను సౌర శక్తి ద్వారా పొడి రూపంలో చేసి విక్రయానికి ఉంచారు. 15 మంది మహిళలు కలిసి టమాటా, మామిడి, కరివేపాకు, ఆకు కూరలు వంటి వాటిని సౌరశక్తి (సోలార్) సాయంతో ఆరబెట్టి పొడి రూపంలో తయారు చేస్తున్నట్లు వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే

సమస్య: శ్రీకృష్ణానగర్ బీ-బ్లాకు సాయిబాబా ఆలయం వీధికి ముందు భాగంలోని వీధిలో దీపాలు రెండు నెలలుగా వెలగడంలేదు. ఫిర్యాదు చేసినా సిబ్బంది పట్టించుకోవడం లేదు.

– టి.వి.రమణ, శ్రీకృష్ణానగర్

సమాధానం: వెలగని వీధి దీపాలకు వెంటనే మరమ్మతు చేసేలా చర్యలు తీసుకుంటాం. – **రాజేష్,** జీహెచ్ఎంసీ వీధిదీపాల పర్యవేక్షణాధికారి

గ్లామన్ మిసెస్ ఇండియాగా హేమలతారెడ్డి

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: టీవీ జర్నలిస్టు, వ్యాఖ్యాత, 'నిన్ను చూస్తే' చిత్ర నటి హేమలతారెడ్డికి గ్లామన్ మిసెస్ ఇండియా-2024 అవార్డు దక్కింది. మలేషియాలో జరిగిన మిసెస్ ఇండియా 2024 కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును అందుకోవటంతోపాటు ఉత్తమ టాలెంట్, ఫొటోజెనిక్ విభాగాల్లోనూ విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె జూబ్లీహిల్స్‌లో మీడియాతో మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం జరిగిన వేడుకల్లో ఈ అవార్డును అందుకున్నట్లు చెప్పారు. అందాల పోటీల రంగంలో తెలుగువారు చాలా తక్కువగా ఉంటారని, అలాంటిది తనకు ఈ అవార్డులు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

'తిరుపతి వాసిగా, హిందువుగా అభిప్రాయం చెప్పా'

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ మహా ప్రసాదం విషయంలో మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు స్పందించారు. ప్రపంచ హార్ట్ డేను పురస్కరించుకుని ఆదివారం జూబ్లీహిల్స్‌లోని జీవీకే హెల్త్ హబ్‌లో మా సభ్యులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మంజు విష్ణు మీడియాతో మాట్లాడారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో ఇటీవల మంచు విష్ణు, సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌ల మధ్య 'ఎక్స్' వేదికగా సంభాషణ జరిగిన విషయం విదితమే. దీనిపై మాట్లాడుతూ ప్రకాశ్‌రాజ్ ట్వీట్ పూర్తిగా ఆయన వ్యక్తిగత అభిప్రాయమని, అదే విధంగా తన అభిప్రాయాన్ని తెలియజేశానన్నారు. ఒక హిందువుగా, తిరుపతి వాసిగా ఆ వివాదానికి మతం రంగు లేదని చెప్పగలనని అన్నారు. మా అసోసియేషన్ బిల్డింగ్ విషయంలో త్వరలోనే ఒక ప్రకటన చేస్తామన్నారు. లైంగిక వేధింపుల కేసులో జానీ మాస్టర్ వ్యవహారంపై మీడియా ప్రశ్నించగా.. కోర్టులో ఉన్న విషయంపై మాట్లాడనని స్పష్టం చేశారు. మా సభ్యులు శివబాలాజీ, మాదాల రవి, కరాటే కల్యాణి, జీవీకే హెల్త్ హబ్ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ ఎన్‌జీ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో శివబాలాజీ, మంచు విష్ణు, డాక్టర్ శాస్త్రి, మాదాల రవి

సందడిగా హృదయ దినోత్సవం పరుగు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నెక్లెస్ రోడ్డులో కార్డియాక్ రెహబ్ రన్ ఉత్సాహంగా సాగింది. ఆదివారం ఉదయం సంజీవయ్య పార్కు వద్ద ప్రారంభమైన 21కే, 16కే, 10కే, 5కే, 3కే పరుగులను బ్రిటిష్ హై కమిషన్ తెలంగాణ జీడీ రేయిహ జెండా ఊపి ప్రారంభించారు. సంజీవయ్య పార్కు నుంచి పరుగు ట్యాంక్ బండ్ చుట్టూ కొనసాగింది. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటూ వ్యాయామం చేస్తే గుండె వ్యాధులను దూరం చేయవచ్చని కార్డియాక్ రెహబ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్, సీఈఓ డాక్టర్ మురళీధర్ బాబీ సూచించారు. మానవ జీవక్రియ ప్రారంభం కావాలంటే గుండె ప్రధాన పాత్ర పోషిస్తోందని, పౌష్టికాహారం తీసుకోవడం తప్పనిసరని, వ్యాయామం ద్వారా గుండెను జాగ్రత్తగా కాపాడుకోవచ్చని, రోజూ 30 నిమిషాల పాటు వారంలో కనీసం అయిదు రోజులు వ్యాయామం చేయాలని సూచించారు.

పాల్గొన్న ఔత్సాహికులు

పారిశుద్ధ్య సమస్య పరిష్కారం

వెంగళ్‌రావు నగర్, న్యూస్‌టుడే: వెంగళరావునగర్ డివిజన్ వీడియోగల్లీ ప్రాంతంలో నివాసాల మధ్య వ్యర్థాలు పేరుకుపోవడంతో పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారాయి. మూడు నెలలు అవుతున్నా సమస్య అలాగే ఉండటంతో 'వ్యర్థాల కుప్పలు.. పరిసరాలు అపరిశుభ్రం' శీర్షికన ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఆదివారం వీడియోగల్లీ నివాసాల మధ్య వ్యర్థాల కుప్పలు తొలగించి సమస్య పరిష్కరించారు.

వీడియోగల్లీలో నివాసాల నడుమ వ్యర్థాల కుప్పల తొలగింపు పనులు

కాలనీ పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: కమలాపుకాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కాలనీలో సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డా. గోపాలకృష్ణ గోఖలే మాట్లాడుతూ.. మనం ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడవంతో పాటు, నిత్యం కొంత సమయాన్ని వ్యాయామం, యోగా, ధ్యానం కోసం కేటాయించాలన్నారు. సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రావు, ఫేజ్-1 కార్యదర్శి మీర్జా అబ్బాస్ అలీఖాన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మదర్సా నిర్మాణ ప్రకటనపై అభ్యంతరం

బోరబండ, న్యూస్‌టుడే: రహ్మత్‌నగర్ డివిజన్ శ్రీరామ్‌నగర్ హజరత్ సయ్యదినా ఉమర్ ఫారూఖ్ మసీదు ప్రాంగణంలో మదర్సా నిర్మాణం ప్రకటన పట్ల మసీదు నిర్వహణ కమిటీ ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తంచేశారు. మసీదులో జోహర్ నమాజ్ అనంతరం కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే అంగీకరించేది లేదని స్పష్టం చేస్తూ.. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. గత శుక్రవారం మసీదులో ప్రత్యేక ప్రార్థన చేయించిన మతపెద్ద మౌలానా అహ్మద్ నక్షబంది ప్రసంగిస్తూ మదర్సా నిర్మిస్తామని ప్రకటించడం సమంజసం కాదన్నారు. ఈ విషయంలో బస్తీవాసుల అభిప్రాయాలను స్వీకరించిన తర్వాత కమిటీ ప్రకటన చేస్తుందని స్పష్టంచేశారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాజీవ్‌నగర్‌శాఖ, పంజాగుట్ట శాఖల సర్వసభ్య సమావేశం రాజీవ్‌నగర్ సామాజిక భవనంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజీవ్‌నగర్‌శాఖ అధ్యక్షుడు కృష్ణశర్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు టి.ఇందర్‌సింగ్ మాట్లాడుతూ.. పెన్షనర్లు ఎదుర్కొంటున్న డీఏ, పీఆర్‌సీ సమస్యలు పరిష్కరించేందుకు నగర సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో 2.98 లక్షల మంది టీఎస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జాక్)లో భాగస్వాములుగా ఉన్నారన్నారు. పంజాగుట్ట శాఖ అధ్యక్షుడిగా వి.సదానందంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎం.బద్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణన చేసి.. మాట నిలుపుకోవాలి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కుల గణన చేసి బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ వెంటనే మాట నిలబెట్టుకోవాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు సీహెచ్ ఉపేంద్ర అన్నారు. ఆదివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో బీసీ సమాజ్ ఆధ్వర్యంలో జరిగిన బీసీ కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తమిళనాడులో బీసీ ఉద్యోగుల ఉద్యమం స్ఫూర్తితో తెలంగాణలోనూ బీసీ ఉద్యమానికి అందరూ కదలాలన్నారు. బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు మాట్లాడుతూ చిన్న చిన్న సమావేశాలు పెడుతూ బీసీలను చైతన్య పరుస్తూ ముందుకు వెళ్దామన్నారు. సభాధ్యక్షుడు బంగారు నరసింహ సాగర్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లోనూ పోటీలో ఉండేలా సిద్ధం కావాలన్నారు. బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సాగర్, బీసీ నాయకులు ఓర్సు కృష్ణయ్య, సత్యనారాయణరాజు, ఎత్తరి అంతయ్య, దేవేందర్, బీసీ సమాజ్ ఎంప్లాయిస్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్, శివాని తదితరులు పాల్గొన్నారు..

కొనసాగుతున్న కార్మిక వ్యతిరేక విధానాలు

మాట్లాడుతున్న సీహెచ్ మురహరి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: కార్మికులకు కులం, మతం, దేశం లాంటివేవీ ప్రతిబంధకాలు కాదని ఎస్‌యూసీఐ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మురహరి అన్నారు. ఆదివారం తెలంగాణ యునైటెడ్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, జీహెచ్ఎంసీ విభాగం మొదటి ఏడాది సభలు ఖైరతాబాద్‌లోని శ్రీనివాసనగర్ సామాజిక భవనంలో జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పదేళ్లు పాలించిన భారాస ప్రభుత్వాన్ని ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కడితే.. వారూ కార్మిక వ్యతిరేక విధానాలు కొనసాగిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ స్త్రీ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షురాలు శోభా పెరిందేవి, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు సిరాజుద్దీన్ మాట్లాడారు. ఏఐయూటీయూసీ రాష్ట్ర ఇన్‌చార్జి కె.భరత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్మిక సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

బాల సాహిత్యంతోనే విజ్ఞాన బీజాలు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: బాల సాహిత్యంతో బాలల హృదయాల్లో విజ్ఞానంతో పాటు భాషా పరిజ్ఞానం పెరుగుతుందని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ డా.రియాజ్ అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ, బాలచెలిమి గ్రంథాలయాల నిర్వహణపై కార్యశాల జరిగింది. అకాడమీ అధ్యక్షుడు మణికొండ వేదకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన డా.రియాజ్ మాట్లాడారు. వేదకుమార్ మాట్లాడుతూ.. సుమారు వంద బాలచెలిమి గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం తమ లక్ష్యమన్నారు. సిద్ధిపేట డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ డా.బి.వెంకటేశ్వర్లు, ప్రభుత్వ సిటీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.చెకోని రవికుమార్, రచయిత్రి డా.అమరవాది నీరజ, మహా అకాడమీ డైరెక్టర్ మల్లికార్జునరావు, బాలచెలిమి గ్రంథాలయాల రాష్ట్ర కన్వీనర్ గరిపల్లి అశోక్‌కుమార్, సమన్వయకర్త ఖైజర్ బాషాతో పాటు బాలల రచయితలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డా.రియాజ్, చిత్రంలో వేదకుమార్ తదితరులు

కానిస్టేబుల్ కుటుంబానికి బోరబండ పోలీసుల చేయూత

బోరబండ, న్యూస్‌టుడే: బోరబండ ఠాణాలో గస్తీ కానిస్టేబుల్‌గా పనిచేసిన ఎం.సాయికుమార్ కుటుంబానికి ఠాణా తరపున రూ.లక్షా వెయ్యి ఆర్థిక సహకారం అందించారు. రహ్మత్‌నగర్ డివిజన్ కార్మికనగర్‌లో నివసించిన 2010 బ్యాచ్‌కు చెందిన ఎం.సాయికుమార్ గుండెపోటుతో సెప్టెంబరు 20న మృతిచెందటం తెలిసిందే. ఇద్దరు ఆడపిల్లలు ఉండగా.. భార్య ఎనిమిది నెలల గర్భిణి. కార్మికనగర్‌లోని సాయికుమార్ నివాసానికి ఆదివారం వెళ్లిన బోరబండ ఇన్‌స్పెక్టర్ ఎస్.వీరశేఖర్ ఠాణా తరపున అతడి కుటుంబసభ్యులకు చెక్కును అందజేశారు. ఎస్ఐలు ఎండీ సర్దార్ జమాల్, బి.మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సాయికుమార్ కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న ఇన్‌స్పెక్టర్ వీరశేఖర్

జలమయమైన శ్రీకృష్ణానగర్

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ఆదివారం రాత్రి సమయంలో కురిసిన వర్షానికి శ్రీకృష్ణానగర్‌లోని లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. శ్రీకృష్ణానగర్ ఏ, బీ, సీ బ్లాకుల్లో మోకాలి లోతు నీరు ప్రవహించింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దుకాణాల సముదాయాల్లోకి వరదనీరు వచ్చి చేరింది.

శ్రీకృష్ణానగర్ బీ-బ్లాకులో వరదనీరు

'వర్గీకరణపై ఆర్డినెన్స్ యోచన తగదు'

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. నినాదాలతో హోరెత్తించారు. కమిటీ కన్వీనర్ మన్నె శ్రీధర్ మాట్లాడుతూ.. ఎస్సీ కులగణన చేపట్టకుండా వర్గీకరణపై ఎలా తీర్పు ఇస్తారని ప్రశ్నించారు. మాలల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణపై చేస్తున్న ఆర్డినెన్స్ ఆలోచన విరమించుకోవాలన్నారు. దీనిపై సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తితో జ్యుడీషియల్ కమిషన్ వేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ బల్వంత్‌రావు, నాయకులు రాజేష్, కల్యాణ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆందోళన చేస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ ప్రతినిధులు

గంజాయి విక్రేతల ముఠా అరెస్టు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: గంజాయి సరఫరా చేస్తున్న, విక్రయిస్తున్న ఎనిమిది మందిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఎక్కువ శాతం బిహారీలే ఉన్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లోని కమాన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఒక యువకుడు పోలీసులను చూసి తలుపులు వేసుకున్నాడు. దీంతో పోలీసులు తలుపులు తీసి చూడగా.. గదిలో ఎనిమిది మంది కనిపించారు. వీరి వద్ద తనిఖీ చేయగా 305 గ్రాముల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన వారిలో దమ్మాయిగూడలో నివసించే బిహారీ కార్మికుడు నీతీష్‌కుమార్(24)తోపాటు ఎన్బీటీనగర్‌లో నివసించే బిహారీలు ప్రైవేటు ఉద్యోగి కన్హయ్య కుమార్ (21), అనీల్‌కుమార్ (19), పంకజ్‌కుమార్ (19), రాకేష్‌కుమార్ (19), లలిత్‌పాశ్వాన్ (30), దీపక్‌కుమార్ (20), ఎన్బీటీనగర్‌కు చెందిన కరణ్‌కుమార్ (23) ఉన్నారు. కన్హయ్య కుమార్ సూచన మేరకు నితీష్‌కుమార్ బిహార్‌కు వెళ్లి లక్నాపూర్ ప్రాంతంలో రాజు షా వద్ద గంజాయిని కొనుగోలు చేసి తీసుకొచ్చి ఇక్కడ అవసరమైన వారికి ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. రాజు షా పరారీలో ఉన్నాడని, మిగిలిన వారిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బంజారాహిల్స్ పోలీసులు తెలిపారు.

కళాశాల వద్ద గొడవ సృష్టించిన వారిపై కేసు

ఫిలింనగర్: కళాశాల గేటు వద్ద గొడవ సృష్టించిన వారిపై ఫిల్మ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. షేక్‌పేటలోని జి.నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ (ఫర్ ఉమెన్) కళాశాల గేటు వద్ద ఈ నెల 26న విజేంద్ర, ప్రశాంత్ అనే వ్యక్తులు మరికొందరితో కలిసి గొడవ సృష్టించారు. ప్రిన్సిపల్‌ను కలవాలంటూ గేటులోకి అక్రమంగా ప్రవేశించడంతో సిబ్బంది వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో వారు కేకలు వేస్తూ కళాశాల సిబ్బందిని దుర్భాషలాడారు. ఇక్కడి సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి గొడవకు దిగిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ కె.రమేష్‌రెడ్డి, క్యాంపస్ మేనేజర్‌లు ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చిన్నారి మృతి

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: మంచంపై ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ కిందపడిన చిన్నారి తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన బోరబండ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్పీఆర్‌హిల్స్ ఆశయ్యనగర్ ప్రాంతానికి చెందిన మూడేళ్ల చిన్నారి హాసిని ఈనెల 19న మంచంపై ఆడుకుంటూ కిందపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యం కోసం నిలోఫర్ ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో సేవలు మరింత విస్తృతం చేస్తాం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లో రోటరీ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేస్తామని రోటరీ క్లబ్ కాబోయే అధ్యక్షుడు మారియో సీజర్ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్లో జరుగుతున్న సౌత్‌జోన్ రోటరీ సమావేశాల ముగింపు సందర్భంగా ఆదివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. నాలుగు దేశాలతోపాటు అయిదు రాష్ట్రాల నుంచి రోటరీ క్లబ్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మరియో సీజర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అనేక పాఠశాలలను దత్తత తీసుకుని, వాటిలో సదుపాయాలు కల్పించామన్నారు. పేదలకు వైద్యాన్ని అందించేందుకు ప్రయత్నించామన్నారు. ఉత్తమ సేవలు అందించిన రోటేరియన్లకు ప్రోత్సాహక బహుమతులను అందించారు. హైదరాబాద్ ఈస్ట్ క్లబ్ అధ్యక్షుడు తలశిల మల్లికార్జున నరసయ్య చౌదరి (టీఎంఎన్ చౌదరి)తోపాటు పలువురు అవార్డులు అందుకున్నారు. సదస్సు కార్యనిర్వాహక ఛైర్మన్ డాక్టర్ చిలుకూరు శరత్ బాబు, రోటరీ జిల్లా 3150 గవర్నర్ కాట్రగడ్డ శరత్‌చౌదరి, రోటరీ నాయకులు దీపక్ పురోహిత్, డైరెక్టర్లు రాజు సుబ్రమణ్యన్, అనిరుధ్ రాయ్ చౌదరి, డైరెక్టర్ ఎలక్ట్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

మారియో సీజర్ నుంచి అవార్డు అందుకుంటున్న టీఎంఎన్ చౌదరి

మంత్రివర్గంలో బంజారాలకు స్థానం కల్పించాలి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గంలో బంజారాలకు స్థానం కల్పించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ప్రభుత్వాన్ని కోరింది. తెలంగాణలో 40 లక్షలకు పైగా జనాభా ఉన్న బంజారాలకు మంత్రి వర్గంలో స్థానం లేకపోవడం బాధాకరమని అభిప్రాయపడింది. ఆదివారం మింట్ కాంపౌండ్‌లోని గిరిజన విద్యుత్తు భవన్‌లో సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ రామచంద్ర నాయక్ ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు పూర్తి స్థాయిలో పని చేసిన లంబాడలను విస్మరించడం సరికాదన్నారు. వెంటనే మంత్రి పదవి కేటాయించాలని సీఎంను కోరారు. లంబాడాలు వాడే గోర్బోలి భాషకు అధికార హోదా కల్పించి రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర శాసన సభలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీలకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తిచేశారు. సంఘం సహ అధ్యక్షుడు మోహన్ సింగ్ నాయక్, ముఖ్య నేతలు పాండురంగ నాయక్, శ్యాంనాయక్, కిషన్ నాయక్, రాంబాబు నాయక్ తదితరులు మాట్లాడగా.. కార్యక్రమంలో సంఘం కార్యవర్గం, వివిధ గిరిజన సంఘాల నాయకులు, జిల్లాల అధ్యక్షులు పల్గొన్నారు.

అభివాదం చేస్తున్న సంఘం రాష్ట్ర కార్యవర్గం, జిల్లాల అధ్యక్షులు

సాహిత్య బంధంతో సమాజంలో గౌరవం

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ఎంత కవిత్వం రాసిన గొప్ప కవి అనిపించుకోవచ్చు గానీ, మంచి మనిషి కావడం ఎంతో కష్టం అని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎన్ గోపి అన్నారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్ర భారతి సమావేశ మందిరంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో కుడికాల వంశీధర్ రచించిన 'లోపలి వాన' కవితా సంపుటి గ్రంథావిష్కరణ సభ జరిగింది. ఓయూ తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రఘు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథి సహ ఆవిష్కర్త ఆచార్య ఎన్ గోపి మాట్లాడుతూ.. కవిత్వం అంటే రమణీయంగా కమనీయంగా మనసులోని భావాలను అక్షరీకరించే ప్రక్రియ అని అన్నారు. ధనవంతుడికి ధన బలం ఉండవచ్చు కానీ సాహిత్యంతో సంబంధం వల్ల సమాజంలో బోలెడంత గౌరవం లభిస్తుందన్నారు. కవి డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన, సికింద్రాబాద్ పీజీ కళాశాల ఆచార్యులు డాక్టర్ ఆదినారాయణలు రచయితను అభినందించారు.

లోపలి వాన కవితాసంపుటి ఆవిష్కరిస్తున్న ఆచార్య ఎన్ గోపి, ఇతర అతిథులు

(c) eenadu

కూకట్‌పల్లి

జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కూకట్‌పల్లి జోన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడి కల్యాణ్ క్రికెట్ మైదానంలో పోటీలు నిర్వహించారు. అండర్-14 విభాగంలో జరిగిన ఈ పోటీల్లో గెలుపొందిన వారు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఫెడరేషన్ జోన్ కార్యదర్శి బి.యాదయ్య తెలిపారు. గెలుపొందిన వారికి ట్రోఫీ, పతకాలు అందజేశారు.

సామాజిక మాధ్యమాలు వదిలి ఆటలు ఆడండి

బహుమతి ప్రదానం చేస్తున్న కశ్యప్

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాలు వదిలి ఆటలు ఆడాలని బ్యాడ్మింటన్ ఆటగాడు పారుపల్లి కశ్యప్ పిలుపునిచ్చారు. ఆదివారం కేపీహెచ్‌బీ ఒకటో రోడ్డులోని క్రీడా సముదాయంలో హ్యామ్‌స్టెక్ కాలేజీ ఆఫ్ క్రియేటివ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కశ్యప్ మాట్లాడుతూ.. క్రీడలతో పోటీతత్వం పెంపొందుతుందన్నారు. వివిధ క్రీడల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశాడు. సంస్థ సీఈవో అజిత్‌రెడ్డి తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

సిబ్బందికి వైద్యపరీక్షలు నేటి నుంచి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోన్ పరిధి ఐదు సర్కిళ్లలో పనిచేసే పారిశుద్ధ్య, ఎంటమాలజీ సిబ్బందికి సోమవారం నుంచి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు జడ్సీ అపూర్వ్ చౌహాన్ తెలిపారు. సిబ్బంది ఆరోగ్యంగా ఉంటే జోన్ పరిధిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. మొత్తం 3,200 మంది కార్మికులకు రోజుకో ప్రాంతంలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈఎస్ఐ వైద్యులు కార్మికులను పరీక్షించి మందులు పంపిణీ చేస్తారన్నారు. మొదటిరోజు హైదర్‌నగర్, వివేకానందనగర్ కాలనీ, ఆల్విన్‌కాలనీ డివిజన్ల పరిధిలోని కార్మికులకు హెచ్‌ఎంటీ శాతవాహనగర్ సామాజిక భవనంలో ఉదయం 11గంటలకు శిబిరం ఉంటుందన్నారు.

జమ్మి మొక్కల పంపిణీ నేడు

బాలానగర్: దసరా పండగను పురస్కరించుకొని ఆలయాల నిర్వాహకులకు సోమవారం జమ్మి మొక్కలు పంపిణీ చేయనున్నట్లు పర్యావరణవేత్త ఈ.బి.సుధాకర్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి బాలానగర్ ఫుల్‌బాగ్‌కాలనీ పోచమ్మ దేవాలయం వద్ద పంపిణీ ఉంటుందన్నారు.

ప్రజావాణి కార్యక్రమం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోన్, మూసాపేట, కూకట్‌పల్లి సర్కిళ్ల కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు.

విద్యుత్తు ఉండని ప్రాంతాలు

బాలానగర్, న్యూస్‌టుడే: సమయం: ఉదయం 10గంటల నుంచి 11.30వరకు.

ప్రాంతాలు: బాలానగర్ టెక్నో ఇండస్ట్రీస్, వాషింగ్ సెంటర్, సత్య ఇంజినీరింగ్, శ్రీబాలాజీ పౌడర్.

సమయం: మధ్యాహ్నం 12నుంచి 2గంటల వరకు.

ప్రాంతాలు: శ్రీరామ, ఉషా కంపెనీ, డీలక్స్ పెయింట్, బాలానగర్ సీఐఈ, ఇండస్ట్రియల్ ఏరియా, ఎంఎస్ఎంఈ, చిత్తారమ్మ డబుల్‌బెడ్‌రూం సముదాయం.

సమయం: సాయంత్రం 3గంటల నుంచి 4.30వరకు.

ప్రాంతాలు: టిబ్‌కాన్, ఎకో ప్యానల్స్, ఆంధ్రా ఇండస్ట్రీ.

బతుకమ్మ సంబరం.. నేడు ప్రారంభం

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే

కూకట్‌పల్లిలో వేడుకలు ప్రత్యేకం

రంగధాముని చెరువులో నిమజ్జన ప్రాంతాన్ని పర్యవేక్షిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

బతుకమ్మ సంబరం.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ పండగ కోసం మహిళలు ఇష్టంగా అమ్మవారిని కొలిచి.. ప్రత్యేక నైవేద్యాలు సమర్పించడం విశేషం. కూకట్‌పల్లిలో ఈ పండగ ప్రత్యేకమని చెప్పాలి. ప్రతి ప్రాంతంలో ఉత్సవాల మొదటి.. ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించడం చూస్తుంటాం. కానీ, ఇక్కడ ఒక రోజు ముందే సంబరాలు మొదలవ్వడం ఆనవాయితీ. ఈసారి రెండు రోజుల ముందే పండగకు మహిళలు సిద్ధమవుతున్నారు.

ఈసారి రెండు రోజుల ముందే

కూకట్‌పల్లి గ్రామంలో బతుకమ్మ సంబరాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఉత్సవ కమిటీ సభ్యులు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పండగ వచ్చేనెల 2న ప్రారంభమవుతుంది. కూకట్‌పల్లిలో మాత్రం అమావాస్యకు ముందురోజు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈసారి 1న మంగళవారం రావడంతో ఆ రోజు బొడ్డెమ్మలను విడిచే సంప్రదాయానికి గ్రామ ప్రజలు వ్యతిరేకం. దీంతో రెండు రోజుల ముందే వేడుకలకు శ్రీకారం చుట్టనున్నారు. సోమవారం సాయంత్రం వేడుకలు మొదలవుతాయని, ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చెప్పారు. మహిళలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా విద్యుత్ దీపాలు.. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

గతేడాది బతుకమ్మ సంబరాలు

10 రోజులు.. నిరంతరాయంగా వేడుకలు

వాస్తవంగా వేడుకలు 30న మొదలై.. అక్టోబర్ 10న ముగియనున్నాయి. మొత్తం 11రోజుల్లో సహజంగా అన్ని ప్రాంతాల్లో మొదటి రోజు, చివరిరోజు వేడుకలు వైభవోపేతంగా జరగడం చూస్తుంటాం. కూకట్‌పల్లిలో మొదటి రోజు నుంచి చివరిరోజు వరకు మధ్యలో బతుకమ్మ అలిగి వెళ్లిన రోజు(అక్టోబర్ 9న) మినహా మిగతా అన్ని రోజుల్లో నిరంతరాయంగా కొనసాగుతాయి. 10రోజుల పాటు కూకట్‌పల్లి గ్రామం శోభాయమానంగా కనిపిస్తుంది. హనుమాన్ దేవాలయం పక్కన మైదానంలో సాయంత్రం వేడుకలు మొదలుకానున్నట్లు ఉత్సవ సమితి ప్రతినిధి కంచనపల్లి నాగరాజు తెలిపారు. మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి హనుమాన్ దేవాయం వద్ద ఆడి, పాడతారు. అనంతరం ప్రదర్శనగా జాతీయ రహదారి దాటి అవతలి వైపు ఉన్న పీఎస్ఎం ఉన్నత పాఠశాల అవరణలో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మరోసారి ఆట, పాటలతో అలరిస్తారు. చివరగా రంగధాముని చెరువులో నిమజ్జనం చేసి నైవేద్యాన్ని ఆరగిస్తారు. ఇలా రోజుకో నైవేద్యంతో వేడుకలు జరుపుకోవడం విశేషం. చివరిరోజు వేడుకలు ఎమ్మెల్యే కృష్ణారావు నేతృత్వంలో రంగధాముని చెరువు కట్టపై నిర్వహించనున్నట్లు నాగరాజు వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలాజీనగర్: 8008573418

కేపీహెచ్‌బీకాలనీ:8008573195, మూసాపేట:8008573423, అల్లాపూర్:9491124918

రోడ్డు నిర్మాణం.. సాఫీగా రాకపోకలు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ఫతేనగర్ డివిజన్ పరిధి ఎల్‌బీఎస్‌నగర్ నుంచి ఇందిరాగాంధీపురానికి వెళ్లే రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. రోడ్డు నిర్మాణంలో జాప్యంతో రాకపోకలకు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. ఈ విషయాన్ని మూసాపేట సర్కిల్ అధికారుల దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా రూ.15లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తిచేసి సమస్యను పరిష్కరించి రాకపోకలు పునరుద్ధరించారు.

కొమ్మల తొలగింపు

కేపీహెచ్‌బీకాలనీ: అయిదో రోడ్డులో విరిగిన చెట్టుకొమ్మలను జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగించారు. కొమ్మలు దారికి అడ్డంగా ఉండటంతో వాహనదారుల రాకపోకలకు విఘాతం కలుగుతోంది. స్థానికులు 'ఈనాడు'కు ఫిర్యాదు చేయగా ఇదే విషయాన్ని ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ పద్మనాభం దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బందిని పంపి కొమ్మలు తీయించారు.

గ్లామన్ మిసెస్ ఇండియాగా హేమలతారెడ్డి

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: టీవీ జర్నలిస్టు, వ్యాఖ్యాత, 'నిన్ను చూస్తే' చిత్ర నటి హేమలతా రెడ్డికి గ్లామన్ మిసెస్ ఇండియా-2024 అవార్డు దక్కింది. మలేషియాలో జరిగిన మిసెస్ ఇండియా 2024 కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును అందుకోవటంతోపాటు ఉత్తమ టాలెంట్, ఫొటోజెనిక్ విభాగాల్లోనూ విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె జూబ్లీహిల్స్‌లో మీడియాతో మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం జరిగిన వేడుకల్లో ఈ అవార్డును అందుకున్నట్లు చెప్పారు. అందాల పోటీల రంగంలో తెలుగువారు చాలా తక్కువగా ఉంటారని, అలాంటిది తనకు ఈ అవార్డులు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న కాలనీవాసులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: హడావుడిగా నిర్మించి చేతులు దులుపేసుకుందామనుకున్న గుత్తేదారు ఆలోచనను కాలనీవాసులు తిప్పికొట్టారు. కూకట్‌పల్లి డివిజన్ విజ్ఞాన్‌పురికాలనీలో ఖాజాకుంట ఆనుకొని కొంతమేర రోడ్డు నిర్మాణం చాలాకాలంగా పెండింగులో ఉంది. దీన్ని నిర్మించేందుకు ఇటీవల కూకట్‌పల్లి సర్కిల్ అధికారులు ఆమోదం తీసుకున్నారు. వారం క్రితం గుత్తేదారు రోడ్డు తవ్వి.. వెట్‌మిక్స్ సిద్ధం చేశాడు. ఇప్పటికే ఈ రోడ్డు నుంచి భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ ఖాజాకుంటలోకి వేశారు. కుంటవైపు పైప్‌లైన్‌లో పల్లంగా ఉండేలా చర్యలు తీసుకొని మురుగంతా కుంటలోని ఎస్‌టీపీలోకి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. కాగా రోడ్డు మాత్రం కుంటలోకి కాకుండా.. కాలనీలోకి పల్లంగా నిర్మించాలని పక్కనే ఉన్న బహుళ అంతస్తు భవనం నివాసితులు పట్టుపట్టారు. దీంతో కాలనీలోకి వర్షపు నీరు చేరి రోడ్లన్నీ ముంపునకు గురవుతాయని కాలనీవాసులు అడ్డుకున్నారు. డ్రైనేజీ పైప్‌లైన్ స్లోప్ ఉన్న వైపే రోడ్డు స్లోప్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. గుత్తేదారు లెక్క చేయకుండా ఆదివారం హడావుడిగా కాలనీలోకి పల్లం(స్లోప్) పెడుతూ పనులు చేపట్టాడు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు ఈ విషయాన్ని 'ఈనాడు' కూకట్‌పల్లి సర్కిల్ ఈఈ గోవర్ధన్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా తాత్కాలికంగా పనులు నిలిపేయాలని, తాను సోమవారం పరిశీలించిన తర్వాతనే నిర్మాణం చేయాలని గుత్తేదారును ఆదేశించడంతో గొడవ సద్దుమణిగింది.

విజ్ఞాన్‌పురికాలనీలో తవ్విన రోడ్డు

వెట్‌మిక్స్ గుట్ట

వైద్య శిబిరానికి స్పందన

సమతానగర్‌లోని వైద్య శిబిరంలో వైద్యులు, కాలనీవాసులు

బాలానగర్, న్యూస్‌టుడే: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధి సమతానగర్ సామాజిక భవనంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనూష డెంటల్ ఆసుపత్రి, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 100మందికి బీపీ, షుగర్, దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లోహిదాస్, కార్యదర్శి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి నుంచి హన్మకొండకు ఆర్టీసీ బస్సు

మూసాపేట, న్యూస్‌టుడే: ఐటీ ఉద్యోగుల కోసం గచ్చిబౌలి నుంచి హన్మకొండకు ప్రతి సోమవారం ఇంద్ర బస్సు సర్వీసును ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చింది. ఉదయం 5 గంటలకు హన్మకొండలో బయలుదేరి ఉప్పల్, జూబ్లీ బస్‌స్టేషన్, కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ, హైటెక్‌సిటీ మీదుగా గచ్చిబౌలికి చేరుకుంటుంది. తిరిగి గచ్చిబౌలి నుంచి ఉదయం 10.30 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గం మీదుగానే హన్మకొండకు చేరుకుంటుంది. ఈ సర్వీసును ప్రజలు వినియోగించుకోవాలని కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోమేనేజర్ శ్రీహరి తెలిపారు.

రంగస్థలానికి ఖాదర్ అలీ బేగ్ సేవలు చిరస్మరణీయం: గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

రాయదుర్గం, న్యూస్‌టుడే: హైదరాబాద్ నగర రంగస్థల వైభవాన్ని ప్రపంచానికి చాటిన కళాకారుడు ఖాదర్ అలీ బేగ్ అని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. మాదాపూర్ హెచ్ఐసీసీలో ఆదివారం రాత్రి నాటక రంగ ప్రముఖుడు, దివంగత ఖాదర్ అలీ బేగ్ 40వ స్మారక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ..40 ఏళ్లైనా ఖాదర్ అలీ బేగ్ నగరవాసులు స్మరించుకుంటున్నారంటే ఆయన నాటక రంగంలో ఎంతలా ముద్రవేశారో అర్థం చేసుకోవచ్చన్నారు. సంప్రదాయ కుటుంబానికి చెందిన ఆయన కట్టుబాట్ల నుంచి బయటపడి నాటక, సాహిత్య రంగంలోకి ప్రవేశించి వన్నె తెచ్చారని కొనియాడారు. ఇకపై ఆయన నాటకాలు వీక్షిస్తానని, ప్రభుత్వం తరఫున నాటక రంగానికి సహకారం అందేలా చూస్తానని చెప్పారు. ఖాదర్ అలీ బేగ్ కోడలు నూర్‌బేగ్ రాసిన 'సన్ సెట్ సన్ రైజ్' నాటకాన్ని ప్రదర్శించగా గవర్నర్ ఆసక్తిగా తిలకించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నతి కోసం దేశాలకు పంపించి వారు తిరిగి రాకపోవడంతో తమ త్యాగాలను వారు గుర్తించలేక పోతున్నారని బాధపడతారు. పిల్లలు తమ తల్లిదండ్రుల కలల సాకారానికి త్యాగం చేశామని భావిస్తారు.. ఇద్దరి మధ్య సాగే సంఘర్షణను ఈ నాటకం కళ్లకు కట్టింది. కార్యక్రమానికి ఐటీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, పర్యాటక శాఖ కార్యదర్శి వాణిప్రసాద్, విశ్రాంత ఐఏఎస్ అధికారులు బీపీ ఆచార్య, అజయ్‌మిశ్రా, ఎస్‌కే జోషి, అరవింద్‌కుమార్, ఖాదర్ అలీ బేగ్ కుమారుడు పద్మశ్రీ మహమ్మద్ అలీ బేగ్, సినీ దర్శకుడు నీలకంఠ తదితరులు హాజరయ్యారు.

మద్యం మత్తులో ఢీ.. ఆరేళ్ల పాపకు గాయాలు

మూసాపేట, న్యూస్‌టుడే: అర్ధరాత్రి మద్యం మత్తులో అతివేగంగా కారును నడిపి ముందు వెళ్తున్న మరో కారును ఢీకొట్టిన ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై దీక్షిత తెలిపిన ప్రకారం.. కూకట్‌పల్లి కమలప్రసన్నానగర్‌కు చెందిన ఎస్.రుగ్వేద్ అనే ప్రైవేటు ఉద్యోగి కుటుంబంతో సహా కారులో వరంగల్ నుంచి బయలుదేరి ఇంటికి వస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి వివేకానందనగర్‌లోని అభిరుచి టిఫిన్స్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు వీరిని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రుగ్వేద్ కారు ధ్వంసమైంది. కారులో ఉన్న ఆరేళ్ల చిన్నారి తలకు స్వల్ప గాయాలయ్యాయి. కారు యజమాని ఆనంద్‌ను స్థానికులు పట్టుకున్నారు. అతను మద్యం మత్తులో ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'బాపుబాటలో.. సత్యశోధన' పాదయాత్ర 2 నుంచి

గోడపత్రిక ఆవిష్కరించిన డా.కె.వి.రమణాచారి, చిత్రంలో బడేసాబ్, శివార్చక విజయకుమార్, గంటా మనోహర్‌రెడ్డి, అబ్దుల్ రజాక్ తదితరులు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో పిల్లల భవిత కోసం విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి డా.శివార్చక విజయకుమార్ సారథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వంద రోజులు, వెయ్యి కిలోమీటర్లు 'బాపుబాటలో.. సత్యశోధన పాదయాత్ర' కొనసాగనుంది. అక్టోబరు 2న జోగులాంబ జిల్లా, ఆలంపూర్ జోగులాంబ దేవాలయం నుంచి మొదలయ్యే ఈ పాదయాత్ర 2025 జనవరి 12 నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని ఉమామహేశ్వర దేవాలయంలో ముగియనుంది. ఆదివారం నగరంలోని రెడ్‌హిల్స్‌లోని డా.కె.వి.రమణాచారి క్యాంపు కార్యాలయంలో పాదయాత్ర గోడపత్రికను ప్రభుత్వ మాజీ సలహాదారు డా.కె.వి.రమణాచారి ఆవిష్కరించి మాట్లాడుతూ.. గాంధీజీ మార్గంలో నడవటమే కాదు.. పది మందికి మార్గదర్శకంగా ఉండాలని విజయకుమార్ 67వ ఏటా పాదయాత్రకు సంకల్పించడం గొప్ప విషయమన్నారు. ఆయనతో కలిసి రోజుకు కనీసం ఒకటి, రెండు కిలోమీటర్లు పిల్లలు నడవాలని సూచించారు. విజయకుమార్ మాట్లాడుతూ.. గాంధీజీ ఆలోచనలు, ఆశయాలు, జీవన విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో పాదయాత్ర చేపడుతున్నట్లు వివరించారు. సాహితీవేత్తలు గంటా మనోహర్‌రెడ్డి, పి.బడేసాబ్, ప్రభాకర్‌రెడ్డి, అబ్దుల్ రజాక్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

తితిదే లడ్డూ అపవిత్రతపై శాంతిర్యాలీ

ఫతేనగర్ రోడ్డులో హిందూ ఐకాస సభ్యులు

ఫతేనగర్, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి ప్రసాదం లడ్డూని కల్తీ నెయ్యితో తయారుచేస్తూ అపవిత్రం చేశారని నిరసనగా ఫతేనగర్ హిందూ ఐకాస ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. పైప్‌లైన్ రోడ్డులో మొదలైన ర్యాలీ నేతాజీకాలనీ రామాలయం వరకు కొనసాగింది. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఐకాస నేతలు హరిప్రసాద్, శ్రీనివాస్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

విభాగిని ధ్వంసం.. పొంచి ఉన్న ప్రమాదం

జేఎన్‌టీయూ రోడ్డులో యూటర్న్ ఏర్పాటుకు తవ్విన విభాగినిని పునరుద్ధరించడంలో అధికారుల తాత్సారంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ఐసీఐసీఐ బ్యాంకు యూటర్న్-రైతుబజారు మధ్యలో ట్రాఫిక్ పోలీసులు ఇటీవల మరో యూటర్న్ ఏర్పాటుచేశారు. ఇందుకు విభాగిని తవ్వించారు. రహదారైతే పునరుద్ధరించారు కానీ.. విభాగినిని వదిలేశారు. చెల్లాచెదురుగా ఉన్న బండరాళ్లు, మట్టి వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. విభాగినిపై ఏర్పాటుచేసిన రెయిలింగ్ సైతం కింద పడేలా ఉంది.

– న్యూస్‌టుడే, కేపీహెచ్‌బీకాలనీ

ఈ క్యాచ్‌పిట్ దుస్థితి మారేదెన్నడో?

కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని ఎంఐజీ నివాసాల సముదాయాలకు ఆనుకుని కేపీహెచ్‌బీ ఒకటో రోడ్డు మలుపులో క్యాచ్‌పిట్ దుస్థితి ఇప్పట్లో మారేలా లేదు. రహదారి అభివృద్ధి చేయక ముందున్న దుస్థితి.. అభివద్ధి చేసిన తర్వాత కూడా అలానే ఉంది. వరద క్యాచ్‌పిట్‌లోకి మళ్లే వీల్లేదు. రహదారిపైనే నిలిచిపోవడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు.

- న్యూస్‌టుడే, కేపీహెచ్‌బీకాలనీ

వరద పారదు.. దారులు మారవు

ఫోకస్

కేపీహెచ్‌బీ రాజీవ్ రోటరీ దాటి మాల్ ప్రవేశం ఎదుట

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: నీరు నిలిచే ప్రదేశాలను అధికారులు తేలిగ్గా తీసుకోవడంతో రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. ఏళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. ఫిర్యాదులందితే మాత్రం అధికారులు ఏమంత పెద్ద సమస్య కాదండి అని తేలిగ్గా కొట్టిపారేయడంతో కాలనీవాసుల్లో అసహనం పెరుగుతోంది. వరద నిలిచే రహదారులు ప్రధానమైనవి కావడంతో కాలనీలవాసులు, వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. మలుపులు కావడం ఇంకా సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. వరద పారేందుకు నాలాలు, బాక్స్ డ్రెయిన్లు ఉన్నా రహదారులపై నిలిచిపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. వర్షం సమయంలో ఆయా చోట్ల క్యాచ్‌పిట్లల్లోకి మళ్లిస్తున్నా వరద పలు చోట్ల రహదారులపై నిలిచిపోతోంది.

ఇందూ విల్లాస్ దాటి సిగ్నల్‌కి ముందు ..

వన్‌సిటీ గేటెడ్ కమ్యూనిటీ ప్రవేశం ముందు

కాలనీల్లో.. నరాని ఆహ్లాదం

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే

కేపీహెచ్‌బీ డివిజన్ గోపాల్‌నగర్‌లో లేకుండాపోయింది. ఆహ్లాదం కోసం కాలనీవాసులు చేయని ప్రయత్నం లేదు. ఒక ప్రాంతానికి గుడి, బడి, పార్కు, ఆట స్థలం.. ఇలా 10శాతం స్థలం కేటాయించాల్సి ఉంటుంది. ఇక్కడ ఆహ్లాదానికి అంగుళం కూడా వదలకుండా భూమిని భూబకాసురులు కాజేశారనే ఆరోపణలు విదితమే. వందల అపార్ట్‌మెంట్‌లు, వేల కుటుంబాలున్న గోపాల్‌నగర్‌ను వెనకపడేశారు. చక్కటి రహదారుల డిజైన్, బహుళ అంతస్తుల భవనాలు, పచ్చదనంతో కళకళలాడుతుండగా పార్కులు, గుడి, సమావేశ మందిరాలు, ఆట స్థలాలు.. ఇలా ఉల్లాసంగా ఉత్సాహంగా సేదతీరేందుకు కనీస వసతుల్లేవు.

మరో కాలనీకి వెళ్తే చుక్కెదురు

కేపీహెచ్‌బీ ఫేజ్ 1, 2, 3లో ప్రతి 100 ఇళ్లకు ఒక పార్కు ఉండగా.. గోపాల్‌నగర్‌లో ఒక్కటి కూడా లేకపోవడం గమనార్హం. పార్కు కోసమని మరో కాలనీకి వెళ్తే రానివ్వని పరిస్థితి. గుడికని మరో కాలనీకి వెళ్తే అక్కడ స్థానికులకే మొదటి ప్రాధాన్యమివ్వడంపై నివాసితులు ఆవేదన చెందుతున్నారు. సమావేశ మందిరం లేదు. కాలనీ సమావేశాలకే స్థలం లీజుకు తీసుకొని నిర్వహించుకోవాల్సిన దుస్థితి. ఆగస్టు 15, జనవరి 26తో పాటు పలు సందర్భాల్లో జెండా వందనం రోడ్డుమీదే చేసుకోవాల్సిన పరిస్థితి.

వసతులు కల్పించకపోవడంపై సందేహాలు

పన్నులు కడుతున్నాం.. ఇళ్ల యజమానులుగా పిల్లల ఆటపాటలకు వసతులు కల్పించాలని జీహెచ్‌ఎంసీకి పలుమార్లు విన్నవించుకున్నామని కాలనీవాసులు గోడువెళ్లబోసుకున్నారు. పార్కు స్థలాలను కబ్జా చేసి బోర్డులు పాతినా అధికారుల్లో చలనం లేదని మండిపడుతున్నారు. వాస్తవానికి అభివృద్ధి చెందుతున్న కాలనీల్లో వసతులపై దృష్టి సారించే జీహెచ్‌ఎంసీ ఈ కాలనీపై శీతకన్ను వేయడంపై పలు సందేహాలను రేకెత్తిస్తోంది. పదేళ్లలో వసతులు కల్పించకపోవడమే ఇందుకు నిదర్శనం. అన్ని విభాగాల అధికారులకు వినతి పత్రాలిచ్చి నీరసించిన కాలనీవాసులు.. హైడ్రాకు వినతి పత్రం అందజేయడంతోనైనా పార్కులు చూస్తామన్న ఆలోచన, ఆశతో ఉన్నారు.

WELCOME TO GOPAL NAGAR

గోపాల్‌నగర్ కమాన్

ఏరియల్ వ్యూలో గోపాల్‌నగర్

గోపాల్‌నగర్‌లో అన్యాక్రాంతమైన పార్కు స్థలాలు

ఏం చేయాలో తెలియని పరిస్థితి

గృహప్రవేశం తర్వాత కాలనీలో పార్కు లేదని తెలిసింది. పిల్లలను పక్క కాలనీల్లోని పార్కుల్లో ఆడిస్తున్నాను. వినాయక చవితికి చందాలు వేసుకున్నంత సులభంగా పార్కును సొంతంగా నిర్మించుకోలేం కదా.

- రాధాకృష్ణ, రోడ్డునంబరు 15బీ

అయోమయంగా ఉంది

గుడి లేదు. కమ్యూనిటీ హాల్ లేదు. అయోమయంగా ఉంది. 2013 నుంచి కాలనీలో ఉంటున్నా ఉల్లాసంగా గడిపేందుకు పార్కుల్లేవు. వాటికి కేటాయించిన 3 స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి.

- సుధీర్, రోడ్డు నంబరు 7బీ

(c) eenadu

కార్మిక, కర్షకుల గళం సీతారాం ఏచూరి

లాలాపేట, న్యూస్‌టుడే: కార్మికులు, కర్షకుల సమస్యలపై నిరంతరం గళమెత్తిన గొప్పనాయకుడు సీతారాం ఏచూరి అని పలువురు వక్తలు కొనియాడారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథి మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ ఆయన నమ్మిన సిద్ధాంతం కోసం పోరాటం చేసిన మహనీయుడని తెలిపారు. ఆయనతో కలిసి ఓయూలో విద్యార్థి సంఘాన్ని ఏర్పాటు చేసుకున్న సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వీరయ్య, ప్రొఫెసర్లు కొండ నాగేశ్వర్, రామ్ షెఫర్డ్, ఆమంచి నాగేశ్వర్ ప్రసంగించారు. ప్రజానాట్య మండలి కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయుధ పోరాట నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ఓయూ కార్యదర్శి రవి నాయక్‌తో పాటు పలువురు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూ కల్తీపై నిరసన

చందానగర్, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీపై చందానగర్ అపర్ణ భక్తి క్లబ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆదివారం అపర్ణ హిల్ పార్క్ కమ్యూనిటీ సభ్యులు కాలనీ నుంచి ప్లకార్డులు పట్టుకొని ర్యాలీగా సాగారు. కమిటీ సభ్యులు దాసరాజు క్రోవి, సుధాకర్ క్రోవి, ఆనంద్, భీమా శ్రీనివాసరావు, రాజీవ్ లాయక్, ధర్మేంద్ర, వినోద్, ఎమ్ వి చంద్రశేఖర రావు పాల్గొన్నారు.

విద్యుత్తు ఉండని ప్రాంతాలు

ఈనాడు, హైదరాబాద్: చెట్ల కొమ్మల కొట్టివేత, మరమ్మతుల నేపథ్యంలో సోమవారం కొండాపూర్ సబ్ డివిజన్ ఫీడర్ల పరిధులలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగనుంది. బొటానికల్ గార్డెన్ పరిధి: ఉదయం11-1: శ్రీరాం నగర్ ఏ బ్లాక్, బి బ్లాక్, మెడిప్లస్ వెనకభాగం, ఏఎంబీమాల్ వెనక, కొత్తగూడ విలేజ్. ప్రభుపాద ఫీడర్: 3-5: ప్రభుపాద టౌన్‌షిప్, మజీద్ బండ, లగ్జర్ అపార్ట్‌మెంట్ ప్రాంతాలు.

పశువుల సంచారం.. ప్రాణ సంకటం

హఫీజ్‌పేట ప్రేమ్‌నగర్ వెనక వైపు ప్రాంతం ప్రధాన రహదారిలో పరిస్థితి ఇది. పగలు రాత్రి వేళల్లో రహదారులపై పశువులు సంచరించడంతోపాటు, రోడ్లపై పడుకుంటున్నాయి. రాత్రుళ్లు గమనించక వెళ్లే వాహనదారులు కిందపడిపోతున్నారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని అనేక ప్రాంతాలలో ఈ పరిస్థితి ఉంది. అధికారులు దృష్టి సారించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

-న్యూస్‌టుడే, శేరిలింగంపల్లి

కొట్టేసిన కొమ్మలతో ట్రాఫిక్ ఇక్కట్లు

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చెట్లను తొలగిస్తున్నారు. ముత్తంగి జాతీయ రహదారికి పక్కనే మసీదు వద్ద రోడ్డు ఇరుకుగా ఉంటుంది. అక్కడే ఉన్న ఓ చెట్టును కొట్టేశారు. కొమ్మలు రోడ్డు పక్కనే పడేశారు. అసలే ఇరుకు దారి కావడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ముత్తంగి అవుటర్ నుంచి గ్రామ మసీదు వరకు వాహనాల ప్రయాణం నిదానంగా సాగుతుంది. కొమ్మలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పటాన్‌చెరు

ప్రమాదం తప్పించండి

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానందనగర్ డివిజన్ చిత్తారమ్మ దేవాలయానికి వెళ్లే మలుపు రోడ్డులో మ్యాన్‌హోల్‌పై మూత లేకుండా ప్రమాదకరంగా మారింది. అక్కడే పెద్దపెద్ద బండలు ఉండటం.. రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేసి, మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

గుంతలమయంగా రోడ్డు

చిత్తారమ్మ దేవాలయానికి వెళ్లే మలుపు రోడ్డులో మూత లేని మ్యాన్‌హోల్

గుంతల చింతలు పట్టవా?

తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి గ్రామం ఔటర్ జంక్షన్ వద్ద ఔటర్ రోడ్డుతోపాటు జాతీయ రహదారిలో గుంతలు పడ్డాయి. ఇక్కడికి వచ్చేసరికి వాహనాలు నెమ్మదించాల్సి వస్తుంది. గుంతలకు ఆనుకుని ట్రాఫిక్ అవుట్ పోస్ట్ ఉన్నా తమకు సంబంధం లేదన్నట్టు వ్యవహరిస్తున్నారు.

- న్యూస్‌టుడే, పటాన్‌చెరు

ముత్తంగి ఔటర్ జంక్షన్ వద్ద గుంత

ముత్తంగి జాతీయ రహదారిపై వర్షపు నీరు

గచ్చిబౌలి - హన్మకొండకు ఆర్టీసీ బస్సు

మూసాపేట, న్యూస్‌టుడే: ఐటీ ఉద్యోగుల కోసం గచ్చిబౌలి నుంచి హన్మకొండకు ప్రతి సోమవారం ఇంద్ర బస్సు సర్వీసును ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చింది. ఉదయం 5 గంటలకు హన్మకొండలో బయలుదేరి ఉప్పల్, జూబ్లీ బస్‌స్టేషన్, కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ, హైటెక్ సిటీ మీదుగా గచ్చిబౌలికి చేరుకుంటుంది. తిరిగి గచ్చిబౌలి నుంచి ఉదయం 10.30 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గం మీదుగానే హన్మకొండకు చేరుకుంటుంది. ఈ సర్వీసును ప్రజలు వినియోగించుకోవాలని కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోమేనేజర్ శ్రీహరి తెలిపారు.

‘బీమాపై 18శాతం జీఎస్టీ దుర్మార్గం’

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్‌పై 18శాతం జీఎస్టీ విధించడంతో వృద్ధులు, సామాన్యులపై పెను భారం పడుతుందని, వెంటనే ఉపసంహరించుకోవాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. పటాన్‌చెరులో ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గించే విధంగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పాటుపడాలన్నారు. కిర్బీ ఐఎన్‌టీయూసీ నాయకులు విజయ్‌జాన్సన్, మహేష్‌కుమార్ గౌడ్, రాజారావు, సుబ్బారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పైసలు రావాలి.. పనులు పరుగు పెట్టాలి

మందకొడిగా అభివృద్ధి కార్యక్రమాలు

నిర్మాణంలో ఉన్న గచ్చిబౌలి పై ఓవర్

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని సర్కిళ్లలో పలు అభివృద్ధి పనులు మందకొడిగా సాగుతున్నాయి. మరికొన్ని కేవలం కాగితాలకే పరిమితమైన పరిస్థితి. మరికొన్నిటికి నిధులు కేటాయింపులు లేక ముందుకు సాగని పరిస్థితి. ఈ క్రమంలో అధికారులు ఆయా అంశాలపై దృష్టి సారించి ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. ప్రధానమైన పనులు సైతం ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదు.

దృష్టి పెట్టాల్సినవి ఇవే..

◆ జోనల్ కార్యాలయం ఎదురుగా రోడ్డు ఏర్పాటు చేసి కొన్నేళ్లు కావొస్తుంది. ఇక్కడి నుంచి చందానగర్ జీఎస్ఎమ్ మాల్ వరకు రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రతిపాదన అనేక ఏళ్లుగా ఉంది. దీని నిర్మాణం విషయంలో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు దృష్టి పెట్టకపోవడంతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ◆ గచ్చిబౌలి ఫ్లైఓవర్ పనులు మందకొడిగా సాగుతున్నాయి. పలు అడ్డంకుల కారణంగా ఈ పరిస్థితి నెలకొంది. ◆ జోనల్ కార్యాలయం, అలిండ్ పరిశ్రమ, నల్లగండ్ల చెరువు పక్క నుంచి నల్లగండ్ల హుడా కాలనీ వరకు రహదారి ఏర్పాటు చేయాలని కొన్నేళ్ల క్రితం నిర్ణయించారు. దీనిపై తదుపరి ప్రక్రియలు ముందుకు సాగడం లేదు.

ప్రత్యామ్నాయానికి సూచన..

◆ లింగంపల్లి అండర్ బ్రిడ్జి కింద వరదనీటితో అల్లాడిపోతున్న క్రమంలో గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలి ఈ ప్రాంతాన్ని రెండు సార్లు పరిశీలించారు. ప్రత్యామ్నాయం కోసం పై వంతెన నిర్మాణానికి కసరత్తు చేయాలని సూచించారు. ఈ విషయంలో అధికారులు వేగంగా పనిచేస్తే కొంత పురోగతి కనిపించే అవకాశముంది.

సమీక్ష అవసరం

ముఖ్యంగా పెండింగ్ పనులు, అలాగే కొన్ని సంవత్సరాల క్రితం తీసుకున్న నిర్ణయాలపై అధికారులు సమీక్ష నిర్వహించి అడ్డంకులను తొలగించి ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.

రద్దీ నివారణ..

◆ లింగంపల్లి అండర్ బ్రిడ్జి దగ్గర వాహనాల రద్దీ నివారించాలంటే పాపిరెడ్డి కాలనీ వైపు చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ పక్కన ఉన్న మట్టి రోడ్డు అభివృద్ధి చేస్తే ఎంతో ప్రయోజనం కలగనుంది. దీని ఏర్పాటు కోసం జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే లింగంపల్లి అండర్ బ్రిడ్జి దగ్గర వాహనాల రద్దీ ఒత్తిడి తగ్గుతుంది. ◆ గుల్ మొహర్ పార్క్ కాలనీ చౌరస్తా విస్తరణకు సంబంధించి అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. విస్తరణకు నిర్ణయాలు తీసుకున్నా పనులు ముందుకు సాగడం లేదు.◆ జోనల్ కార్యాలయం, హెచ్‌సీయూ డిపో ముందున్న మసీదు బండ చౌరస్తా విస్తరణ చాలా అవసరం. ఇది ముందుకు సాగకుండా కొందరు అడ్డంకులు సృష్టిస్తున్న క్రమంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి సమస్యలు పరిష్కరించాలి. ◆ బొటానికల్ గార్డెన్ ఎదురుగా ఫ్రీ లెఫ్ట్ కోసం రోడ్డు విస్తరణ పనులు ఆరంభించారు. ఈ పనులు పూర్తయితే వాహనదారులకు పెద్ద ఊరట లభించనుంది. మసీదు బండ రహదారిలో ఫుట్‌పాత్ ఆక్రమణలు, రోడ్డు విస్తరణ చేయాల్సి ఉంది. ◆ లింక్‌రోడ్డు అయిన మసీద్‌బండ నుంచి పైప్‌లైన్ రోడ్డులో అనేకచోట్ల పెద్దఎత్తున వరద మోకాళ్ల లోతు నిలుస్తున్న పరిస్థితి.

రంగస్థలానికి ఖాదర్ అలీ బేగ్ సేవలు చిరస్మరణీయం



ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

రాయదుర్గం, న్యూస్‌టుడే: హైదరాబాద్ నగర రంగస్థల వైభవాన్ని ప్రపంచానికి చాటిన కళాకారుడు ఖాదర్ అలీ బేగ్ అని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. మాదాపూర్ హెచ్ఐసీసీలో ఆదివారం రాత్రి నాటక రంగ ప్రముఖుడు, దివంగత ఖాదర్ అలీ బేగ్ 40వ స్మారక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ.. 40 ఏళ్లైనా ఖాదర్ అలీ బేగ్ నగరవాసులు స్మరించుకుంటున్నారంటే ఆయన నాటక రంగంలో ఎంతలా ముద్రవేశారో అర్థం చేసుకోవచ్చన్నారు. సంప్రదాయ కుటుంబానికి చెందిన ఆయన కట్టుబాట్ల నుంచి బయటపడి నాటక, సాహిత్య రంగంలోకి ప్రవేశించి వన్నె తెచ్చారని కొనియాడారు. ఇకపై ఆయన నాటకాలు వీక్షిస్తానని, ప్రభుత్వం తరఫున నాటక రంగానికి సహకారం అందేలా చూస్తానని చెప్పారు. ఖాదర్ అలీ బేగ్ కోడలు నూర్‌బేగ్ రాసిన ‘సన్ సెట్ సన్ రైజ్’ నాటకాన్ని ప్రదర్శించగా గవర్నర్ ఆసక్తిగా తిలకించారు. ◆ తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నతి కోసం దేశాలకు పంపించి వారు తిరిగి రాకపోవడంతో తమ త్యాగాలను వారు గుర్తించలేకపోతున్నారని బాధపడతారు. పిల్లలు తమ తల్లిదండ్రుల కలల సాకారానికి త్యాగం చేశామని భావిస్తారు.. ఇద్దరి మధ్య సాగే సంఘర్షణను ఈ నాటకం కళ్లకు కట్టింది. ఐటీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, పర్యాటక శాఖ కార్యదర్శి వాణిప్రసాద్, విశ్రాంత ఐఏఎస్ అధికారులు బీపీ ఆచార్య, అజయ్ మిశ్రా, ఎస్‌కే జోషి, అరవింద్‌కుమార్, ఖాదర్ అలీ బేగ్ కుమారుడు పద్మశ్రీ మహమ్మద్ అలీ బేగ్, సినీ దర్శకుడు నీలకంఠ హాజరయ్యారు.

మేమున్నాం.. మీకు తోడుగా

శేరిలింగంపల్లి: 8008573411 మాదాపూర్: 8008573414
మియాపూర్- 7569067467 ఆల్విన్‌కాలనీ -9154945201
రాయదుర్గం - 9848990352,
పటాన్‌చెరు(రూ) - 8008573228
చందానగర్ - 8008555322

చందానగర్, రామచంద్రాపురం రూరల్, శేరిలింగంపల్లి,న్యూస్‌టుడే:

? దీప్తి శ్రీనగర్, గంగారం ప్రాంతాల మధ్య మై హోమ్ అపార్ట్‌మెంట్స్ వద్ద బస్టాప్ ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది.
– సత్యనారాయణరావు, మై హోమ్ జెవెల్ చందానగర్

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
–మురళీధర్‌రెడ్డి, మేనేజర్, హెచ్‌సీయూ డిపో

? తెల్లాపూర్ పురపాలక పరిధి పాటి చౌరస్తా నుంచి వెలిమెల చౌరస్తా వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.- శ్రీనివాస్, ఘన్‌పూర్

✓సర్వే చేసి వీధి దీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటా.
– సంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ తెల్లాపూర్

? గచ్చిబౌలి పీజేఆర్ నగర్ ప్రాంతంలో వసతి గృహాల్లో ఉంటున్న యువత రాత్రివేళ తాగి మద్యం సీసాలు, వ్యర్థాలు రోడ్డుపై పడేస్తున్నారు.
–మురళీకృష్ణ, గచ్చిబౌలి

✓ క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.
–శ్రీకాంత్‌రెడ్డి, సహాయ వైద్యాధికారి, శేరిలింగంపల్లి సర్కిల్

? కొండాపూర్ మజీద్ బండ ప్రాంతాలలో మ్యాన్‌హోల్స్ మూతలు దెబ్బతిన్నాయి. –రవీందర్‌రెడ్డి, కొండాపూర్

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాము. జలమండలి అధికారులు పరిష్కరించాల్సిన మ్యాన్‌హోల్స్ అంశాన్ని వారి దృష్టికి తీసుకెళ్తాము.
–ప్రసాద్, ఈఈ, శేరిలింగంపల్లి సర్కిల్

పటాన్‌చెరు, పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే:

? అమీన్‌పూర్ పురపాలక పరిధి నవ్య చౌరస్తా నుంచి గ్రామం వైపున్న రోడ్డులో మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి నీరు లీకవుతుంది. రోడ్డు పాడవుతుంది. – జ్ఞానేశ్వర్, పటేల్‌గూడ

✓ మరమ్మతులు చేయిస్తాం. – శ్రీనివాస్, జలమండలి, ఏఈ, అమీన్‌పూర్

? పటాన్‌చెరు పట్టణంలో మైనర్లు వాహనాలు నడపుతున్నారు.
–ప్రదీప్, పటాన్‌చెరు

✓ మైనర్లు వాహనాలు నడపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి మళ్లీ వాహనాలు నడపకుండా సూచిస్తాం. మరోసారి ఇదే విధంగా జరిగితే చర్యలు తీసుకుంటాం. – పవన్, ట్రాఫిక్ ఎస్సై

మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు

స్పందనకు వందనం

ఆల్విన్‌కాలనీ: వివేకానంద నగర్ డివిజన్ మాధవరం కాలనీలోని రోడ్డు నంబర్8,9,10లలో మ్యాన్‌హోళ్లు పగిలి ఇబ్బందికరంగా మారిన విషయాన్ని స్థానికులు ‘మేమున్నాం.. మీకు తోడుగా’ దృష్టికి తీసుకొచ్చారు. విషయాన్ని డివిజన్ పర్యవేక్షణ అధికారి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగ సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

పింక్ పవర్.. అవగాహనతో రొమ్ము క్యాన్సర్ పరార్

గచ్చిబౌలిలో ఆదివారం సుధారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ‘పింక్ పవర్ రన్’ ఉత్సాహంగా సాగింది. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఈ రన్ నిర్వహించారు. – రాయదుర్గం, న్యూస్‌టుడే:

పరుగులో పాల్గొన్న యువతులు

స్వీయచిత్రం తీసుకుంటున్న ఔత్సాహికులు

వేదికపై అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

రన్ ప్రారంభిస్తున్న మంత్రి రాజనరసింహ, మేఘా కృష్ణారెడ్డి

కేరళ, తెలంగాణ మధ్య సారూప్యతలెన్నో: సీతక్క

శేరిలింగంపల్లి: కేరళ, తెలంగాణ మధ్య ఎన్నో సారూప్యతలు ఉన్నాయని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. నల్లగండ్లలో నిర్వహించిన ఓనం వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇతరుల కోసం బతకాలన్న సందేశం ఓనం సొంతమన్నారు. బతుకమ్మలా ఓనం పూల పండగ, సామూహిక వేడుకలకు, ప్రకృతి ఆరాధనకు ప్రసిద్ధి అని చెప్పారు. కేరళ సంప్రదాయ వాయిద్యాలతో నిర్వాహకులు మంత్రి సీతక్కకు ఘనస్వాగతం పలికారు. నల్లగండ్ల మలయాళీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు సాగాయి. అన్విత గ్రూపు సీఎండీ అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న యోగాసనాలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్ కాలనిలోని నిర్మల సదన్ జ్యోతి యోగ మందిర్ ఐదో వార్షికోత్సవం మాధవరం కాలనీ నాగార్జున విద్యాలయంలో ఆదివారం నిర్వహించారు. యోగా గురువులు, చిన్నారులు చేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. యోగా గురువులు మాట్లాడుతూ.. ఉదయపు నడక, యోగా, మెడిటేషన్, వ్యాయామం వంటివి చేయడం ద్వారా ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని తెలిపారు. యోగా గురువులు నరేంద్ర బంధు, వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులున్నారు.

హైడ్రా పేరుతో బెదిరింపు.. కేసు

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: అక్రమంగా నిర్మించిన ఇళ్లను హైడ్రా అధికారులకు చెప్పి కూల్చి వేయిస్తామంటూ ఓ పత్రిక విలేఖరి బెదిరించిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి బీఎస్‌ఆర్ కాలనీలో ఉంటున్న సంతోష్‌నాయక్ అనే వ్యక్తి విలేకరిగా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం మద్యం తాగి ఐలాపూర్ పంచాయతీ కార్యాలయానికి వెళ్లాడు. నిర్మాణాలకు ఇచ్చిన అనుమతుల పత్రాలు ఇవ్వాలంటూ గ్రామ కార్యదర్శి సచిన్‌ను కోరాడు. వివరాలివ్వకపోతే హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసి నిర్మాణాలు కూల్చి వేయిస్తానని చెప్పాడు. ఆ సమయంలో అక్కడికి చేరుకున్న గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్థుడు స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కొట్టారంటూ ఫిర్యాదు..అయితే తాను వివరాలు సేకరిస్తుండగా తనను గ్రామస్థులు స్తంభానికి కట్టేసి కొట్టారని సంతోష్ నాయక్ ముఖీమ్, అజీమ్, స్వామిలపై ఫిర్యాదు చేశారు. 40 మంది గ్రామస్థులు ఏకమై తనను హింసించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసుకున్నారు.

ఆదినారాయణ కుటుంబానికి నేతల పరామర్శ

మియాపూర్: ఇటీవల హఠాన్మరణం చెందిన సీనియర్ పాత్రికేయులు, ఈటీవీ హైదరాబాద్ బ్యూరో చీఫ్ టి.ఆదినారాయణ కుటుంబసభ్యులను ఆదివారం కాంగ్రెస్ ముఖ్య నేతలు పరామర్శించారు. హఫీజ్‌పేట వినాయకనగర్‌లోని ఆయన నివాసానికి చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు పద్మరాజు, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ బాధ్యులు జగదీశ్వర్ గౌడ్ ఆదినారాయణ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కనికిరెడ్డి, స్థానికులు సంజీవరెడ్డి, యాదగిరిగౌడ్, నరేంద్రగౌడ్, సౌందర్యరాజన్, మూర్తి తదితరులున్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి: ఎమ్మెల్యే

నూతన కార్యవర్గ సభ్యులతో ఎమ్మెల్యే గాంధీ

వివేకానందనగర్‌కాలనీ, న్యూస్‌టుడే: కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం హైదర్‌నగర్ డివిజన్ హెచ్ఎంటీ శాతవాహనగర్ రెసిడెంట్స్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు వివేకానందనగర్‌కాలనీలోని ఆయన నివాసంలో కలవగా వారిని అభినందించారు. అధ్యక్షుడిగా రత్నప్రసాద్, ఉపాధ్యక్షుడిగా బాబురావు, ప్రధాన కార్యదర్శిగా యాదిరెడ్డి ఎన్నికయ్యారు.

మియాపూర్: రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే గాంధీ గుత్తేదారులకు సూచించారు. హఫీజ్‌పేట డివిజన్ భాను టౌన్‌షిప్ ప్రాంతంలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులను ఆయన అర్ధరాత్రి స్థానికులతో కలిసి పరిశీలించారు. స్థానికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

స్వచ్ఛంద సంస్థల సహకారంతో చెరువుల శుద్ధి

ఏరివేసిన వ్యర్థాలతో జ్యోతిరెడ్డి తదితరులు

పటాన్‌చెరు: చెరువులకు పూర్వ వైభవం తెచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుందని అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి అన్నారు. ఆదివారం అమీన్‌పూర్ పెద్ద చెరువు పైభాగంలో స్వచ్ఛతాహి సేవ 2024 కార్యక్రమంలో భాగంగా క్లీనప్ డ్రైవ్ అనే సంస్థ వారు చేపట్టిన చెరువు శుద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారితో కలిసి వ్యర్థాలు ఏరివేశారు. ఆమె మాట్లాడుతూ.. పెద్ద చెరువును జీవవైవిధ్య ప్రాంతంగా ప్రకటించారని తెలిపారు. దీన్ని పర్యాటక చెరువుగా తీర్చిదిద్దడానికి వ్యాపార సంస్థల సహకారం తీసుకుంటున్నామని చెప్పారు.

ప్రపంచ చెవిటి అవగాహన దినోత్సవం

చందానగర్: ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ చెవిటి అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. భిక్షపతి ఎన్‌క్లేవ్‌లోని న్యూ గుడ్ షెపర్డ్ బధిరుల పాఠశాలలో స్మిత ఆసుపత్రి వైద్యులు శ్రీధర్ రెడ్డి విద్యార్థులకు చెవి, దంత పరీక్షలు చేశారు. విద్యార్థులకు టూత్ పేస్ట్, బ్రష్ అందజేశారు. అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవ్ పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనంతో వ్యాధులు దూరం

మియాపూర్: ఆరోగ్యకర జీవన విధానంతో వ్యాధులకు దూరంగా ఉండొచ్చని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. నిజాంపేట్ రోడ్ శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్‌లో వరల్డ్ హార్ట్ డే కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. శారీరక శ్రమ, మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలనన్నారు. హాస్పిటల్ ఛైర్మన్ డా.రామచంద్రరావు పాల్గొన్నారు. ◆ హఫీజ్‌పేట డివిజన్ అలీ తలాబ్ చెరువు వద్ద గుర్రపు డెక్క తొలగింపు పనులను కార్పొరేటర్ పరిశీలించారు.

94 కేసులు పరిష్కారం

రామచంద్రాపురం రూరల్: లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గంలో 94 కేసులు పరిష్కారం అయ్యాయని రామచంద్రాపురం సీఐ జగన్నాథ్ చెప్పారు. రోడ్డుప్రమాదాలు, కొట్లాటలు, భార్యాభర్తల వివాదాల కేసులు ఎక్కువగా పరిష్కారం అయ్యాయని వివరించారు. పోలీస్ కేసులు పెట్టినప్పుడు సాధ్యమైనంత వరకు రాజీమార్గం ద్వారా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే సౌలభ్యం ఉందని చెప్పారు.

ఐటీ కారిడార్.. వానతో బేజార్

ఐటీ క్షేత్రంలో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు నిలిచింది.

వైద్యశిబిరానికి స్పందన

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: పటాన్‌చెరు శ్రామికభవన్‌లో ఆదివారం మంజీర విజ్ఞానకేంద్రం, సీఐటీయూల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. స్థానికంగా ఉన్న ఆమేథ ఆసుపత్రి సౌజన్యంతో వైద్యులు దాదాపు 100 మందికి పైగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆసుపత్రి డైరెక్టర్ రాజేంద్ర, ఎంవీకే ఫౌండర్ రాజయ్య, అర్జున్, ధనంజయ్, రాజశేఖర్, చిరంజీవి, వాజిద్‌అలీ, పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: పటాన్‌చెరు పారిశ్రామికవాడలో మౌలికవసతులు మృగ్యంపై ఈనాడులో ‘పర్యవేక్షణ కరవు.. సమస్యలు తీరవు’ అనే శీర్షికన ఇచ్చి కథనానికి టీజీఐఐసీ అధికారులు స్పందించారు. ఫేజ్-1లో మురుగుకాలవలో చెత్తను పారిశుధ్య సిబ్బందితో ఎత్తించారు. పారిశ్రామికవాడలో మరికొన్ని చోట్ల చెత్తను ఎత్తివేసి మౌలిక వసతులపై దృష్టిసారిస్తామని అధికారులు తెలిపారు.

MRCB వారి వార్షికోత్సవ శుభాకాంక్షలు
12 సంవత్సరాలుగా మమ్ములను ఆదరిస్తున్న మా కస్టమర్ దేవుళ్ళకు, మిత్రులకు, మా శ్రేయోభిలాషులకు
MRCB వారి వార్షికోత్సవ శుభాకంక్షలు
శ్రీ డా॥ T. సత్యనారాయణరావు
MRCB ఛైర్మన్
మన నగరం అవార్డు గ్రహీత
గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీత
MRCB®
Veg - Non Veg Supermarket
శ్రీ M. మోహన్‌రావు
MRCB డైరెక్టర్
Beside Rayal Restaurant, Chandanagar, Hyd
Cell: 9697979745

మహిళా మోర్చా అధికార ప్రతినిధిగా సరితారావు

కొంపల్లి (పేట్‌బషీరాబాద్) న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధిగా కొంపల్లికి చెందిన **సరితారావు** నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి నియామకపు ఉత్వర్వులు జారీ చేశారు. సరితారావు గతంలో మేడ్చల్ రూరల్ జిల్లా భాజపా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుతం అర్బన్ జిల్లా ప్రధానకార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో మహిళా మోర్చా బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు. సరితారావును ఆదివారం ఆమె నివాసంలో భాజపా కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కో-కన్వీనర్ పొత్తూరి శివాజీరాజు, మహిళా మోర్చా నాయకురాలు మాధురి అభినందించారు.

కుత్బుల్లాపూర్

గుండెను కాపాడుకోవాలంటూ '5కే రన్'

నిజాంపేట, న్యూస్‌టుడే: ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని బాచుపల్లిలోని ఎస్ఎల్‌జీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం '5కే రన్' నిర్వహించారు. ఈ సందర్భంగా గుండెను కాపాడుకోవాలంటూ నినదించారు. ఆసుపత్రి ఎండీ దండు శివరామరాజు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీవీఎస్ సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

నిజాంపేట, న్యూస్‌టుడే: ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ప్రగతినగర్ అంబీర్ చెరువు వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. యశోదా ఆసుపత్రి, అంబీర్ లేక్ వాకర్స్ అసోసియేషన్, లైఫ్ ఛారిటబుల్ ట్రస్టు సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సాధారణ జబ్బులతో పాటు గుండె, దంత, నేత్ర, చర్మ, ఎముకలు, పిల్లల సంబంధిత పరీక్షలు చేశారు.

షాపూర్‌నగర్: సూరారం డివిజన్ పరిధి శివాలయనగర్‌లో కారుణ్య మల్టీస్పెషాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సాధారణ, మధుమేహం, రక్తపోటు, చిన్నపిల్లల, స్త్రీసంబంధ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

లోక్‌అదాలత్‌లో 1,64,123 కేసుల పరిష్కారం

కాప్రా: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌ను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్‌రావు ప్రారంభించారు. రాజీ చేసుకోదగిన 1.64,123 క్రిమినల్, సివిల్ కేసులను న్యాయమూర్తులు అప్పటికప్పుడే విచారించి పరిష్కరించారు. కక్షిదారులకు రూ.3.90 కోట్ల పరిహారం అందజేసినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి డి.కిరణ్‌కుమార్ తెలిపారు.

సమాజ సేవకు.. మేము సైతం

రక్తదాన శిబిరాలు.. సీజనల్ వ్యాధులపై అవగాహన

దుండిగల్, న్యూస్‌టుడే: నిత్యం పరీక్షలు, ప్రయోగశాలల్లో పరిశోధనలతో నిమగ్నమయ్యే ఇంజినీరింగ్ విద్యార్థులు కాస్త సమయం దొరికితే ఆట, పాటలతో సరదాగా గడుపుతారు. కానీ దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్ఐటీ విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విస్తృతంగా సామాజిక సేవలో పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆరు గ్రామాల దత్తత...

కళాశాలలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) సుమారు 18 ఏళ్ల క్రితం ఏర్పడింది. మొదట 60 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఎన్ఎస్ఎస్‌లో ప్రస్తుతం 800 మంది విద్యార్థులు ఉన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో దుండిగల్, శ్రీరంగవరం, గౌడవెల్లి, రాయిలాపూర్, నూతనకల్, బండ మాదారం గ్రామాలను దత్తత తీసుకున్నారు. ఆయా గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడంతోపాటు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

సేవా కార్యక్రమాలు ఇలా..

- దుండిగల్, గౌడవెల్లి ప్రాథమిక పాఠశాలలకు కంప్యూటర్లు, బెంచీలను అందజేశారు.
- రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో కళాశాలలో రక్తదాన శిబిరాలను కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారు. విద్యార్థులు అధ్యాపకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేస్తున్నారు. 2019లో అత్యధిక రక్తదాన యూనిట్లను సేకరించినందుకు అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా కళాశాల ఛైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి అవార్డు అందుకున్నారు.
- కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మెగా స్టెమ్ సెల్ డోనర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పది వేల స్టెమ్ సెల్ నమూనాలను సేకరించారు. మోస్ట్ ఇన్నోవేటివ్ అవార్డు ఫర్ మెగా స్టెమ్ సెల్ డోనర్ అవార్డును అందుకున్నారు.
- దత్తత గ్రామాల్లో పలువురు రైతులకు టిల్లర్, చెరకు, నూనె యంత్రాలను పంపిణీ చేశారు.
- రహదారి భద్రతపై పలుమార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినందుకుగాను రోడ్డు సేఫ్టీ అవార్డు దక్కింది. 2,500 మందికి శిరస్త్రాణాలను పంపిణీ చేశారు.
- 2021లో జిల్లా స్థాయిలో వైజ్ఞానిక శిబిరం నిర్వహించారు. జిల్లా పరిధిలోని 108 పాఠశాలల విద్యార్థులు నమూనాలను ప్రదర్శించారు.
- కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థిని యశస్విని ఈ సంవత్సరం జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొంది.
- కరోనా సమయంలో ప్రజలకు మాస్కులు పంపిణీ చేయడంతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్మికులకు నిత్యావసర సరకులు అందజేసి.. అన్నదాన శిబిరాలను నిర్వహించారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శిరస్త్రాణాల పంపిణీ

మేమున్నాం.. మీకు తోడుగా..

కుత్బుల్లాపూర్ - 80085 73403, దుండిగల్ - 80085 73410
శాపూర్‌నగర్: 8008573404, పేట్‌బషీరాబాద్: 8008573405
నిజాంపేట: 8008573423, జీడిమెట్ల: 8008574405

షాపూర్‌నగర్, దుండిగల్, న్యూస్‌టుడే:

? సూరారం డివిజన్ పరిధి టీఎస్ఐఐసీ కాలనీ పార్కు సమీపంలోని మసీదు వద్ద చెత్త పేరుకుపోయింది. – **నర్సింహ, సంజయ్ గాంధీనగర్**

✓ సిబ్బందిని పంపించి అక్కడి నుంచి చెత్త తరలిస్తాం. మరోసారి చెత్తవేయకుండా చర్యలు తీసుకుంటాం.
–మమత, జీహెచ్ఎంసీ వైద్యాధికారి

? గాగిల్లాపూర్‌లోని చైతన్య నగర్ రోడ్డు నం.4లో రహదారి అధ్వానంగా ఉంది. గతంలో డ్రైనేజీ నిర్మించి.. రోడ్డు నిర్మించకుండా పురపాలిక అధికారులు వదిలేశారు. **– అజీమ్, స్థానిక నివాసి.**

✓ రోడ్డు నిర్మించి సమస్య పరిష్కరిస్తాం.
–సత్యనారాయణ, కమిషనర్, దుండిగల్ పురపాలిక.

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: గాజులరామారం సర్కిల్ మిథిలానగర్‌లోని నక్షత్రపార్కు పక్కన వ్యర్థాలు పేరుకుపోయాయి. పారిశుద్ధ్య సిబ్బంది వ్యర్థాలను తొలగించకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. అదే ప్రాంతానికి చెందిన యలమంచిలి మోహన్ బాబు సమస్యను ఈ నెల 27న 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన తమ సిబ్బందిచే వ్యర్థాల తొలగింపజేశారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

శ్రీశైలంగౌడ్‌ను సన్మానిస్తున్న బస్తీవాసులు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి సంజయ్‌పురి కాలనీలో రోడ్డు నిర్మాణానికి రూ.72 లక్షలు మంజూరయ్యాయి. స్థానికంగా ప్రధాన రహదారిలో జలమండలి ఆధ్వర్యంలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేశారు. అయితే రోడ్డును తిరిగి నిర్మించకపోవడంతో గుంతలమయంగా మారి రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను సంక్షేమ సంఘం ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీధర్‌బాబు, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి రూ.72 లక్షలు రోడ్డు నిర్మాణానికి మంజూరు చేశారు. దీంతో స్థానికులు ఆదివారం శ్రీశైలంగౌడ్‌ను సన్మానించారు. దామోదర్‌రావు, వెంకటేశ్వరరావు, సత్యగుప్త, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మరమ్మతుల్లో జాప్యం.. స్థానికులకు శాపం

జీడిమెట్ల డివిజన్ పరిధిలోని బ్యాంక్‌కాలనీలో నీటి సరఫరాలో కలుషితాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో జలమండలి అధికారులు కాలుష్యాన్ని గుర్తించటం కోసం పైపులైనును తవ్వారు. కాలుష్యాన్ని గుర్తించక పోవటంతో రోజుల తరబడి అలాగే వదిలేశారు. ఫలితంగా పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' జలమండలి మేనేజరు శివప్రసాద్‌ను సంప్రదించగా కాలుష్యాన్ని గుర్తించటం ఆలస్యం జరిగిందన్నారు. రెండు రోజుల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. – **న్యూస్‌టుడే, పేట్‌బషీరాబాద్**

విశ్రాంత పోలీస్ అధికారుల అసోసియేషన్ ఏర్పాటు

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ సమావేశం ఆదివారం గాజులరామారం పరిధి హిర్డీ హిల్స్ కాలనీలో నిర్వహించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.గోవర్ధన్, గౌరవ అధ్యక్షుడిగా ఎ.శ్రీనివాసరావు, బి.వీరన్న, ప్రధాన కార్యదర్శిగా టి.వెంకటేశ్వరరావును ఎన్నుకున్నారు. గోవర్ధన్ మాట్లాడుతూ.. తెలంగాణలో పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉన్నా ఇప్పటివరకు రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఏర్పాటు కాలేదని రాష్ట్రంలో కూడా కొత్తగా అసోసియేషన్ ఏర్పాటు చేశామని, అదేవిధంగా అన్ని జిల్లాల్లోనూ అసోసియేషన్లు ఏర్పాటుచేసుకుంటున్నామన్నారు. కోశాధికారిగా పి.శివప్రసాద్, ఉపాధ్యక్షులుగా లక్ష్మణ్, శ్రీధర్‌రావు, సహాయ కార్యదర్శిగా ఎం.రమేష్, కార్యవర్గ సభ్యులుగా జె.శ్రీనివాసరావు, బి.జయసింహ, మాలకొండయ్య, వాజిద్‌అలీ ఖాన్, గంగారాంలు ఉన్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

యువకుడికి సభ్యత్వం ఇస్తున్న భాజపా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్. మల్లారెడ్డి

దుండిగల్, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదును నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి అన్నారు. దుండిగల్ పురపాలిక పరిధి డి.పోచంపల్లిలో ఆదివారం నిర్వహించిన భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పురపాలక భాజపా అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, నాయకులు శ్రీశైలం యాదవ్, మధు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారం డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో ఆదివారం కార్పొరేటర్ రావుల శేషగిరి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. సుభాష్‌చంద్రబోస్‌నగర్, శ్రీరాంనగర్, ఎన్టీఆర్‌నగర్, అంబేద్కర్‌నగర్‌లలో ఇంటింటికి తిరిగి ప్రత్యేక యాప్ ద్వారా నమోదు ప్రక్రియ చేశారు. నాయకులు నర్సింహ, కిష్టయ్య పాల్గొన్నారు.

ఇది సీఆర్‌ఎంపీ రహదారేనా..!

జీడిమెట్ల పారిశ్రామిక వాడలో రహదారి పక్కన మట్టికుప్ప

పాదబాటపై వ్యర్థాలు..

ఐడీపీఎల్‌కాలనీ నుంచి సూరారం కట్టమైసమ్మ ఆలయం వరకు 7.5 కి.మీ. నర్సాపూర్ ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరించి ఉంది. సీఆర్‌ఎంపీ (సమగ్ర రహదారుల నిర్వహణ కార్యక్రమం) కింద రూ.14.5 కోట్లతో ఈ రోడ్డు నిర్వహణ బాధ్యతను నాలుగున్నరేళ్ల క్రితం ఓ కాంట్రాక్టు ఏజెన్సీకి అప్పగించారు. రహదారి విస్తరణతోపాటు లేన్‌మార్కింగ్, కాలిబాటల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, మ్యాన్‌హోళ్ల మూతలను అమర్చడం వంటి పనులు చేయాల్సి ఉంది. కానీ కాంట్రాక్టు కాలపరిమితి ఈ ఏడాదితో పూర్తికానుండటతో నిర్వహణ గాలికి వదిలేశారు. దీంతో రహదారిపై నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారం, చెట్లకొమ్మలు వేయడంతో అధ్వాన్నంగా మారింది. – **న్యూస్‌టుడే, కుత్బుల్లాపూర్**

రోడ్డు వెంట వేసిన చెట్ల కొమ్మలు, నిలిచిన నీరు

ఖాళీ స్థలాల్లో నీరు.. దోమల వ్యాప్తి

మల్లంపేట కేవీఆర్ వ్యాలీలో జనావాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో నీరు రోజుల తరబడి నిల్వ ఉంటుంది. ఫలితంగా అక్కడ దుర్వాసన వస్తోంది. ఆ ప్రదేశాలు దోమలకు ఆవాసంగా మారి రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు దోమల వ్యాప్తి అరికట్టేందుకు ఫాగింగ్ చేయాలని స్థానికులు కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, దుండిగల్**

మల్లంపేట కేవీఆర్ వ్యాలీలో జనావాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలంలో..

లోతట్టు ప్రాంతంలో ఇళ్ల మధ్య..

హైడ్రాతో పేదల జీవితాల్లో కల్లోలం : ఎంపీ

ఈటలను జ్ఞాపికతో సత్కరిస్తున్న కాలనీవాసులు

పీర్జాదిగూడ (బోడుప్పల్), న్యూస్‌టుడే: హైడ్రా పేరుతో ప్రభుత్వం పేదల జీవితాల్లో కల్లోలం సృష్టించిందని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటలరాజేందర్ మండిపడ్డారు. పీర్జాదిగూడ శంకర్‌నగర్ కాలనీ వాసులు ఆదివారం ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. మిషన్ భగీరథ, కాళేశ్వరంతో నిధులు కరిగిపోవడంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళనను తెరపైకి తీసుకువచ్చిందన్నారు. రాష్ట్ర భాజాపా కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై పాదయాత్ర

షాపూర్‌నగర్: గాజులరామారంలోని ప్రాణవాయు పార్కులో ఆదివారం కార్పొరేటర్ రావుల శేషగిరి సమస్యలపై పాదయాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పాదబాటలోకి చెట్లకొమ్మలు రావడం అక్కడ గుంతలు ఉండటంతో నడిచేవారికి ఇబ్బంది కలుగుతోందన్నారు. అనంతరం హార్టికల్చర్ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడారు. రెండు రోజుల్లో రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలను తొలగిస్తామని అధికారులు చెప్పినట్లు లేని పక్షంలో అందరం కలిసి ప్రాణవాయు పార్కులో స్వచ్ఛందంగా శ్రమదానం చేస్తామని తెలిపారు.

నడకబాట ఇలా.. నడిచేదెలా?

ప్రాణవాయు పార్కులో వాకింగ్‌ట్రాక్ ఇలా..

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారంలోని ప్రాణవాయు పార్కులో పాదబాట వాకింగ్‌ట్రాక్ పూర్తిగా దెబ్బతింది. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు గుంతలుపడి, చాలచోట్ల కంకర తేలి నడవటానికి ఇబ్బంది కలుగుతోంది. పార్కులో 3 కి.మీ మేర వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేశారు. పార్కు నిర్వహణ బాధ్యతలను ఇంకా ఎవరికీ అప్పగించకపోవడంతో పాదబాటతో పాటు పార్కులో చెట్లు ఏపుగా పెరిగి రోడ్డుపై నడిచేవారికి అడ్డుతగులుతున్నాయి. పార్కులోని సమస్యలను జీహెచ్ఎంసీ అధికారులకు చెప్పినా ప్రయోజనం ఉండటం లేదు. నిర్మాణం పూర్తిచేసిన తర్వాత బాధ్యతలను అటవీశాఖకు అప్పగిస్తామని అధికారులు చెప్పినా ఇంతవరకు ఆ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. వాకింగ్‌ట్రాక్‌పై మట్టి పోసి చదును చేయాలని పాదచారులు కోరుతున్నారు.

ప్రమాదం కనిపిస్తున్నా .. పట్టించుకోని అధికారులు

సమస్యలతో వినియోగదారులు సతమతం

కుత్బుల్లాపూర్‌లో నియంత్రిక చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు, కిందపడిన ఫ్యూజ్‌బాక్స్

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: విద్యుత్తు అధికారులు వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇటీవల ప్రజల వద్దకు వెళ్లారు. డీఈఈ నుంచి హెల్పర్ వరకు ఆయా ప్రాంతాల్లో తిరిగి సమస్యలు గుర్తించారు. గుర్తించిన సమస్యలు పనులు చేపట్టటానికి ఉన్నతాధికారుల దృష్టికి పంపారు. దీనికి తోడు విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించటం కోసం సదస్సులు నిర్వహించారు. సదస్సులో వచ్చిన ఫిర్యాదు పరిశీలించి తదనుగుణంగా సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉంది. అయితే అధికారులు చేపడుతున్న కార్యక్రమాలు మొక్కుబడిగా మాత్రమే ఉంటున్నాయని పలువురు వినియోగదారులు పేర్కొంటుండటం గమనార్హం. నియంత్రికల నిర్వహణ పట్టించుకోకపోవటంతో వాటి చుట్టూ పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. అలాగే కేబుల్ తీగలు నేలకు తాకుతున్నాయి. ఫలితంగా ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. న్యూ వివేకానందనగర్‌లో ఓ నియంత్రిక చేతి అందేంత ఎత్తులో ఉంది. ఫస్ట్ ఎవెన్యూ, మహానగర్ తదితర ప్రాంతాలకు చెందిన వినియోగదారులు అల్ప విద్యుత్తుతో తమ ప్రాంతాల్లో విలువైన గృహోపకరణాలు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా కాలనీల సంక్షేమ సంఘం నేతలు మేడ్చల్ డీఈఈ శ్రీనాథ్‌రెడ్డితో పాటు, విద్యుత్తు వినియోగదారుల సదస్సులో సైతం ఫిర్యాదు చేశారు. స్పందించిన ఉన్నతాధికారులు నియంత్రిక మంజూరు చేశారు. కింది స్థాయి అధికారులు ఆరు నెలల క్రితం నియంత్రిక తెచ్చి దిమ్మెపై ఏర్పాటు చేసి వదిలేశారు. నాటి నుంచి దిమ్మెపై అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. అధికారులు వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఏమాత్రం పట్టించుకోక పోవటం వల్ల ఈ దుస్థితి నెలకొంటుంది. అధికారులు ప్రమాదకరంగా ఉన్న నియంత్రికలకు వెంటనే మరమ్మతులు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

న్యూవివేకానందనగర్‌లో చేతికి అందేంత ఎత్తులో నియంత్రిక

కనెక్షన్ ఇవ్వటం లేదు: ప్రభాకర్‌రెడ్డి, ఫస్ట్ ఎవెన్యూ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు

విద్యుత్తు అధికారులు బిల్లుల వసూళ్లపై చూపిన శ్రద్ధ సమస్యలు పరిష్కరించటంలో చూపటం లేదు. తమ ప్రాంతంలో నియంత్రిక దిమ్మె ఏర్పాటు చేసి ఏడు నెలలు, నియంత్రిక ఏర్పాటు చేసి నాలుగు నెలలు అవుతోంది. కనెక్షన్ మాత్రం ఇవ్వటం లేదు. ప్రస్తుతం నియంత్రిక అలంకార ప్రాయంగా మారింది.

త్వరలో పరిష్కారం అయ్యేలా చర్యలు

– డీఈఈ శ్రీనాథ్‌రెడ్డి

మా దృష్టికి వచ్చిన విద్యుత్తు సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నాం. ఇటీవల అధికారులతో పాటు తమ సిబ్బంది కూడా ప్రజల్లోకి వెళ్లి సమస్యలు గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం మా దృష్టికి వచ్చిన సమస్యలు అతి త్వరలో పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడతాం.

లారీ ఢీ: ద్విచక్రవాహనదారుడి మృతి

కీసర: ఎలాంటి హెచ్చరికలు లేకుండా నిర్లక్ష్యంగా రోడ్డుపై నిలిపిన లారీని ఓ ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టడంలో మృత్యువాత పడిన సంఘటన శనివారం రాత్రి కీసర ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడిపల్లి మండలం పర్వతాపూర్‌కు చెందిన బట్టు అనిల్‌కుమార్(40) ద్విచక్రవాహనంపై కీసరకు వచ్చి ఇంటికి వెళ్తుండగా రామలింగేశ్వర కాలనీ రోడ్డులో ఈ ప్రమాదం జరిగింది. చీకట్లో లారీని ఢీకొట్టడంతో అక్కడికక్కడే చనిపోయాడు. కీసర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కీసర: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడిని ఆటో ఢీకొట్టడంతో దుర్మరణం చెందాడు. కాప్రా జమ్మిగడ్డకు చెందిన బాలరాజ్ (26), స్నేహితులతో కలిసి కీసర పరిధిలోని అంకిరెడ్డిపల్లికి వెళ్లారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో కీసర పెద్దమ్మ చెరువు సమీపంలో ఎదురుగా ప్రయాణికులతో వస్తున్న ఆటోద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. బాలరాజు తీవ్రగాయాలతో చనిపోయాడు.

సిబ్బందికి వైద్యపరీక్షలు నేటి నుంచి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోన్ పరిధి ఐదు సర్కిళ్లలో పనిచేసే పారిశుద్ధ్య, ఎంటమాలజీ సిబ్బందికి సోమవారం నుంచి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు జడ్సీ అపూర్వ్ చౌహాన్ తెలిపారు. సిబ్బంది ఆరోగ్యంగా ఉంటే జోన్ పరిధిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. మొత్తం 3,200మంది కార్మికులకు రోజుకో ప్రాంతంలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈఎస్ఐ వైద్యులు కార్మికులను పరీక్షించి మందులు పంపిణీ చేస్తారన్నారు.

'గాంధీ విగ్రహానికి రంగులు వేసిన భాజపా నేతలు'



నిజాంపేట: నిజాంపేట బస్టాండు చౌరస్తాలో ఉన్న మహాత్మ గాంధీ విగ్రహం రంగులు వెలిసిపోయి కళావిహీనంగా మారింది. భాజపా నిజాంపేట నగర శాఖ అధ్యక్షుడు మర్రి భిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు విగ్రహాన్ని కడిగి శుభ్రం చేసి కొత్తగా రంగులు వేశారు. దీంతో విగ్రహానికి పూర్వ వైభవం చేకూరినట్లైంది.

మురుగు పరుగు

సూరారం కాలనీ రాంలీలా మైదానం రోడ్డులో ..

జీడిమెట్ల, న్యూస్‌టుడే: సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ రాంలీలా మైదానం రోడ్డులో మురుగు పరుగు పెడుతోంది. రోజూ ఉదయం మ్యాన్‌హోళ్లు పొంగి మురుగు రోడ్డుపై ప్రవహిస్తుంటుంది. స్థానికులు, రాజకీయ నేతలు జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా పరిష్కారానికి నోచుకోలేదు. మురుగులో నుంచే రాకపోకలు సాగించాల్సి వస్తోందని, సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మద్యం మత్తులో కారు ఢీ.. ఆరేళ్ల పాపకు గాయాలు

మూసాపేట, న్యూస్‌టుడే: అర్ధరాత్రి మద్యం మత్తులో అతివేగంగా కారును నడిపి ముందు వెళ్తున్న మరో కారును ఢీకొట్టిన ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై దీక్షిత తెలిపిన ప్రకారం.. కూకట్‌పల్లి కమలప్రసన్నానగర్‌కు చెందిన ఎస్.రుగ్వేద్ అనే ప్రైవేటు ఉద్యోగి కుటుంబంతో సహా కారులో వరంగల్ నుంచి బయలుదేరి ఇంటికి వస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి వివేకానందనగర్‌లోని అభిరుచి టిఫిన్స్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు వీరిని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రుగ్వేద్ కారు ధ్వంసమైంది. కారులో ఉన్న ఆరేళ్ల చిన్నారి తలకు స్వల్ప గాయాలయ్యాయి. కారు యజమాని ఆనంద్‌ను స్థానికులు పట్టుకున్నారు. అతను మద్యం మత్తులో ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

WANTED TEACHERS
TELUGU AND P.E.T To TEACH HIGH SCHOOL, PART TIME / FULL TIME TEACHERS
GOOD SHEPHERD HIGH SCHOOL
SRINIVAS NAGAR COLONY
G.R. ROAD
Ph:9866796321
9010796321

(c) eenadu